RSVM01 A108

మూఁడవ సంపుటము.] [మొదటి భాగము.

# గ్రంథాలయ సర్వస్వము.

ఆంధ్రదేశ గ్రంథాలయసంఘ పక్షమున సంవత్సరమునకు ఆరు భాగములు చొప్పున ప్రకటింపబడు గ్రంథము.

సీ. అక్షరాస్యునకు నిరక్షరాస్యునకును ♦ విద్యసుబోధమై వెలయవలయు
ధనమున్న లేకున్న తగినగ్రంథముఁజూడ ♦ నభిలాషగలయప్పు డమరవలయు
పదుగురొక్కెడఁజేరి భాషించుకరవాణి ♦ భువనమోహినియౌచుఁ బొదలవలయు
వీనులచేనైన వీక్షణంబులనైన ♦ మంచిచెడ్డలవృష్టి మనుపవలయు
గీ. దేశమెల్లెడ విజ్ఞానదీపవితతి ♦ వలయునదియెల్ల గనుపింప వెలుఁగవలయు
భుక్తియునుముక్తియు మహానురక్తి మెలఁగ♦గ్రంథభాండారములుభువిఁ గాలవలయు.

కార్యస్థానము: బెజవాడ.

బెజవాడ వాణీ ముద్రాక్షరశాలయందు
బి. కే. స్వామిచే ముద్రింపబడియె.

౧౯౧౮

వార్షికమూల్యము. రు 3-౦-౦] [విడిసంచిక వెల రు ౦-౮-౦.

THE FIFTH

# Andhra Desa Libraries Conference

WILL BE HELD AT

*Anakapalli; Vizag Dt.*

**In the Month of May 1918.**

ఐదవ

## ఆంధ్ర దేశ గ్రంధాలయ ప్రతినిధుల మహాసభ

## విశాఖపట్నముజిల్లా, అనకాపల్లియందు

౧౯౧౮ సం॥ మేనెలయందు జరుగును. విరివిగ ప్రయత్నములు చేయబడుచున్నవి.

---

## ఆరోగ్యగీతము

అమూల్యములగు ఆరోగ్యనియమములు. గీతరూపముగ మనోహరముగ లఘువ్యాఖ్యతో సకలజనోపయోగముగ, వ్రాయబడినది. బాలురకు బాలికలకు బహుమతిగనియ్యదగిన చక్కని గ్రంథము. వెల ౦–౧–౦

## జనపదోధ్వంసనీయము

దేశమందంతటను వ్యాపించి భయంకరములగుచున్న మశూచి మహామారి మొదలగు ఘోరవ్యాధుల యుత్పత్తి నివారణములను గురించి చరకమహర్షిమత మీగ్రంథమున తేటతెల్లముగ వ్రాయబడియున్నది. వెల ౦–౧–౦.

ఈ రెండుగ్రంథములును ఉభయవైద్యసాంప్రదాయ వేత్తలగు డాక్టరు దంటు సుబ్బావధానులుగారిచే రచింపబడినవి. వలయువారిట్లు వ్రాయవలెను:—

గోపరాజు బ్రహ్మానందము, సేవకాసంఘ కార్యస్థానము, బెజవాడ.

---

## ప్రకటన.

మాయొద్ద సంస్కృతాంధ్రగ్రంథములు న్యాయమైన ధరలకు దొరుకును. క్యేటలాగు ఉచితము.

ఆంధ్రగ్రంధాలయము, పోస్టుబాక్సు 73 సి. చెన్నపురి.

# రాజపోషకులు

శ్రీ శ్రీ రాజా రావు వేంకట కుమారమహీపతి సూర్యారావు బహద్దరుగారు
శ్రీ శ్రీ రాజా నాయని వేంకట రంగారావు బహద్దరుగారు
శ్రీ శ్రీ బెల్లంకొండ రాఘవరావుగారు, అగ్రహారందారు

# పోషకులు

శ్రీ శ్రీ రాజా గోవిందకృష్ణయాచేంద్రబహద్దరుగారు
శ్రీ శ్రీ రాజా కోటగిరి వేంకటకృష్ణారావు బహద్దరుగారు
శ్రీ శ్రీ మోతే గంగరాజుగారు, జమీందారు, విస్సన్నపేట
చిగురుపాటి వేంకటసుబ్బారావుగారు
బండి వేంకటకృష్ణయ్యగారు
శ్రీ లక్ష్మీకాంత పుస్తకభాండాగారము, కొవ్వూరపాడు
సాళం కృష్ణారావుగారు
కుప్పా శ్రీరామశర్మగారు
పోణకా పట్టాభిరామారెడ్డిగారు

# అభిమానులు

చెలికాని లచ్చారావుగారు, జమీందారు, ఎర్రకూరేగు వయా రా
అనుమల్లి గోపాలకృష్ణయ్యగారు, ప్రొప్రైటరు
పెద్దిభొట్ల వీరయ్యగారు, బి.ఏ., బి.యల్.,
అయ్యదేవర కాళేశ్వరరావుగారు, బీ.ఏ., బి.యల్.,
సూరి వేంకటనరసింహశాస్త్రిగారు, బి.ఏ.
గూడూరి లక్ష్మణరావుగారు, బి.ఏ.
అద్దంకి సత్యనారాయణ శర్మగారు
బొడ్డపాటి హనుమంతరావుగారు
చట్టి నరసింహారావుగారు

# సహాయులు

తూట వేంకటరత్నం నాయుడుగారు

# విషయసూచిక


...సుమమంజరి (పద్యములు) ౧
వేంకటపార్వతీశ్వర కవులు
...కీబోయీలు (పద్యములు) ౪
అధికార్ల సూర్యనారాయణరావుగారు
...కమైనశోకము (పద్యములు) ,,
రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు
...ధము (పద్యములు) ౬
మంగిపూడి వేంకటశర్మగారు
...విపాట (పద్యములు) ౭
ఉమర్ ఆలీషాకవిగారు
...ధికాగితము (పద్యములు) ౮
బసవరాజు అప్పారావుగారు
...ద్రగ్రంథాలయము—బరోడా ౯
...చారగ్రంథాలయములు—బరోడా ౧౨
...థాలయస్థాపన ౧౪
నూరి వేంకటనరసింహశాస్త్రిగారు
...దూ దేశగ్రంథభాండాగారులసభ ౧౮
...థాలయములు ౧౯
దండు నారాయణరాజుగారు
...చార గ్రంథాలయములు—
మైసూరురాజ్యము ౨౦

గంజామండల గ్రంథాలయసంఘము—
మొదటికార్య నిర్వాహకసభ ౨౨
రెండవ కార్యనిర్వాహకసభ ౩౧
త్రేతాయుగమునాటి హిందూర్యులు—
వారి భూగోళశాస్త్రజ్ఞానము ౨౩
మాడపాటి హనుమంతరావుగారు
ఇంద్రవర్మ కోణ్డణగూరుశాసనము ౨౭
వంగూరి సుబ్బారావుగారు
కాగితములులేని పుస్తకములు ౨౯
గ్రంథవిమర్శనము—
౧ విజయవిజయము ౩౨
౨ ప్రియదర్శిక ,,
౩ జ్ఞానాంజనము ౩౩
౪ జీవకారుణ్యము ,,
౫ స్మరణామృతము ౩౭
౬ గోఖలే పరమహంస ,,
విజ్ఞప్తి. ౩౮
శ్రీ సుజనానందనీగ్రంథాలయము—రాయదుర్గ. ,,
గ్రంథాలయోద్యమవ్యాప్తి ౧౯
గోపరాజు బ్రహ్మానందముగారు


# చిత్రపటములు


కేంద్రగ్రంథాలయము-బరోడా.

...లశాఖ:- కథలుచెప్పునట్టియు, "సినిమెటోగ్రాఫు" యంత్రమునుండి చిత్రపటములను చూపునట్టియు, సమయము. ౧
బరోడాయందు జరిగిన ప్రదర్శనమునందు గ్రంథాలయశాఖ:—
...విధ దేశములయందలి గొప్ప గ్రంథాలయముల పటములు ౧౦
...విధ గ్రంథములు, చిత్రపట ప్రదర్శన సాధనములు ,,
...లశాఖ ,,

కేంద్రగ్రంథాలయము-బరోడా.

౫ సంచార గ్రంథాలయముల పెట్టెలు ౧౨
౬ బొంబాయి గవర్నరుగారి సతీతిలకమగు వెల్లింగుటను ప్రభ్విగారికి బహుమతిగా నియ్యబడిన, సంచార గ్రంథాలయపేటిక ౧౩
౭ మహాభారతానుసారము ప్రపంచపటము ౨౩
౮ రామాయణానుసారము ప్రపంచపటము ౨౪

## కేంద్ర గ్రంథాలయము — బరోడా.

### బాలశాఖ.



కథలు చెప్పునట్టియు, "సినిమెటాగ్రాఫు" యంత్రమునుండి చిత్రపటములను చూపునట్టియు, సమయము.

# వసంతము

[ శ్రీ రవీంద్రనాథ టాగూరు విరచితము. శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారిచే
'గ్రంథాలయసర్వస్వము'నకై ప్రత్యేకముగ వ్రాయబడినది. ]

నేనువచ్చానమ్మ ♦ నేనువచ్చాను
ఆలసించరారె ♦ యాడుకొందాము.

* * *

ఏనాటి తొలికౌగి ♦ లెదట దాచావె?
నాపూల పల్లకి ♦ నేపొంత నిలిచె?
తేనె వసంతాల ♦ కీరమ్ములాగి
పసుపుకోకలు పిడుం ♦ దపయాడ వాల్చి
నేనువచ్చానమ్మ ♦ నేనువచ్చాను
ఆలసించరారె ♦ యాడుకొందాము.

వేసవే వీసుచు ♦ వేసాల మొల్ల !
ప్రొద్దుప్రొద్దున పూయు ♦ ముద్దురోజా !
మవ్వముల్ రువ్వేటి ♦ మధ్యాహ్నమల్లె !
అందాలుపిలిచేటి ♦ సందెసంపంగి !
పైరగాలికినవ్వ ♦ పడుచునే వంగి
నేనువచ్చానమ్మ ♦ నేనువచ్చాను
ఆలసించకరారె ♦ ఆడుకొందాము.

* * *

చూచినావోయి కుచ్చులపూలరంగ !
సీమంతి మాపు వెన్నెలకోనేకాడ !
చిగురుపాగాచెంగు ♦ లెగిరే జీరాడ !
పసుపుప్రాయమువాడి ♦ పగిలిపోవంగ
తోపువీరెలమావి ♦ దాపలిదిశల
విరజాజిపందిళ్ళ ♦ వెలపలిపొదల
నిన్ను జూచావోయి ♦ నెఱజాణతనక !
నీకు విచ్చావోయి ♦ పోకిళ్ళపుట్ట !

* * *

ఎవ్వరే నవుబల్క ♦ రించేరు ఇచట
మురళివాయించుచే ♦ పోవుచుండగను

* * *

మావికొమ్మను నేను ♦ మన్మథాకార
నిలుపంజాలనికక ♦ నిన్ను పిల్చేను.
నిన్ను జూడకమున్నె ♦ నీదివ్యమూర్తి
నీపూతవాసనల్ ♦ రాపాడినన్ను
నాచిత్తమునుగూడ ♦ దోచెంగదోయి !
నిన్నెఱుంగకముందె ♦ నిన్ను భావించి
ప్రేమించినానోయి ♦ జేలనై స్వామి !
మావికొమ్మను నేను ♦ మన్మథాకార !
నిలుపంజాలనికక ♦ నిన్ను పిల్చేను

* * *

తొలిజాము చల్లగా ♦ తొలగినపిదప,
ఆటపాటలకెక్కి ♦ యలసినవెనుక
నిధిలోపల సూరి ♦ వేడియెత్తంగ,
కడవల నిరాన ♦ కాకు లేగంగ,
వేసవి తలసూప ♦ నేనొక్కసోలి
నిప్రక్కమింతావే ♦ నిలుతురే మీరు?
ఎవ్వరే నవుబల్క ♦ రించేరు ఇచట
మురళివాయించుచే ♦ పోవుచుండగను.

నేను వస్తానోయి ♦ నేను వస్తాను
మొగ్గమల్లెను నేను ♦ ముడిపాల మొలక!
నీ యుత్తరీయంపు ♦ నెడబట్టికొని
నీ కస్తూరపుతమ్మ ♦ నిగ్గునందికొని
నీ నిల్పుచిలకమ్మ ♦ లోన చిమ్మగిలి
నీ రాగమాలలో ♦ దారనై పెనగి
నలుపుంచో కడదాక ♦ నిలచియుంటాను.

*　　　*　　　*

సన్నజాజిని నేను ♦ సరసాల చైత్ర!
నేనెచిన్నదాననేను ♦ ఏపాపపుత్రి!
నీ సిగపూలలో ♦ వాసనై యణగి
నీ కంఠమాలలో ♦ నేరునై నిలచి
పూలు నేకులుకూడ ♦ పాలుపారుదాక
తన్మయత్వమునుగూడి ♦ తనివి నిండుదాక
నీ వాక్కుకర్థమై ♦ నే వెల్లుతాను
నీ చూపుపాపనై ♦ నే నటిస్తాను.

*　　　*　　　*

నడబాల్యమలిగేటి ♦ యెండ కాలమున,
నరులేడక కృశించు ♦ నసరాశియెవనే?
నావేణుపనుకేస ♦ ణమ్మగాసాది
అప్పగింతలుపాసు ♦ నార్తికాలమున
ఎల్లెడనాకులు ♦ ఆల్లాడు వేళ
అంటియుంటా నవ్వ ♦ రపుకు నాడండ.

*　　　*　　　*

గన్నేరు పువ్వు నే ♦ గరువాలగడ్డ!
నిన్ను మోహించాడు ♦ నిండారు మోమ్మ
నీను కౌగిటనన్ను ♦ నిలువనిమ్మోయి
నీ శయ్యనన్ను రాణించనిమ్మోయి
నీ నవ్వుచల్వలో ♦ నాననిమ్మోయి
నీ లాలనసుఖాన ♦ తేలనిమ్మోయి.

*　　　*　　　*

మందారమును నేను ♦ మార్చిపిపాసి
నీ మపచ్చనిరూపు ♦ నేకోరినాను
ఏ కిన్నెరస్వరాన ♦ ఎలుగెత్తిమమ్ము
పిలిచినో ఆముష్మ ♦ పిలుపులోపలనె
కలదు నీ నవియోగ ♦ గద్గదస్వరమె.
నేనెఱుంగుదునోయి ♦ నీరహస్యములు
ఎందుకో ఆలస్య ♦ మెందుకో అలత
ఎందుకో సందేహ ♦ మెందుకో కొఱత
అందుకోవోయి! మో ♦ హనసూత్రధారి
నా ప్రేమపూస లందపుదండగట్టి.

మూడవ సంపుటము.

# గ్రంథాలయ సర్వస్వము.

మొదటి భాగము

## కుసుమమంజరి

అనునిమేషము విచిత్రా కృతుల్ దాల్చి
యఖిల ప్రపంచ మహా గార్యమునకు
బట్టంపురాణివై • పాలించుచున్న
ప్రకృతికి మ్రొక్కులు • పదివేలు వేలు.

---

పరిదృశ్యమాన ప్రపంచరంగమున
నాకస్మికంబుగా • ననపేక్షితముగ
బంధమోక్షంబులుఁ • బాపపుణ్యములుఁ
గష్టసుఖంబులుఁ • గలుగుచుండ
నానందసరసిలో • ననుగాగుసుమము
దుఃఖగంధంబుల • దొరలించుచుండ
సంతాపవార్ధి నాశా తరంగములు
విమలమౌక్తికముల • వెదజల్లుచుండ
శుక్తిమౌక్తికమయి • దాఁపట్టు చినుకు
కడలిలోఁబడి ముప్పు • గల్గుచుండ
నంబరు వెగ్గలైన • యంబుదాగమము
నెమ్మికి నానంద • నిలయమౌచుండ
రాల్చెడు కొమ్మలు • గాల్చుచునుండఁ
జిగిరించుకొమ్మలు • చిగిరించుచుండ
నొకచేత మెఱయుచు • నుండు కాంచనము
మఱియొక్క చేతిలో • మాయమౌచుండఁ
జెలువంపుఁదొడవున • జిగజిగ మెఱయు
మణి యొక్కతఱిఁ జచ్చు • మందగుచుండు
గడగడ సర్వాంగ • కములఁ దూలించు
చలిగాలి యొకవేళఁ • జల్లనౌచుండు
సురభిళకుసుమంబు • శుష్క కంటకము
నొక్కగులాబియం • దొడఁగూడినట్లు
గుణమును దోషంబుఁ • గూడి యొక్కెడనె
యతివిచిత్రంబుగా • నగపడుచుండఁ
గర్మపద్ధతిఁబట్టి • కాలంబుఁబట్టి
మంచిచెడ్డలగతుల్ • మారుచునుండు
నిట్టిచూచుచునుండ • నింతటిమార్పు
లెట్టుకల్పించునో • యెవరెఱుంగుదురు?
కష్టంపుఁబేటిలోఁ • గౌతుకనాక
సంతోషజలధిలో • సంతాపశిఖరి
నేలనిర్మించునో • యెవ్వరికెఱుక?

---

కోమరారుచెంగల్వ • కొలని తీరమునఁ
గుదురైన సురపొన్న • గున్నకొమ్మలను
నంటియు నంటక • యట్టిట్టూఁగాడి
కులికెడు పొగడపూ • గొమ్మ మాయమ్మ
మధుమాసయామినిఁ • మాధవుఁగాంచి
పొడవున మాయమ్మ • పులకించినపుడు
సొంపైన చిగురాకు • బొంపంబునడుమఁ

బూసంత మేనితోఁ ♦ బుట్టితి నేను
మాయమ్మతోఁగూడి ♦ మలయానిలమున
విలసిల్లు సురపొన్న ♦ విరిగొమ్మకూడ
నాతల్లితనివార ♦ ననుఁగన్నయపుడె
యుల్లంబు రంజిల్ల ♦ నొకమొగ్గఁదొడిగె
సారంబులోఁగొని ♦ శ్రమల నందించి
సంతత సంతాప ♦ సంతతిఁగూర్చి
కలగించుచుండఁగాఁ ♦ గన్నతల్లులకు
సంతానమున నింత ♦ సంతోషమే మొ?
పొన్నయుఁబోగడయు ♦ మున్నున్నకంటెఁ
గన్నులపండువు ♦ గా నొప్పుచుండె
సురపొన్న క్రొన్నన ♦ సొంపొందుచోటఁ
జిగురాకు దువ్వల్వ ♦ చిక్కని మొత్త
నేనుంటి నెండ కన్నెఱుఁగకయుండఁ
జందనానిలమిచ్చు ♦ జలశీకరముల
చలువల వెన్నెల ♦ చలువలదోగి
యేకష్ట మెఱుఁగక ♦ యే మిర్వురమును
బొదలుచు నుంటిమి ♦ పూటకుఁబూట
నుల్లంబు పొంగార ♦ నొండొంటినొరసి
కులుకుచుఁగంటిమి ♦ కోరకాకృతులఁ
బుష్పాడి నెత్తావిఁ ♦ బోరయాకమున్న
తోరంపువిరిదేనె ♦ దొరలకమున్న
వచ్చియురాని జవ్వనపుఁ గ్రొమ్మిసిమిఁ
జెలువారు చెలువల ♦ చెలువంబుఁ దెగడి
మనములఁదనియించు ♦ మారూపుఁజూచి
సంభ్రమమునవచ్చి ♦ షట్పదగణము
మాచుట్టుఁదిరుగుచు ♦ మధురగీతముల
భావంబుదనియంగఁ ♦ బాడంగఁదొడఁగె
లలిత వసంత విలాసంబు గాఁగ
మంచిముహూర్తంబున ♦ మాకిర్వురకును
బసితనంబుదొరంగి ♦ పరువంబువచ్చె
నెలజవ్వనంబు రేకెత్తంగఁ దొడఁగె
మలయసమీర కుమారుఁ డామొదనె
మాకమ్మతావుల ♦ మలయించెఁగడలఁ
దళతళ మెఱయు చిత్రాస్వాతులట్లు
తనమానసంబును ♦ దనియించుచుమ్మ

బాలచంద్రుఁడుచూచి ♦ పకపకనగియె
మావికాసంబును ♦ మావిలాసంబు
మా యనురాగంబు ♦ మాచెల్మిఁజూచి
మకరందమునకంటె ♦ మధురన్నె హెచ్చు
మధురస్వరంబుతో ♦ మా పేరిమీఁదఁ
గలకంఠమింపుగా ♦ గానంబుచేసె
వేగునవిందార ♦ విరిసినమమ్ము
గని వెల్లనగుచు నక్షత్రంబులెల్ల
మాలోనఁబొంగారు ♦ మకరందమందుఁ
దమరూప మొకసారి ♦ తళుకుమన్నంత
నదిగదా ధన్యత ♦ యని పొంగిపోయె
నెడబాయకున్న మా యిరువురి చెలువు
నూతనానంద మనోరమంబయ్యె
నిరువురి పరిమళ ♦ మేకమై దెసలఁ
జెలువొందఁ గనునుల్లసిలె నొక్క రజని
యెల్లదిక్కులనుండు ♦ నిందిందిరములు
పండువెన్నెలవోలె ♦ బయలెల్లవిరియు
వలపులచే నాసవాల్పట్టి వచ్చి
మధురామృతముకంటె ♦ మాధుర్యమగుచు
మాలోన నిండారు ♦ మకరందమాని
సమ్మదంబునఁబొంగి ♦ స్వాంతంబు లలర
మధురాకృతులనొప్పు ♦ మామూలమున నె
వరలె వసంతాప్తి ♦ వసుమతిననుచుఁ
బొగడ పొన్నలనేము ♦ పుట్టుటకతనఁ
బ్రమదావనంబు సార్థకమయ్యె ననుచు
భావంబులిగురింపఁ ♦ బాటలుపాడె.
నాకుల చాటున ♦ నగపడకుండఁ
గాసంత మేనితోఁ ♦ గ్రాలుచుండినను
బొగడంగఁ దగునట్టి ♦ పూవులమగుట
నిఖిల భూభాగంబు ♦ నిండె మాతావి
ప్రత్యూషపవన సంపత్తితోఁగూడిఁ
బరిపూర్ణమయ్యె మా పరువంబుఁగూడ
నుదయరాగంబుతో ♦ నొక్కింతసేపు
మిలమిలలాడుచు ♦ మేమాడుచుండ
బాలసూర్యుఁడు తన ♦ బాహులుసాచి
పరువంపుమా మేన ♦ బంగారుపూసె

* * *

సకలలోకామోద ♦ సరణిఁ జేకూర్చు
నీవసంతం బెప్డు ♦ డిట్టులే యుండి
యలరింపవలెనని ♦ యాశలు మాకు
మోహనసంగీత ♦ మును బాడుకొనుచు
నగులు మాతావుల ♦ నరయుచువచ్చి
మురియింపవలెనని ♦ ముచ్చటల్ మాకు
నలువగంధపుగొండ ♦ చక్కటునుండి
చిఱుతమారుతములు ♦ చెంగటఁ జేరి
వలపింపవలెనని ♦ వాంఛలు మాకు
జగతికంతకు సుధా ♦ సారంబుఁ జిలుకు
పండువెన్నెలలు మా ♦ పరువంపురూపు
వెలయింపవలెనని ♦ వేడ్కలు మాకు
చిగురాకు నునుసెజ్జ ♦ చెదరకయుండ
మముఁ బ్రియంబునఁ జేర్చి ♦ మాతల్లులెపుడుఁ
గులికింపవలెనని ♦ కోర్కులు మాకు
నిగనిగలాడు మా ♦ నెమ్మేనులందు
మవ్వంబు సెడకుండ ♦ మాకోర్కులిట్లె
ఫలియింపవలెనని ♦ భ్రాంతులు మాకు
అవనిజీవుల యాశ ♦ కంతంబులేదు
ప్రకృతికెప్పుడుఁ గృపా ♦ భావంబులేదు
ఈవసంతంబిట్టు ♦ లే యుండియుండి
యేరీతిమారునో ♦ యెవ్వరికెఱుక!
యీయళిసంగీత ♦ మే వేళకట్టు
లేమయిపోవునో ♦ యెవ్వరికెఱుక!
యీ మలయానిలం ♦ బిటునటుఁ దిరిగి
యెటువచ్చి యెటుపోనో ♦ యెవ్వరికెఱుక!
యీచల్వరేయెండ ♦ యింతలో జరగి
యేయెండగాయునో ♦ యెవ్వరికెఱుక!
యీనునుజిగురాకు ♦ లీరీతినుండ
నేకాఱువచ్చునో ♦ యెవ్వరికెఱుక!
వెలిసినకోర్కుల ♦ విలసిల్లు మేని
కేపాటువచ్చునో ♦ యెవ్వరికెఱుక!
యేమని చెప్పుదు ♦ నేకైకనిమిష
పరిణామశీలయా ♦ ప్రకృతిచందములు;

యేగాలిచేసె మ ♦ మ్మింతటివాని
నా గాలియేవచ్చి ♦ యట్టె తూలించి
మాబంధమెడలించి ♦ మమ్ముఁ గొంపోయి
యంతరాళంబున ♦ నటునిటుఁ ద్రిప్పి
పచ్చికబయటను ♦ బడఁద్రోసిపోయెఁ
బొన్నపూఁగొమ్మను ♦ బొగడయున్నదియొ
పొగడయే యున్నదో ♦ పొన్నపూఁగొమ్మ
నూహింపరాకుండ ♦ నొకరీతినుండి
యిరువురి పరిమళం ♦ బిదియిది యనుచు
విభజింపరాకుండ ♦ విలసిల్లుచుండి
యెన్ని నూత్న కోరిక ♦ లీరికలెత్త
నెంతయో సంతోష ♦ మిగురించుచుండఁ
బాపపుదైవమో ♦ ప్రకృతియో యేగా
బంధంబుఁ దెగఁగోసి ♦ పగఁదీర్చుకొనియెఁ
దల్లిగర్భమునుండి ♦ తరలిన వేళఁ
గోరకాకృతిఁ బండు ♦ కొనియున్న వేళఁ
చిన్నగాఁ గన్నులు ♦ తెఱవని వేళఁ
గనువిచ్చి జగమెల్లఁ ♦ గాంచిన వేళ
యే వేళ గణియింప ♦ నెట్టిదో కాని
యిట్టె మాకీవేళ ♦ కీపాటుగలిగె;
పరికింపఁ జెలిమియుఁ ♦ బగయును లేక
యంతలోననె మార్పు ♦ నందించుచున్న
యీ ప్రకృతిని మన ♦ మేమనఁగలము?
భిన్న భావంబుల ♦ భిన్న తేజముల
భిన్న గుణంబుల ♦ భిన్న రూపముల
నగపడుచుండు నీ ♦ యఖిలజగంబు
నేక తేజంబున ♦ నే యుద్భవించి
యేక తేజంబున ♦ నే వృద్ధిగాంచి
యేక తేజంబున ♦ నే లీనమంది
యేకీభవించుట ♦ యే సత్యమేని
యేకాకృతి వెలుంగు ♦ నీశ్వరుఁ డెపుడు
జీవులఁ దరియింపఁ ♦ జేయునయేని
నిర్గుణుండైన యా ♦ నిర్మలమూర్తి
సగుణుండై సేవాఫ ♦ లమిచ్చునేని
యేభక్తులైన మ ♦ మ్మిరువురఁ జేర్చి

గుణవిశిష్టంబైన ♦ కోవనుగూర్చి
విశ్వేశునర్చించు ♦ వేళ రాదన్నె?
సచ్చిదానంద ప్ర♦శాంతభావమున
నైక్యానుసంధాన ♦ మబ్బకయున్నె?

పొఁగడదుఁబొన్నదు ♦ బూవులమైన
వాసనావశత నీ ♦ వాంఛజనించె
నిది యపరాధమం ♦ చెవరనఁగలరు?
—వేంకటపార్వతీశ్వరకవులు.

# పల్లకీబోయీలు

[ శ్రీమతి సరోజినీదేవిచే వ్రాయబడినదాని భాషాంతరీకరణము. ]

మొయ్యరా అమ్మోర్ని మొయ్
మొయ్యరా పల్లకీ మొయ్

౧. మనపాట గాలిలో నన లెత్తు పువ్వురా,
కన్నె పెదవులజారు కలలోని నవ్వురా,
యేటినురగలపైని నీడేటి బాతురా,
దారమున ముత్యంపుతీరుగల నాతిరా,
ఆడుచూ పాడుచూ,
అందముగ నడచుచూ,
మొయ్యరా అమ్మోర్ని మొయ్,
మొయ్యరా పల్లకీ మొయ్.

౨. అలలతలపైగంతు యెలమావి మొక్కరా,
మనతేనెపాటల మంచులోచుక్కరా,
వెండిబుడ్లల్లోన నిండు పన్నీరురా,
పెండ్లికూతురుకంట వెడలుకన్నీరురా,
ఆడుచూ పాడుచూ,
అందముగ నడచుచూ,
మొయ్యరా అమ్మోర్ని మొయ్,
మొయ్యరా పల్లకీ మొయ్.

—అధికార్ల సూర్యనారాయణరావుగారు,
బి. ఏ., బి. ఎల్.

# "శ్లోకమైన శోకము"

[ అజవిలాపము. ] *

తే. నిద్దపుం జన్నుఁగవ పయి నిలిచి నిమిష
మాత్ర సఖి యైన యా సుమమాలఁ గాంచి,
సోలి కన్నులుమూసె భూపాలు దయిత;
నెలను రాహువు మ్రింగ వెన్నెలయుఁబోలె.

ఆ. అతఁడేడ్చె సహజమైన ధైర్యముగూడఁ
గలఁగిపోవ, బాష్పగద్గదముగ;
ఇనుముగూడఁ దాప మెనసిన మెత్తనౌఁ;
దనువు గల్గువారిఁ దడవవలెనె?.

తే. "అకట! యించుకమై సోఁకి నంతఁ బువులు-
నైత మాయువుఁబోకార్పఁ జాలు నేని,
పాపిదైవమ్ము నరు నింకఁ బ్రాణికోటిఁ
జంపవలెనన్న దేనితోఁ జంపరాదు?

తే. కాక, మృదువైన వస్తువుఁగాదు సేయ
మృదు పదార్థంబ తెచ్చునో మృత్యువెపుడు?
మంచు సోఁకున నలగు తామరసవల్లి
కనుఁగొనిన నిందు మొదటి తార్కాణగాదె?

* నాచే నాంధ్రీకృతమైన రఘువంశమునుండి యెత్తఁబడినది.

తే. ఈ కుసుమమాలికయె చంపు నేని, యేల
నన్నుఁ జంపద యెద నిడికొన్నఁ గాని?
విషము నమృతంబయగు నొక్కవేళ, నమృత
మేనియు విషంబయగు నేమొ యీశ్వరేచ్ఛ!

తే. అదియుఁగాదేని నా యభాగ్యంబు కతన
యిట్టు లీ క్రొత్తపిడుగు నిర్మించె బ్రహ్మ;
ప్రాని నియ్యది గూల్పక, దానికొమ్మ
నాశ్రయించిన లేఁదీఁగ నగడువఱిచె!

క. తొలినుండి యెన్ని తప్పులు
పలుమఱు చేసినను గోపపడియు నెఱుఁగ వో
చెలి! తప్పులేనివాఁడను;
బలుకవు నేఁ డేల యొక్కసారిగ నాతోఁ?

తే. ఒక్కకూరిమిఁ జూపువాఁడను శకుండ
నేనని తలంచినావునూ నిజము, గాన
మధురహాసిని! యరిగితి మరలకుండ
నాకుఁ జెప్పకయే పరలోకమునకు.

తే. దయిత వెన్నంటి చనినది, దాని విడిచి
యిట్లు వెనుకకు మరలంగ నేల నాదు
కూళ జీవము? తాఁ జేసికొన్న తప్పు
వలని వలవంత లిపుడు సైఁపంగ వలయు!

తే. సురత ఖేదంబుచేఁ బొడసూపినట్టి
చెమట తుంపురు లింకను జెడవు నుదుట!
ఇంతలో న స్తమించితి విట్టు లకట
నీవు! దేహుల బ్రదుకెంత నీరసంబు!

తే. ఆత్మలో నేని, మున్ను నీ కప్రియంబుఁ
జేసియెఱుఁగను నన్నేల పాసితబల?
తీరుకీలిపతిఁ గాని, భావింప భావ
సిద్ధమగు కూర్మి నాకు నీచెంతఁ గాదె?

తే. గండుఁదేఁటుల నిగ్గులు గలిగి, పువులఁ
గూర్పఁబడియుండు నీ వక్రకుంతలములఁ
గదలఁజేయుచు మరల నీ బ్రదుకునందు
నాసపుట్టించెడిని గాలి, యబల! నాకు.

తే. నాదుప్రాణమ! వేగ కన్గవను విచ్చి
లెమ్ము నాదు విషాద భరమ్ము మాన్ప;
రేల హిమవంతు గుహ నావరించు తమము
వెలఁగి తొలగించు నోషధి విధము దోఁప.

తే. అలకలు చలింపఁ బొలిచి మాటాడలేని
నీదు నెమ్మోము నన్నుఁ గుందించె నిపుడు!
లోనఁ జిక్కిన తేంట్లు నిస్వాన మడఁగ
రాత్రి నిదిరించు క్రొందామరయునుబోలె.

తే. చందమామను రాతిరి, చక్రవాకి
తోడిపులుగును బాసియుఁ గూడు మగలఁ;
గాన విరహాంతరం బోర్వఁగలుగు; నీవు
మరలకయ చన్న నోర్తు నెమ్మాడ్కిఁ జెపుమ?

తే. ఎల చివురుటాకు పాన్పుపై నిడినఁగాని
కందిపోవును నీదు చొక్కంపు మేను;
అట్టిది లతాంగి! యిఁకపయి నెట్టు చెపుమ
యోర్వఁగల్గును జితిపయి నుంచినపుడు?

ఆ. ఇదిగో చెలువ! నీకు నేకాంత సఖి రత్న
గళన, జీవకళ దొరంగి నీవు
నడబెడంగు లెల్ల నుడుగఁ, జప్పుడులేక
నీదు వెంటనె మరణించెఁ బోలె.

తే. కోయిలలయందు ముద్దుఁబల్కులు, మరాళ
కాంతలందు మదాలసగతులు, లేఁడి
కన్నియలయందుఁ జలకటాక్షములు, పవన
చలితలతలందు విభ్రమ విలసనములు,
తెల్లముగ నిల్పినావునూ, దివికి నేఁగ
వలచియుండియు నీవు నాపాటుఁదలఁచి;
కాని, యవియెల్ల నీవియోగమునఁ గుందు
నాదు హృదయము నాదుకొనంగ లేవ.

తే. అల్ల మాకందతరువుఁ బ్రియంగులతయు
నలువుగాఁ బెంచితివి మిథునమ్ము గాఁగ;
చెలువ! వీనికిఁ బెండిలి సేయకుండఁ
దఱలిపోవుట యిటు నీకుఁ దగదు సుమ్ము!

తే. సుదతి! నీచేసినట్టి దోహదము వలనఁ
బెరిగిన యశోక మిది, నీదు కురుల కకట!
సొమ్ములుగ నిచ్చుచుండిన సుమములిప్పు
డెట్టులు నివాపవేళ నీకిత్తుఁ జెపుము?

తే. అన్యదుర్గంధముగఁ ద్రోయు నందె లొప్ప
నీవడుగుఁదమ్మిఁ దాఁచి మన్నించు టెల్లఁ
దలఁచికొనిఁ పూలకన్నీళులొలుక నిదిగో !
చెలియ ! చూడు మశోక మేడ్చెడిన పోలె.

తే. నీదు నిట్టూర్పు తావి రాణించు పొగడ
పువుల నాతోడ నీవరపొదిగినట్టి
యావిలాసంపు మొలనూలి నిటుముగింప
కుండఁ గిన్నరకంఠ ! పరుండెదేల?

తే. చెలులు సుఖదుఃఖములను బంచికొనువారు ;
క్రొన్నెలనుబోలు గారాబుఁ గొడుకు వీఁడు
నిన్నె నమ్మిన యేమను నున్న నకట!
నీవు పట్టిన పట్టెంత నిష్ఠురంబు !

తే. తెలివి సెడియెను; ధైర్యముదిగియెఁ ; బాట
సొగసు గడచెను; ఋతువుల చొక్కుముగిసె ;
సొమ్ములన్నియు నీకమీఁద వమ్ములయ్యె ;
నకట! పడకయుఁ బరిశూన్యమయ్యె నాకు!

తే. సతివి, మంత్రివి, యేకాంతసమయమందుఁ
జెలివి, ప్రియశిష్యురాలవు చిత్రకళల ;
నిన్ను హరియించి మృత్యువు నిర్దయాత్ముఁ
డేమి మిగిలించినట్లయ్యె నింక నాకు ?

క. మదిరాక్షి ! మధురమై మ
ద్వదనార్పితమైన యాసవముఁ గ్రోలుచు నే
మొద ; లెట్టులు గ్రోలెద ని
ష్ఠ దివంబున బాష్పదుష్టము నివాపంబుక ?

తే. ఎంతి వైభవముండినయేని యజున
కెల్ల సుఖములు ముగిసిన వెలుఁగుమింక?
నేఁబు పేరాసలేక జీవించు నాకు
సుఖములన్నియు నీతోడిసొత్తులబల !"

—రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ.

# నిశీధము

భానుమంతుఁడు లోకైకబాంధవుండు
చక్రరక్షణదక్షుఁడు చండతేజుఁ
డస్తమింపఁగ జగమెల్ల నార్తినొందె
భూనభోంతరములు మసిపూసినట్టు
లంధకారము ఘోరమై యలముకొనియె
మిన్నుమన్నను నేకమై యున్నకతన
కన్నులున్నఫలంబును గలుగదయ్యె
నిదుర లేచిన దాదిగ నుదరమునకు
విధి విరామము లేదఁగని వెతలఁబడుచు
దినమునం దెల్లచోటులఁ దిరిగి తిరిగి
స్వాశ్రమంబుల జేరుకొన్నట్టి ప్రాణి
కోటి యెంతయు విశ్రాంతిఁ గోరుచుండె
కాలమను మచ్చు నిదురను గాటమైన
మచ్చుమందునుజల్లి మైమరచి కీలు
లూడిపడియున్న బొమ్మలజాడనున్న
ప్రాణికోటుల చైతన్యమనెడు సొమ్ము
నపహరించెను నిశయయ్యె నంత ప్రకృతి
కలసిపోయెను నిశ్శబ్దగగనమందు
జంతుసంతాన మూపిరి సలుపు ధ్వనియుఁ
గలవరింతలచేఁ గల్గు కలకలంబుఁ
గాక కొండొకశబ్ద మెక్కడ నొకింత
శ్రవణపుటముల సోకదా సమయమందు
ప్రొద్దుఁదెలిపెడు గడియారములవలనను
చమురుఁ బీల్చెడు ఘన దీపచయమువలన
కెరలి నర్తించు సుకవి లేఖినులవలన
గాలిచేఁగదలెడు వృక్షగణమువలన
ఘూర్ణిలెడు పెద్ద పర్వత గుహలవలన
నెడతెగక ప్రవహించెడు నేళ్లవలన
నంబుధి తరంగ సంఘట్టనంబువలన
గహనముల నేర్చు కార్చిచ్చు కడిమివలన
గాక కొండొకశబ్ద మెక్కడను లేదు.
పులులు తోడేళ్ళు గుడ్లగూబలును పిల్లి

ఎలుకలును గబ్బిలాలు నక్కలును దక్క-
ఎగురు పేడలవు ప్రాణు లా తరుణమందు
గింగురు నినాదమున గూయు కీచురాళ్ళ
మనసు చీకాకుపడఁ బాడు మశకములును
జంకు గొలుపఁగ బుసఁగొట్టు సర్పములును
పండ్లభ్రమ దీపములమీఁద వాలిగాలు
మిణుగురులును నింగి కెగురుచు-మిడిసిపడెడు
మెరుగు కీటకములు దక్క మెలఁగవపుడు
చారులును చోరులును నభిసారికలును
జారులును యామికులె తిర్గువారలపుడు
జాగర వ్రతదీక్షలు సలుపువారు
విరహతాపానలంబున వేగువారు
రోగభరమున వెతలను గ్రాగువారు
యోగ విద్యా విహారులై యొప్పువారు
నౌకలును పొగబండ్లను నడుపువారు
నాటకాదులు హరికథ లాటపాట
లాడువారును వినువారు నరయువారు
కార్యభారనిమగ్నులై కాంక్షితార్థ
సిద్ధికై దీర్ఘ యోజనల్ సేయువారు
అవని జీవిత సంగ్రామమందు విజయ
ఫలముఁ బడయంగఁ బాలక బ్రతుకుకోసి
దారుణక్రియలకు బుద్ధిఁ దార్చువారు
గాక లెక్కనవారలు గాఢనిద్ర
కలన సుఖియించువార లాకాలమందు.

—మంగిపూడి వేంకటశర్మ.

# అ డ వి పా ట

తెల్లఁబువ్వులు పాపట-నల్లుకొనుచు
గొజ్జగులదండఁ జేతఁ-గైకొని విలాస
మడరఁ గర్వాకపంటి పు-ప్పొడులదాఁటి
వచ్చి యొకకోన కానలోఁ - బాటపాడు
నట్టి కాపులపిల్ల యే-మనెనొ వినుము.
"ప్రియుఁడ! ఎందేగినావు న-న్నిడిచి యిచట
గానఁగారావు కానలో-గానలోల
బాలగోలను నను గేలి-పాలు జేసి
వెడలఁ జెల్లునె వికచార-విందనేత్ర
రమ్ము; ఈదండ నిడుదు వ-క్షమ్మునందు
ప్రణయమున ముద్దు పెడుదు వ-క్త్రమ్మునందు॥ తె॥
గాన పాండిత్య గరిమ లో-కము జయించి
పంచమరవాబ్ధి జగమును-ముంచివైచి
మధుర గంభీర రవమున - మరల నెత్తు
కోకిలము కన్న వింతగా-నీవుఁదోఁచు
పాటపాడెద రావయ్య - ప్రాణసఖుఁడ
ఆటలాడెద రావయ్య - ప్రాణహితుఁడ॥ తె॥
తేనె సోనల కంటెను - తియ్యనైన
ఇక్షురసమున కంటెను - నెక్కుడైన
సోమ పానంబు కంటెను - చొక్కమైన
చక్కెరకుమించి యమృతంబు - ధిక్కరించు
మనసర తేజంబునకుఁ జాటు - మలపునట్టి
రచనములఁ బ్రొద్దుపుచ్చెద - రమ్ము రమ్ము
వచనముల వేట్క సూపెద - పలుకరమ్ము॥ తె॥
పువ్వుఁబువ్వును యాచింపఁ - బోవునట్టి
మధుపమునుఁ జూడు సహచరి - మానెనేమొ
కొమ్మకొమ్మకుఁ దిరుగుచుఁ - గూయుచుండు
పికమునను జూడు సహచరి - విడిచెనేమొ
మదనకోలఁవున జీతంబు - కుదిరి శుకము
వంకఁ జూడుము సహచరి - బాసెనేమొ
మిన్ను మన్నేరుగాకుండ - మేఘజలము
కొలను నెలుగెత్తి వను వాన - కోకిలంబు
కలువతూండ్లకు కోలఁకులఁ - గాలికోలఁది
బారు రాయంచపిండుల - దారిఁ జూడు
సహచరిని బాసి యెందైన - సాగునేమొ
నీవు ననువీడిపోవంగ - నేమికతము?
నీవు నాముద్దుఁదీర్పవ - దేమికతము?॥ తెల్లు॥
అనుతోడి తను నెలమావి - మ్రాను గంటె
పువ్వుతోడిగెను మల్లికా - మోహనాంగి
పెనఁగొనియె జాజిలత కురి-విందతీఁగ

కలనిడిచెఁ బోఁకబోఁది వా-గులమృతాళి
పువ్వువిడిచెఁ; బ్రకృతి కాంత - నవ్వెనఁగ
వేలుచున్నవి మధుమాస - వాసరములు
వెలయుచున్నవి మణిదీప - విలసనములు
సొగసుగల యావనమువంకఁ - జూడవేమి?

సొగసుమీరెను నావంకఁ - జూడవేమి?
జవ్వనంబును కుసుమ వా-సనయు ప్రాణ
కాల మెంత కాలమునుండెఁ - గలవొ చెపుమ"
అనుచు కన్నీళ్ళు రాల్చె నా - యతివమిన్న.

— ఉమర్ అలీషా.

---

# రాధికాగీతము

నా మోహపుఁ దునక
నా నోముల ఫలంబు
నా నాధుడేల రాడే
అయ్యయో
నను వీడి పోయినాడే॥ ౧

నా జీవితేశుండు
నాదు వలపుల ఱేడు
నా కృష్ణుడేల రాడే
అయ్యయో
నను మఱచిపోయినాడే॥ ౨

చిన్నతనముననుండి
తన్నె ప్రేమించినా
కన్నె ప్రేమము మఱచెనే
అయ్యయో
నన్ను మఱచీపోయెనే॥ ౩

చిఱు నవ్వు మోముతో
చెలువొందు నా సామి
శ్రీకృష్ణుడేల రాడే
అయ్యయో
చింతలను ముంచినాడే॥ ౪

నెలవంకబోలినా
నెమ్మోముగలవాడు
నాసామి తావచ్చునే
చెలియరో
నాకోర్కె లీడేర్చునే॥ ౫

నెమలిపింఛములతో
కొమరొప్పమాళిగల
సుందరాంగుడు వచ్చునే
చెలియరో
అందమును జూపించునే॥ ౬

పాలుదీయుచునుండ
వెనబడి బలిమిమై
పాలనన్నియు ద్రాగునే
ఈకున్న
పసిబాలునివలె బోరునే॥ ౭

పనిజేసిజేసిట్టె
కునికినంతనె జేరి
కనులు రెండును మూయునే
యెవరంచు
నను పరవశంజేయునే॥ ౮

వనములో తానుంట
త రాధనుం బెల్వ
వేణుగానము చేయునే
హాయిగా
ప్రాణము పొంగించునే॥ ౯

నను జేరి సాదరింప
తనువు పులకలు జెంద
రాధకౌగిట దేల్చునే
నాసామి
రాధచింతల దీర్చునే॥ ౧౦

సోగకన్నుల ప్రేమ
రాగమొలుకంగ నీ
లోకమును మఱపించునే
నామనో
లోలత్వముఁ బాపునే॥ ౧౧

ఆనందమయమైన
యా ప్రేమరాజ్యంబు
రాధరాణిగ నేలునే
చెలియరో
రాధ పున్నెము పండునే॥ ౧౨

నా మోహపుగుత్తుకఁ
నా నోముల ఫలంబు
నా మాధవుడేల రాడే
అయ్యయో
నను వీడి పోయినాడే॥ ౧౩

నా జీవితేశుండు
నా దువ్వలపుల ఱేడు
నా కృష్ణుడేల రాడే
అయ్యయో
నను మరచిపోయినాడే॥ ౧౪

—బసవరాజు అప్పారావు, బి. ఏ.

# కేంద్ర గ్రంథాలయము — బరోడా

బరోడా మహారాజు భారతవర్షమందున్న స్వదేశ ప్రభువులకెల్ల నాయకమణి. దివారాత్రములయం దెల్ల-చదువుచున్నను, వ్రాయుచున్నను, మాట్లాడుచున్నను, నడుచుచున్నను ఎల్లప్పుడును గూడ,- "జనసామాన్యమును ఉద్ధరించుట ఎట్లు" అను ఆలోచనయే ఆమహారాజు యొక్క మనస్సును వేధించుచుండును. అమెరికా దేశము ఔన్నత్య శిఖరాగ్రమును బొందుటకు ప్రాధాన్యముగ సహకారియైనది, దేశజులయందెల్ల ఆస్తిగతమై యుండిన గ్రంథాలయ సంపదయేయని- ౧౯౧౦వ సంవత్సరమున ఆదేశమునకుబోయినప్పుడు, బరోడా మహారాజు గ్రహించెను. వెంటనే- స్వదేశమునకు తిరిగిరాకుండనే- గ్రంథాలయోద్యమముచే తనరాజ్యమందుండు ప్రజలనెల్ల విద్యావంతులుగ జేయనెంచి, గ్రంథాలయ శాస్త్రవేత్తయగు బోర్డనుదొరగారిని ప్రజలజీవితమునం దొక నూతనవికాసమును గలుగజేయ తనరాజ్యమున కంపెను; ఆయన బరోడారాజ్యమున కేతెంచి, కేంద్ర గ్రంథాలయమునుస్థాపించి,స్థిరమైనపద్ధతిని నిరూపించెను. ఇప్పుడది భారతవర్షమున కంతకును ఆశ్చర్యజనకమై, ఆదర్శప్రాయమై ఒప్పినది.

గ్రంథాలయమనగా "కొన్ని గ్రంథములను పత్రికలను ఒకచోటచేర్చి, జనులు తమంతటతాము వానినుపయోగింప విడుచుట" అనునభిప్రాయము మనదేశమునందు ప్రబలియున్నది. గ్రంథములను పత్రికలను ఒసంగుటకు మాత్రము ప్రాముఖ్య మియ్యగూడదు. వానినొసంగినంతమాత్రమున ప్రయోజనమేమియు లేదు. ఇచ్చిన దానినెల్ల ఉపయోగింపజేయుటయే బరోడా కేంద్ర గ్రంథాలయముయొక్క నిరంతర ప్రయత్నమైయున్నది. తనదగ్గరనున్న వస్తువులనెల్ల ఉపయోగింపజేయుటకు ఎల్లపుడును నూతన మార్గములను వెదకుచునే యుండును. తనదగ్గరకు వచ్చు ప్రతిచదువరికిని ఒక పుస్తకమును సంపాదించిపెట్టుటయు-తనదగ్గరనున్న ప్రతిపుస్తకమునకు ఒక చదువరిని సేకరించుటయు ఆగ్రంథాలయముయొక్క నిత్యకృత్యములు. చదువుటయందు రుచిని ఎట్లు కలిగింతును? ఎక్కువమంది జిజ్ఞాసుల నెట్లు ఆకర్షింతును? వారికోరికల నెట్లు తెలసికొందును? ఆకోరికల నెట్లు పూరింతును? చదువరుల మనములకు గోచరింపకుండ వారి రుచులను, నిష్ప్రయోజనగ్రంథములనుండి ప్రయోజనకరములైన గ్రంథములమీదికి ఎట్లు మరలింతును? రాజ్యమునం దెల్లెడలను నూతనగ్రంథాలయములు బయలుదేరునట్లుచేయు టెట్లు? అట్లు స్థాపింపబడినవాని నెట్లు ఉజ్జీవింపజేసి, కార్యకారులుగచేయగలను? చదువజాలనివారి నెట్లు స్వాధీనపరుచుకొందును? బాలుర నెట్లు మోహింపజేతును? ఉపాధ్యాయులు, సంఘసేవకులు మొదలగువారి ప్రీతిని, తోడ్పాటును ఎట్లు పొందెదను? గ్రంథాలయము సంఘమునకు కేంద్రస్థానముగను, జ్ఞాన

శోధనకు నిలయముగను, చేయుటెట్లు?—అను చింతనలే కేంద్రగ్రంథాలయమును కలతబెట్టుచుండును. ఈప్రశ్నలకు జవాబులను చాలభాగము మది కనుగొనినది. మిగిలిన వానికిగూడ కనుగొనుచున్నది.

## బాలుర ఆటలు.

గ్రంథాలయములయందు బాలురు ఆటలాడుకొనుటకు- అవకాశముగల్పించుట కలలోనైన తలంపజాలని విషయము. ౧౯౧౭ సం॥ న మహారాజాగారి అభిలాషచే కేంద్రగ్రంథాలయమునందు బాలశాఖప్రారంభింపబడినది. అభివృద్ధిమార్గములను సరియైన దృక్కులతో చూడజాలనివారికీవిషయము వింతగొల్పవచ్చును. "గ్రంథాలయములు చదువుటకా, ఆటలాడుటకా? గ్రంథాలయములకుపోవు పిల్లలు ఆటలకు మరిగి చెడిపోరా? వారి కాలము వృథా కాదా?"అని అట్టివారు ప్రశ్నింతురు. ఈ కాలమునందు గ్రంథాలయము పెద్దవారలకుమాత్రమె కాదు; బాల్యమునుండియు గ్రంథాలయములరుచిని చూచినవారే పెద్దవారైనపిమ్మట వానిపోషకులగుదురు. అందుచేత పెద్దలకంటె పిల్లలకు కావలసిన విషయములందే ఈకాలమునందలి గ్రంథాలయములు విశేషశ్రద్ధను వహించును. ఆటలకంటె పిల్లలకు హృదయరంజకములగు విషయములెవ్వి? గ్రంథాలయమున కనుబంధముగనున్న బాలశాఖయందు ఆటలనాడుకొనుటవలన పిల్లలెందుకు చెడిపోయెదరు? ఆనందముగానుండుట లాభకరముగాదా? వివేకము మందముగానుండుకాలము బాల్యమనియుపిల్లలు ఆటలందు వినియోగించుకాలము వృథాయగుటకు బదులు అభివృద్ధిహేతువనియు తెలిసికొనుడు. బాలశాఖను నడుపునట్టి భాండాగారియెడల క్రమముగ పిల్లలు ఉంచునట్టినమ్రకము, చూపునట్టిగౌరవములను చూచినవాడెవ్వడును- అక్కడవారుఆడునట్టి ఆటలు అనావశ్యకములనియు అసంగతములనియు వారిగుణములను చెరచుననియు చెప్పజాలరు. బాల్యమునందు గ్రంథాలయమనువలలో దగుల్కొనజేసి, గ్రంథపఠనాభిలాషను కలిగించి, పెద్దవారగునప్పటికి-అనగా వారివివేకము మందముగానుండుటనుమాని జాగరూకతావస్థను పొందుకాలమాసన్నమగునరికి- గ్రంథాలయముయొక్క ఆశ్రయులుగ చేయుచున్నపని చూచినవారెవ్వరును బాలశాఖయందు పిల్లలాడుకొనుటను చూచి వానివలన లాభములేదని భ్రమింపరు.

## కథలు చెప్పుట.

భారతవర్షమునందు కథలుచెప్పు ఆచారము మిక్కిలి పురాతనము. మనగృహములందు ఇప్పటికిని ముసలమ్మలు తమచుట్టును పిల్లలనుచేర్చి వారికి చక్కని కథలను చెప్పుచుందురు. గ్రంథాలయశాస్త్రమునందు ప్రపంచమునంతకును ఆదర్శప్రాయమైయున్న అమెరికాదేశమునందే కథలుచెప్పుటను, గ్రంథాలయముల ప్రయోజనములను నెరవేర్చుకొనుటకై ప్రథమమునందుపయోగింపబడినది. అందుచేత అమెరికానుండివచ్చిన శాస్త్రవేత్తచే ప్రారంభింపబడిన బరోడాకేంద్రగ్రంథాలయమునందుగూడ కొద్ది సంవత్సరములక్రిందట కథలు చెప్పు పద్ధతి ప్రారంభింపబడినది.

కథలు బాలురకు అత్యానందమును గలుగజేయును. కథలవలన బాలురకు దైవభక్తిగలుగును. కథలువినుటవలన తమంతటతాము ఏర్చుకొని చదువజాలని గ్రంథములను వారు చదువుట కభిలాష కలుగును. ఇంతేగాక తమకు కథలుచెప్పునట్టిభాండాగారియెడల ప్రేమగలిగి, అతడుచెప్పునట్టి బోధనలయందు విశ్వాసము కుదురును.


## సంచారగ్రంథాలయములు.

"ఓహో! ఏమిటిది? కర్రపెట్టెలు, కొన్నిచిన్నవి, కొన్ని పెద్దవి, కాని అన్నిటియందును పుస్తకములు కలవు. వీనియందేమియు విశేషమున్నటుల నాతలంపునకు దట్టుటలేదు ఈపెట్టెలయందేమైన విశేషమున్నదా? అవిగూడ సందేశమేమైన దెలుపునాయేమి?"అని బరోడా కేంద్రగ్రంథాలయమును దర్శించిన గొప్పవారొకరు అనిరట. ఆపెట్టెలయందు విశేషమేగలదు. ఆసంచార గ్రంథాలయపేటికలు పైకి జీవములేనివిగ కాన్పించుచు

# బరోడాయందుజరిగిన ప్రదర్శనమునందు గ్రంథాలయశాఖ.




వివిధదేశములయందలి గొప్పగ్రంథాలయముల పటములు.




వివిధగ్రంథములు, చిత్రపటప్రదర్శన సాధనములు.

బరోడాయందుజరిగినప్రదర్శనమునందు గ్రంథాలయశాఖ.




బాలశాఖ.

న్నను, ఉన్నతమైనభావములందు జీవించియేయున్నవి. నలుదిక్కులకును- పట్టణములకు, పల్లెలకు, యంత్రశాలలకు స్త్రీసమాజములకు, పాఠశాలలకు, కారాగారములకు, రక్షకభటస్థానమునకు- పలుస్థలములకుపోవలెనని అవి ఊరక లెత్తుచున్నవి. అనేకపల్లెలయందలి గ్రంథాలయములకు ఈసంచారగ్రంథాలయపేటికలే ప్రాతిపదికములైయున్నవి.

కర్రపెట్టెలు—అందులోగ్రంథములు—అంతే-- అవి వివిధజనులమనస్సులయందు నాగరికతాబీజములను నాటుచున్నవి. అనేకగృహములనవి సౌఖ్యవంతములుగజేయుచున్నవి. అనేకపాఠశాలలయందలి పిల్లలకవి జ్ఞానబోధనుగావించుచున్నవి. ఒంటరిగానుండు అనేకమందికవి స్నేహితులలోటును దీర్చుచున్నవి. అవిఅద్భుతములను చేయుచున్నవి. అయినప్పటికి వానిఖరీదు స్వల్పము. అందుచేత కేంద్రగ్రంథాలయమువారు ఈపనినిమిక్కిలి ఆసక్తితో చేయుచున్నారు.

## చిత్రపటప్రదర్శనము.

ఈశాఖను దర్శించినపుడు ఆగొప్పవారే ఇట్లనిరట:— "బొమ్మలుచూపు నాటకశాలతోసమానమైన స్థితికి దిగుట గ్రంథాలయమునకు దగినపనిగాదు. గ్రంథములను పత్రికలనుసంపాదించి, జనులు చదువుకొనుటకియ్యవలసిన గ్రంథాలయము- జనులను ఆనందపరుచుటకు ప్రయత్నించుటయా? కేంద్రగ్రంథాలయమువారికి పిచ్చిఎత్తియున్నగాని చిత్రపటప్రదర్శనశాఖను ప్రారంభించి యుండరు" దానికి గ్రంథభాండాగారిట్లు జవాబిచ్చెను:— "అయ్యా ! దయచేసికొంచెము శాంతమువహింపుడు. నేనుచెప్పుసంగతులు వినకుండ నన్నునిందించకండి." దానికిగూడ ఆగొప్పవారిట్లనిరి:— "ఇంటనేమిజవాబా ? ఇట్టి నిరుపయోగమైన పనినిగూడ సమర్థింపబూనిన ప్రయోజనమేమి?" అందుమీద గ్రంథభాండాగారి శాంతముతోనిట్లుచెప్పెను:— "చదువురాక జ్ఞానములేక, భావములులేక, ఉన్నతస్థితిని పొందవలయుననెడి కోరికలేక, జీవితమునందానందములేక, అసహాయులై, నిర్భాగ్యులైయున్న జనులకొరకు ఈచిత్రపటప్రదర్శనశాఖను ప్రారంభించితిమి. నిత్యజీవనమునందు వారికనుభవసిద్ధములుగనుండదగిన అనేకవిషయములనుగూర్చిన చిత్రపటములను వారికిచూపి బోధింతుము. ప్రకృతిశాస్త్రము, మానవశరీరము, ఆరోగ్యము, కళలు, పరిశ్రమలు, మున్నగు అనేకవిషయములనుగూర్చిన పటములను వారికిజూపి, జ్ఞానవంతులుగచేసెదము. నాటకములు, చరిత్రలు, కథలుమున్నగునవిచెప్పుచు వానికిసంబంధించిన బొమ్మలను చూపుచు వారికానందమును కలుగచేసెదము. భూగోళశాస్త్రవిషయములను పటములతోబోధించి, వారికియీప్రపంచముయొక్క స్వరూపమును గోచరింపజేతుము. వివిధదేశములందలి జనులనడవడికలు, గొప్పస్థలములు మున్నగువానినిజూపి వారికి జిజ్ఞాస గల్పింతుము. ఇంతేగాక ఇంకను అనేకసంగతులు వారికి పరిస్ఫుటముగను, హృద్గతమగునట్లును బోధింతుము. 'సినిమెటోగ్రాఫ్'ప్రదర్శనములలో ప్రదర్శకుడు ఊరకే నిలువబడియుండులాగున మేమునిలువబడియుండము. ఒకబొమ్మనుచూపుటకు పూర్వము, చూపుచున్నప్పుడు, చూపుటముగింపబడినప్పుడుగూడ, మేముమాట్లాడుచునేయుండి ఆబొమ్మనుగూర్చి వివరించుచు దానివలన నేర్చుకొనవలసిన సంగతులను వారికిచెప్పెదము. ఈబొమ్మలప్రదర్శనములకు అందరును రావచ్చును. ఎవరైనను సొమ్మేమియు ఇయ్యనక్కరలేదు. రాజ్యములందు మామూలలనుండుటచే, 'సినిమిటోగ్రాఫ్'కంపెనీలు ఎప్పుడుగానిపోజాలనట్టి కుగ్రామములకుగూడ మా'సినిమెటోగ్రాఫ్'నంపి, జనులకానందమును గలిగించెదము" అంతట వారిఅభిప్రాయములన్నియుమారి, మీరుచేయుచున్న పనినిగూర్చి మెచ్చుకొనిరి.

ఈకేంద్రగ్రంథాలయమునుస్థాపించి కొద్దివత్సరములు మాత్రమే అయినప్పటికిని, నవీనగ్రంథాలయోద్యమము భారతవర్షమున ఎట్లుప్రబలచేయదగునో ప్రదర్శించినది. ఈకేంద్రగ్రంథాలయము ఇపుడు రాజాగారి స్వంతభవనమునందే ఉన్నది. దానికి ప్రత్యేకభవనమును నిర్మాణముచేయుటకై ప్రయత్నములు రాజుగారు చేయుచున్నారు. దీనినికట్టుటకై ప్రత్యేకమొకస్థలమును లక్షరూపాయిలుఖరీదునకు దీసికొనిరి. మహారాజుగారికీ కేంద్రగ్రంథాలయము ముద్దుబిడ్డ. ఇకదానియొక్క అభివృద్ధికేమి కొరతగలదు?

# సంచార గ్రంథాలయములు—బరోడారాజ్యము

గ్రంథాలయోద్యమము బరోడారాజ్యమున ౧౯౧౦ సంవత్సరమున ప్రారంభమైనది. ఈయుద్యమము ప్రారంభమయిన ఒక సంవత్సరమునకే సంచార గ్రంథాలయములనుగూడ గ్రామములకు పంపుట కేర్పాటుచేసిరి.


పెద్దగ్రామములయందుగూడ స్వంతముగ గ్రంథాలయములను స్థాపించుకొనుటకు పెక్కుసంవత్సరముల కాలము పట్టును. ఇక కుగ్రామములమాట చెప్పనక్కరయేలేదుకదా! ఇంతేగాక జనులకెల్ల ఉచితప్రారంభవిద్య నొసంగుటచే, గ్రంథములుకూడ వారికెల్లరకును అందుబాటులోనుండుట ఆవశ్యకమాయెను. కావున రాజ్యమునందు మామూలలనున్న గ్రామములకుగూడ సంతతము గ్రంథము లందుబాటులోనుండుటకు సంచార గ్రంథాలయములవంటి సాధనములు మరిలేవు. సంచార గ్రంథాలయముమూలమున గ్రంథములను ఒక గ్రామమునకు పంపినప్పుడు, ఆగ్రామమునందలి జనులకు గ్రంథపఠనాభిలాష కలిగి కొంతకాలమగునప్పటికి, తామేస్వంతముగ గ్రంథాలయమును స్థాపించుకొందమను కోరిక కలిగి, గ్రంథాలయస్థాపనకు మార్గమేర్పడును.

ఈ ప్రయోజనముల నన్నిటిని గ్రహించినవారై సంచారగ్రంథాలయములను ప్రారంభించిరి. కర్రతో చేయబడిన ఒక చిన్ని పెట్టెయందు వివిధములగు గ్రంథముల నేర్చి పెట్టెదరు. ఆపెట్టెకే సంచార గ్రంథాలయమని పేరు. రాజ్యమునందు గ్రంథాలయములేని ఏగ్రామమునకైనను, లేక కొద్దిగ్రంథములు మాత్రము కలిగియున్న గ్రంథాలయములుగల గ్రామములకైనను, ఎక్కువ ఖరీదు గ్రంథములను కొనునట్టి స్థితియందులేని పట్టణగ్రంథాలయములకైనను, పాఠశాలలయందలి గ్రంథాలయములకైనను, సేవాసంఘములు- స్త్రీ సమాజములు విద్యార్థిసంఘములు, వర్తకసంఘములు, మొదలగువానికైనను- ఈసంచారగ్రంథాలయము లంపబడును. గ్రామమునందున్న పాఠశాల ఉపాధ్యాయుడుగాని లేక ఇతర పెద్దమనిషిగాని గ్రంథములు అందరికిని ఎరువిచ్చి తిరిగి వసూలు చేయుటకు అంగీకరించినయెడల, సంచార గ్రంథాలయ మంపబడును. దానిని గ్రామమునకుపంపి, తిరిగి తెప్పించుకొనుటకగు వ్యయము లన్నియు ప్రభుత్వమువారే భరించెదరు.

సంచార గ్రంథాలయముల నుంచు పెట్టెలు రెండువిధములు; ౧. చిన్నది. ౨. పెద్దది. చిన్నది 13½ అంగుళములపొడవును, 9½ అంగుళముల వెడల్పును, 12½ అం. ఎత్తును గలిగి, ఒక్కటే అరను గలిగియుండును; దీనికి తలుపు రెండురెక్కలుగనుండి, తాళము వేయుటకు గొళ్లెమును గలిగియుండును. ఎత్తుటకు వీలుగనుండునటుల పెట్టెకు రెండువైపులను అల్కాలనుగలిగియుండును. పెద్దపెట్టెకుగూడ రెండువైపుల అల్కాలుండును. ఇది నిలువుగా సమానభాగములుగ విభజింపబడిన రెండుఅరలను గలిగియుండి, ఆరెండును, మధ్యను మడతబందులచే కలుపబడి యుండును. దీనిని తెరచినప్పుడు, రెండు అరలును ఒకదానిని ప్రక్కకు రెండవదివచ్చి, 28 అం. పొడవు, 9 అం. వెడల్పు, 12½ అం. ఎత్తుగలిగిన ఒకబీరువావలెనుండును. (రెండు అరలను తెరచినప్పుడు, మూసినప్పుడున్న పొడవులో సగము వెడల్పుగను, మూసినప్పుడున్న వెడల్పునకు రెట్టింపు తెరచినప్పుడు పొడవునుఅగును.) ఈపెట్టెలు ఎత్తుటకు వీలుగనుండునటుల పైనగూడ అల్కాలు ఉండును. చిన్నపెట్టె ఖరీదు రు ౮ లు; అందు రు౨౦లు విలువగల ౧౫ గ్రంథములుండును. పెద్దపెట్టెఖరీదు రు ౭. అందు రు౪౦లు విలువగల 30 గ్రంథములుండును. పట్టికలు మొదలగువాని నుంచుకొనుటకై, రెండుపెట్టెలకునుగూడ పైభాగమందు చిన్న అరలుండును.

తిరిగి ఈ సంచార గ్రంథాలయములు రెండువిధములు. కొన్నిపెట్టెలయందుండు గ్రంథములు స్థిరముగానుండును. మరికొన్ని పెట్టెలయందుండు గ్రంథములు స్థిరముగా నుండక, గ్రంథములు పంపమని కోరిన వారి


కేంద్ర గ్రంథాలయము — బరోడా.



సంచార గ్రంథాలయముల పెట్టెలు.

## కేంద్రగ్రంథాలయము — బరోడా.

సంచార గ్రంథాలయపేటిక.




బొంబాయి గవర్నరుగారి సతీతిలకమగు వెల్లింగుటను ప్రభ్విగారు కేంద్రగ్రంథాలయమును దర్శించినపుడు, ఆమెకు బహుమతిగా నియ్యబడినది. దానిమీదనున్న రాజచిహ్నము వెండితో చేయబడినది.

రుచుల ననుసరించి మారుచుండును. కొందరికి, గ్రంథములను చదువవలయునని యాసక్తియే యుండదు. మరి కొందరికి, ఆసక్తి ఉన్నను ఏగ్రంథములను చదువవలయునో తెలియదు. అట్టిస్థితియందు వారే గ్రంథములను చదువవలయునో మనమే నిర్ణయము చేయవలసి యుండును అట్టివారికి స్థిరముగానుండు పుస్తకములు గలిగిన సంచార గ్రంథాలయములు ఆవశ్యకములు.

మరికొందరు తామే గ్రంథములను చదువవలయునో తెలిసినవారై యుందురు; కొందరు ఏదోయొక ప్రత్యేక విషయమునుగూర్చి చదువవలయుననిగాని, పరిశ్రమచేయవలెననిగాని తలంచువారుందురు. అట్టి వారికి స్థిరముగానుండు సంచార గ్రంథాలయములవలని లాభము లేదు. అందుచేత వారికి కావలసిన గ్రంథములను ప్రత్యేకముగ ఏరి సంచార గ్రంథాలయములయందు పెట్టి పంపుచుందురు.

సంచార గ్రంథాలయములు జనప్రదములగుటకు గాను, అందులో పెట్టుగ్రంథములను జాగ్రత్తగా నేర్పుట ప్రాధాన్యము. ఇందు పెట్టుగ్రంథములు హితకరమైనవిగను, చదువుట కింపైనవిగను ఉండవలయును. ఈపెట్టెయందు కొద్దిగ్రంథములుమాత్ర ముండునుగదా! ఈకొద్ది గ్రంథములందును వారి కనుగుణమైన గ్రంథము లభింపవలెను. అందుచేత శాస్త్రవిషయములైన గ్రంథములు వీరియందుండిన జనుల నాకర్షింపజాలవు. కావున ఉల్లాసకరములును, నిర్మలములును, హితకరములును, నగు గ్రంథములు- అందు ముఖ్యముగా కథలు- ఇందుండవలెను. ఇంతేగాక అవి మాధుర్యగసమును జిలుకునవియు, జ్ఞానబోధకములును నైయుండవలెను. కోరినవిషయములనుగూర్చిన గ్రంథములుగల పెట్టెలను పంపునపుడు గూడ, ఆగ్రంథములు చదువరుల జిజ్ఞాసకు దోడ్పడునవియై యుండవలెను. ఈసూత్రముల ననుసరించి, స్త్రీలకు, చిన్నపిల్లలకు, వ్యవసాయదారులకు, చిత్రకారులకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు- ఈప్రకారము వేర్వేరు మనోవృత్తులు గలిగిన వారికి వలయు గ్రంథములను ప్రత్యేకముగ నేర్చిపెట్టిరి.

గ్రంథముల ఉపయోగములు వృద్ధిజేయుటయే సంచారగ్రంథాలయముల పరమోద్దేశము. కావున పుస్తకముల నెరువిచ్చు నియమములుగూడ సులభములై అధికారనిరంకుశత్వమున కవకాశములేనివై యుండవలెను. పాఠశాలగల గ్రామమందు ఉపాధ్యాయునకు వ్రాసినయెడల సంచార గ్రంథాలయ మంపబడును. అదిలేని గ్రామమందు ఒకరుగాని, ఇద్దరుగాని, గ్రంథముల నెరువిచ్చి వానిని భద్రముగా గాపాడెదమని వ్రాసిన జాలును, సంచార గ్రంథాలయమును ఒక గ్రామమునందు మూడు మాసములకాలము నుంచుకొనవచ్చును. పిమ్మట దానిని కేంద్రగ్రంథాలయమున కంపివేయవలెను. అప్పుడా కేంద్రగ్రంథాలయమువారు గ్రంథములను పరిశీలించి, మరమ్మతులు చేయవలసినవానికి చేసి, వేరొకస్థలమున కంపెదరు. కేంద్రగ్రంథాలయమునకు పంపకుండనే, ఒక గ్రామమునుండి, వేరొకగ్రామమునకు సంచార గ్రంథాలయముల నంపవచ్చును, గాని అట్లుచేయుటవలన గ్రంథములకు గలిగిన నష్టములు ఏగ్రామమువారు చేసినదియు నిర్ణయించుట కష్టము.

మహారాజుగారు ఉచితప్రారంభవిద్యను నెలకొల్పియుండుటచేత, ఈసంచార గ్రంథాలయములను రాజ్యములయందున్న గ్రామముల వారెల్లరు విరివిగ ఉపయోగించుకొనుచున్నారు. వీనియందుండు గ్రంథములన్నిటిని ప్రతిగ్రామమునందును చదువుదురనుటకు వీలులేదు. ఒక గ్రామమునందు ప్రథమదశయందు గ్రంథములను చదువువారు పది, పన్నెండుగురుకన్న నెక్కువగానుండరు. వారికి గ్రంథపఠనాభిలాష వృద్ధియైనకొలది ఇతరులను చదివింపజేయుదురు; ఇంతేగాక ప్రథమదశయందు కథలు మొదలగు సులభగ్రంథములను చదువ ప్రారంభించినవారు, శాస్త్రవిషయములనుగూడ క్రమేణ చదువుట కభ్యాసపడుదురు.

ప్రథమ వత్సరమునందు, ౨౪౦౦ గ్రంథములు గలిగిన ౩౭ పెట్టెలతో ఈయుద్యమము ప్రారంభింపబడినది. ౧౯౧౭ సంవత్సర ప్రారంభమునందు ౧౪౦౦౦ గ్రంథములు గలిగిన ౪౪౪ పెట్టెలుగలవు. ౧౯౧౧ సంవత్స

రమునందు ౮౦ గ్రామములకు ౬౦ పెట్టెల నంపగా, ౨౫౭౮ మంది ౭౦౦౦ గ్రంథములను చదివిరి. ౧౯౧౮ సం॥న ౩౦౨ గ్రామములకు ౩౫౮ పెట్టెల నంపగా, ౭౫౯౬ మంది ౧౫౩౦౩ గ్రంథములనుజదివిరి- ౧౯౧౫, ౧౯౧౬, సంవత్సరములం దీపెట్టెలనన్నిటిని కేంద్ర గ్రంథాలయమునకు దెప్పించి, క్రొత్త ఏర్పాటులను చేయుచుండుటచేత, ఆరుమాసములకాలము గ్రామాదులకు పంపనేలేదు. అందుచేత ఈ రెండు సంవత్సరములందును కొంచెము ప్రచారము తగ్గినది. సంవత్సరమునకు ఈసంచార గ్రంథాలయములక్రింద ఖర్చు రు ౩౦౦౦లు. మొదటి ఆరు సంవత్సరములంగును రు ౧౧౮౧౩-౭-౮ లు గ్రంథములకును, రు ౨౮౬౩-౧౨-౯ లు పెట్టెలు చేయించుటకును, రు ౨౬౯౧-౦-౦ లు ఇతరఖర్చుల క్రిందను, వెరశి రు ౧౬౫౬౯-౮-౧ లు వ్యయమైనవి.

ఉచితనిర్బంధ విద్యాప్రదానమునకు వలెనే, సంచార గ్రంథాలయములను జనులకు ఉచితముగ ప్రసాదించుటయందుగూడ బరోడారాజ్యము భారతవర్షమంతకును మార్గదర్శకమై వెలయుచున్నది.

# గ్రంథాలయస్థాపన

బ్రిటిషుఇండియాయందును స్వదేశసంస్థానములందును గ్రంథాలయోద్యమమునుగూర్చిన కృషి జరుగుచుండుట దేశాభ్యుదయమునకు శుభసూచకము. పుస్తకాగార ప్రతిష్ఠాపనగూర్చిన వివరములు తెలుపకముందు ఈయుద్యమముయొక్క వ్యాప్తినిగూర్చియు పరమావధినిగూర్చియు కొంతచర్చించుట అవసరము. రాజకీయ,సాంఘిక, శారీరక, నైతికాధ్యాత్మికాది మానవశక్తుల- నింతయేల- ఏమేమిసంపూర్ణముగా పౌరుషమును ప్రకాశింపజేయగల్గునో యదియంతయు ఈయుద్యమముయొక్క అంతర్భాగమేయైయున్నది. పైనచెప్పిన ఈమానవశక్తుల నన్నిటిని హాయిగ పరస్పరవిరోధములేకుండ వ్యక్తీకరింపచేసుకొనుటకు సాంఘికుల కేగ్రంథాలయమవకాశమీయగల్గునో అదియ కృతార్థతనుపొందుననిచెప్పవచ్చును. అందువలన ముకుళించుకొని యవ్యక్తమై లోనున్న మానవశక్తుల ప్రకాశింపచేసుకొనుటకు తగినయవకాశమునొసగుట ఈయుద్యమ నాయకులకు విధియైయున్నది.

సంఘపురుషుని యందు వ్యక్తమైయుండు నీవివిధశక్తుల వికసింపచేసికొనుటకు తగినయవకాశము లీహిందూదేశమునందీ పిదపరోజుల నాగరకతా ప్రచారణకు పూర్వము కలవా లేవా యనుచర్చ యొకింత చేయవలసియున్నది. ఇట్టిప్రతిష్ఠాపనలు మనదేశమున నెన్నియో కలవని మనకు స్ఫురించకమానదు. హిందూదేవాలయమిట్టి ప్రతిష్ఠాపనలలో నగ్రగణ్యమని వేరుగచెప్పనక్కరలేదు. దానిని ఎట్లువర్ణింపనగును. వివాహములకుసాక్షి; ప్రమాణమునకురచ్చ; ధర్మశాస్త్రచర్చలకు సభాభవనము; పరదేశీయులకు ధర్మశాల; పనివాండ్రకుప్రాపు; సన్యాసులకుమఠము; భక్తవరులకునికిపట్టు; ఇదియదియనేల- ప్రజలజీవనాధారమై విద్యాపోషకమై జ్ఞానదాయకమై సౌందర్యస్థానమై ఆనందాంబుధియై దేవళంబు విరాజిల్లుచుండు. అద్దానియందు సాంఘికజీవనమంతయు పుంజీభవించియుండును. సంఘశక్తులకన్నిటికిని అయ్యది మచ్చులచావడివంటిది. పెద్దలు, పిన్నలు, విద్యావంతులు, చదువులేనివారు, ధనవంతులు, పేదలు, లౌకికులు, భక్తులు, వీరు వారననేల సాంఘికులు యావన్మందియును ఈస్థలమున నాకర్షింపబడిన పరమార్థమును గుర్తెరిగి తమతమపృథక్త్వమును వీడగల్గిరి.

మనతీర్థయాత్రలును పండుగలును ఈవిధముగనే యుపయోగపడుచుండెనని చెప్పవచ్చును. ఇవికాక మనగ్రామసంఘములును కొద్దిలోనిట్టులే మానవశక్తులను వృద్ధిచేయ ప్రయత్నించుచుండెడివి. కారణాంతరములచే ఈ యేర్పాటులన్నియు ప్రస్తుతము తొలుతటి జవసత్వములుడిగి సరిగ పనిచేయుటలేదు.

కావున, నవీనపరివేష్టనమునకును, భావములకును సరిపడి ప్రాతయేర్పాటులందుఁగల్గు మేలుపద్ధతులు నశింపకుండ నిలుపజాలు నొక క్రొత్తయేర్పాటును కనుగొనుట యావసరమై కన్పట్టుచున్నది. ధర్మపుస్తకాగారమీ కార్యనిర్వహణమునకు సమర్థమని చెప్పవచ్చును. కావున ఈయుద్యమనాయకులు పుస్తకనిలయములు జ్ఞానదానము చేయుటకు తగినయేర్పాటులు చేయనాలోచింప వలయును. ఇదిచేయుటెట్లు? అనుసమస్య ముందాలోచింపవలయును.

పుస్తకాగారమునకు కావలసిన పరికరము లివియే యని సామాన్యముగా అందరకును స్ఫురించును:—ఎల్లరకు ప్రవేశముగల యొక భవనము, కొన్ని పుస్తకపుటగలు, చదువుకొనుటకు చాపలు, కొన్ని పుస్తకములు, మాసపత్రికలు, వారపత్రికలు; ఒకరిద్దరుభాండాగారికులు, ఒకరిద్దరునౌకరులు. ఆభావము సరికాదు.

ఈగ్రంథాలయముల కార్యసిద్ధికి ముఖ్యసాధనము అందుకృషిచేయువారల శక్తిసామర్థ్యములే కాని కేవలధనసమృద్ధి కాదనువిషయము మాత్రము ముఖ్యముగ గమనింపవలయును. ఒకగ్రంథాలయమునకు మంచిపుస్తకసముదాయము, విశేషధనమును గలిగినను అయ్యవి సద్వినియోగము కాకపోవచ్చును. కాని మంచిగ్రంథములు కొలదిమాత్రమే గలిగియున్న మంచియొకపుస్తకనిలయము పరిసరప్రదేశమునకంతకును జ్ఞానదీపమువలె ప్రకాశింపవచ్చును. కావున యీయుద్యమమునకు నాయకులైయుండువారు సత్వరమా విధిని యాథిగ గుర్తెఱింగి, గ్రంథాలయములను సమర్థులైన కార్యదర్శులకొప్పజెప్పవలయును.

మన పట్టణములందును పల్లెలందు నిట్టి పుస్తకనిలయములను స్థాపించుటకు పరికరములుగలవా లేవా? దేవభాషాపారంగతులైన విద్వాంసులు మన దేశమునందు ప్రతిగ్రామమునందును గలరు. ఆంధ్రమునందు మంచి ప్రవేశముగలవారును గలరు. తరువాత క్రొత్తచదువుల యంత్రశాలలో సగము తయారై తత్ఫలసిద్ధిని పొందని వారును మెట్రిక్యులేషన్ తప్పినవారలును గ్రామములందచ్చటచ్చటగలరు. అటుపైన చదువు వచ్చియు రాని వారును నిరక్షరకుక్షులునైన పాటకజనమెంతయో కలదు.

కావునపైనుదహరింపబడియున్న తరగతులవారందరికిని ఉపయోగకారియగునట్లుగ గ్రంథాలయమేర్పరుపబడవలయును. మనము తరుణవయస్కులగువారి విషయమే కాక బాలురవిషయమైకూడ ఆలోచింపవలయును. అన్నితరగతులవారునొకచోటగూడి వారివారివిద్యల శక్త్యనుసారముగ అన్యోన్యాభివృద్ధికొరకై వినియోగించుకొనుట మనకు సాంప్రదాయసిద్ధమైన యాచారమైయున్నది. ఈవిషయము మనమునందుంచుకొని గ్రామములయందు మనము పుస్తకాలయములస్థాపింపవలయును. పండితుడును, భగ్నమనోరథుడైన యాంగ్లసంభవుడును-నిరక్షరకుక్షులగు వ్యావసాయిక పారిశ్రామిక జనమందరును గ్రంథాలయమునకు ఆకర్షింపబడు ఉపాయమొందుగ నెట్టవలయును. మఱియును వీరందఱు స్వవృద్ధికై పాటుబడుచు, అన్యోన్యము సహాయముచేసికొనునట్లుగా ఏర్పాటుచేయవలయును. ఇదియెట్లుసాధ్యమో ఇటుపైన కొంతవిచారింతము.

ఆంధ్రమందుగాని గీర్వాణమునందుగాని ప్రవేశము గలిగియున్న పండితునకు, స్వదేశపద్ధతులెగాని పరదేశసాంప్రదాయములేమియు తెలియవు; కాని తెలిసికొనవలయునను నిచ్ఛమాత్రముకలదు. కావున ఆంగ్లజ్ఞానము కలవాడీతనికి వార్తాపత్రికలుచదివి- జలాంతర్గాములు ఆకాశవిమానములు మొదలైనయీనాటియద్భుతనిర్మాణములను గురించియు, నిత్యమునుపయోగపడు పట్టణపారిశుధ్య, పారిశ్రామికాది విషయములగుఱించియు చెప్పుచుండవలయును. పండితుడన్ననో జనసామాన్యమునకు పూర్వపు మనసాంప్రదాయములను గుఱించి బోధయొనర్చుచుండవలెను. ఈవిధముగ పండితుడును ఆంగ్లేయవిద్యనభ్యసించినవాడును, ఒకేగ్రంథాలయమునందు కలియుటవలన అన్యోన్యము సహాయముచేసికొని జ్ఞానాభివృద్ధియొనర్చుకొనవచ్చును. విద్యావిహీనులయ్యు అమూల్యమైన లౌకికజ్ఞానముగల రయితులు మొదలైన

వారును ఇతరులవలన మేలందుచుండియు తామే తమ ప్రపంచజ్ఞాన విశేషముచేత సాంఘికులకెంతయు ఉపయోగపడుదురు.

ఇకముందు కష్టతరమైన సమస్యయొకటి ఆలోచింపవలసియున్నది. గ్రంథాగారము అన్ని తరగతులవారికిని ప్రీతిపాత్రమై యుండునట్లొనర్చుటెట్లు? తన కడకే తెంచినవారికేదియో కొంతజ్ఞానముకలుగజేసి, తన యాస్తిపోకుండ కాపాడుకొనుట మాత్రమేకాక, తన్ను దానుప్రచురపఱచుకొని చుట్టుప్రక్కలనుండుమనుజుల నాకర్షించుట మేలొందించుటగూడ నవీనపుస్తకనిలయముయొక్క విధియైయున్నది. ఇట్లొనర్చుట యెట్లు పొసగుననియాలోచించిన, మనపూర్వపు పద్ధతులే కొన్ని మార్గములనుసూచించుచున్నవి. మనహరికథలు, మనకాలక్షేపములు, మనయూరేగింపులు, మనబొబ్బిలి కథలు, ఇవన్నియు సంతోషజనకములు మాత్రమేకాక జ్ఞానప్రదాయకములుగూడనగుచున్నవి; వీనియందు, జనులనందఱ నొకచోగూర్చి ఒక పరమార్థచింత యందు వారి నానాత్వములను మఱచిపోవునటుల జేయజాలుశక్తి గర్భితమై బీజరూపమై యుండియున్నయది. కావున, ఈపూర్వపుపద్ధతుల నూతనభావములకనుగుణ్యముగ మార్చి పునర్జీవమిచ్చి నిలువబెట్టినచో, నయ్యవి జనుల యభివృద్ధికనేకవిధములతోడ్పడునట్లు చేయవచ్చును.

ఇట్లు అనేకములైనరుచులను, ఉద్యోగములనుగలిగిన యిందరిని గలిపి యొకసంఘమును నిర్మించుటెట్లను విషయ మిటుపై నాలోచింపవలసియున్నది. ఈపనికై ఈకాలపు సంఘనిర్మాణపద్ధతుల నవలంబింపవలయును. సాంఘికులగుటకొరకై నెలసరిచందాకొంతయొసగునట్లు యేర్పాటుచేయవచ్చును. సాంఘికులందరినుండియును కార్యనిర్వాహక సంఘమొకటి యేర్పాటుచేయవచ్చును. ఏవోకొన్ని లెక్కలు జాబితాలుగూడ నుంచుటయు నవసరము. ఈలెక్కలను జాగ్రతగ పరిశీలించి సాంఘికులందఱికి యేడాదికొకసారి వినిపించవలయును. మఱియు పుస్తకనిలయ సాంవత్సరోత్సవము జరుగునప్పుడు వీనిని యూరివారందఱికిగూడ వినిపింపవలయును.

ఈసాంవత్సరోత్సవమునకు ఊరివారినందఱను పిలుచుటయేకాక దగ్గఱ పట్టణములలో నున్న విద్యావంతులగు వారిని, ఉపన్యాసము లిచ్చుటకును అగ్రాసనాధిపత్యము వహించుటకును ఆహ్వానముచేయవచ్చును. సాంవత్సర సమావేశమునందు రాబోవుసంవత్సరపు ఖర్చువివరము వ్రాసి యద్దానికిసాంఘికుల సమ్మతిని పొందవలయును. మఱియు సంఘకార్య నిర్వాహణమునకై కొన్ని నిబంధనల నేర్పాటు చేయవలయును.

ఇట్లేర్పాటుకాబడిన సంఘము పూర్వపుగ్రామ సంఘమువలెనే యుండును. గ్రామస్థులకు ఇతరవిషయములలో నేమిభేదాభిప్రాయములున్నను సాంఘికుల నెన్నుకొనుట-అనేకతరగతులవారు జ్ఞానసంపాదనకై ఏకత్రసమావేశమగుట-అనువిషయములలో వారికి భేదమువచ్చుటకవకాశము లేకుండజేయుటవలన నూరిలోకొంత యైకమత్యతయును సంఘీభావమును కలుగజేయవచ్చును. అందఱకును మేలొనర్చు నీపనికొఱకు తమకదివఱకు గలుగు క్షుద్రములైన యంతఃకలహముల మానివేయుదురు. ఈవిధముగ నిట్టిసంఘ మేర్పాటుచేయబడిన ప్రతి స్థలమందును స్వపరిపాలనా కార్యసమర్థతకు తగిన పరికరములను సమకూర్పవచ్చును. ఇట్లనేక స్థలములయందు పుస్తకనిలయముల నేర్పాటు గావించి వీని యన్నిటికిని కొంత అన్యోన్యసంబంధము గల్పింపవలయును. దొరతనమువారిచే విశేషధనముతో ప్రతిష్ఠాపింపబడు నేదియో యొకపుస్తకాగారముతప్ప తక్కినవన్నియు పరిపూర్ణముగనుండుటకు వీలుండదుగావున ఈగ్రంథాలయములొకటికొకటి సాహాయ్యముచేసికొనుట కేర్పాటు చేయవచ్చును. బరోడారాజ్యమందిట్టి పద్ధతి నవలంబించి యున్నారు. అక్కడ ౨ లక్షల గ్రంథములుగల యొక కేంద్రగ్రంథాలయము గలదు. ఈకేంద్రగ్రంథాలయమునకు సంబంధించిన యేపుస్తకనిలయమయినను అచ్చటనుండి పుస్తకములను తీసికొనవచ్చును. ఈకేంద్రగ్రంథాలయము తరువాత ౨౦,౦౦౦ పుస్తకములుగల జిల్లా గ్రంథాలయములు గలవు. గ్రామగ్రంథాలయములకు వలయుగ్రంథములు వీనివద్దనుండి యవసరమగునప్పుడు

పుచ్చుకొనవచ్చును. దీని తరువాత తాలూకా గ్రంథనిలయములుగలవు. వీనియందు ౪౦౦౦ లేక ౫౦౦౦ పుస్తకములుండును. వీనికిని గ్రామగ్రంథాగారములకును పైనచెప్పబడినట్లే బాంధవ్యముకలదు.

స్థాయిగానుండు గ్రంథాగారములు లేక పుస్తకనిలయములు లేనిపల్లెలకు సంచార గ్రంథాగారములు ౫౦, ౬౦ గ్రంథములతో పంపబడును. మఱియును కేంద్రగ్రంథాలయమునుండి "మ్యాజిక్కులాంతరులు, సినిమెగ్రాఫులు" గ్రామములలోనికి పంపబడుచుండును. సాధ్యమయినంతవఱకు గ్రంథాలయముల కన్యోన్యసంబంధమేర్పాటు చేసిన యెడల విశేషలాభము కలుగగలదు.

ఇక గ్రంథనిలయమునకు వలయుధనమునుగురించి యొకింతయాలోచింతము— బరోడాలో నున్నవారలు గ్రంథాగారమునకై కొంత చందావేసుకొని పోగుచేసిన యెడల తాలూకా జిల్లాబోర్డుల మూలధనమునుండియు రాష్ట్రీయ బొక్కసమునుండియు గూడ కొంతమొత్తము సంగబడును. ఇదిగాక దేశమందనేక దాపతుల యుమ్మడిసొమ్ము గలదు. వీలుతెలిసి ప్రయత్నించినచో నిట్టిధనము వలన ఆయాస్థలములయందు తగినన్ని గ్రంథాగారముల స్థాపించుట కభ్యంతరముండదు.

ఇట్టిగ్రంథనిలయమును స్థాపించిన తరువాత నది చిరస్థాయిగ నుండునటుల జాగ్రత్తపడవలెను. ఇట్టి సంఘమందు కొన్నికొన్ని దురాచారము లెప్పటికిని ప్రవేశింపకుండ జాగ్రత్తపడవలెను. మఱియు గ్రంథాలయములకును "క్లబ్బులని" వ్యవహరింపబడువానికిని చాలవ్యత్యాసము కలదను విషయమొకటి ముఖ్యముగ గమనింపవలయును. త్రాగుడు జూదము మొదలగు దురాచారము లీగ్రంథాలయ పరిసరమందుగూడ జరుగకుండ జాగ్రత పుచ్చుకొనవలయును. ఊరిలోని వివాదలలో నీసంఘమెప్పుడు జోక్యము కలుగజేసికొనగూడదు. వర్ణమతభేదములేక గ్రంథాలయములోని కందఱకును ప్రవేశ మొసంగవలయును. ఎల్లరకును దర్శనీయమై యుండవలయును.

ఆయాదేశములయందు సావకాశములున్నచో బాలురకు స్త్రీలకుగూడ విద్యాభివృద్ధికై ప్రత్యేకపు యేర్పాటులు చేయింపవచ్చును. ఊరిలోనుండు ప్రథమపాఠశాలతో సంబంధమేర్పరుచుకొని బాలురనందఱను గ్రంథాగారమునకు గొంపోయి గాని, వారిబడికి పుస్తకములంపిగాని వారి జ్ఞానాభివృద్ధికై తోడ్పడుచుండవలయును. ఇందులకని ప్రతిగ్రంథాగారమునందును బాలుర కుపయుక్తములగు పుస్తకసముదాయము కొంత యుండవలయును. తరువాత ఊరిలోజరుగు హరికథా కాలక్షేపములు మొదలైన జనసామాన్యమునకు వినోదమును జ్ఞానమును చేకూర్పు సమావేశములన్నియు నీగ్రంథాగారపక్షముననే జరిగించుటకు ప్రయత్నింపవలయును. ఇట్లొనర్చిన జనులకందఱకు గ్రంథాగారము ప్రీతిపాత్రమై వెలయుచుండును. వీలైనయెడల బడిపిల్లలకు పోటీపరీక్షలుచేసి యుత్తీర్ణులగువారికి బహుమతులొసంగుచుండినయెడల వారందరును గ్రంథాలయములందుత్సాహముకలవారై పెద్దవారైనపిదప వీని నెంతెనొవృద్ధిలోనికి తేగలుగుదురు.

ఇంతవఱకు మనముచేసిన విచారణవలన, మానవాభ్యుదయమునకు తోడ్పడు ప్రత్యుద్యమము గ్రంథాగారమందంతర్గర్భితమై యున్నదని తేలినది. భావికాలమందు సత్పౌరులై దేశోపకారమొనర్చునట్టిశక్తిని సంపాదించుకొనుటకై గ్రంథాగారము తగిన యుపదేశస్థలము. దురహంకారములు రూపుమాసిపోవును. సహిష్ణుతయును సంఘభావమును, పెంపొందును. ఊరిలోని యుద్యమములన్నియును, గ్రంథాగారమునందే జనింపకున్నను అచ్చట తప్పక ప్రతిఫలించును. ఈ విధమున యథావిధిగ గ్రంథనిలయములు దేశమందంతటను స్థాపించినయెడల, అయ్యవి దేశజుల పురోభివృద్ధికెంతయు తోడ్పడి, మాతృభూమి నింతకంటె వేయిమడుంగు లధికముగ ధనవంతముగను, సౌఖ్యవంతముగను, చేయ సమర్థములగును.

[౧౯౧౪ సం- జనవరినెల ౨౫ తేదీన దక్షిణహిందూదేశమున పుదుక్కోటసంస్థానమునందున్న "ఆలంగుడి" యందు జరిగిన గ్రంథాలయప్రతినిధులసభకు ఈ వ్యాసము పంపబడి, అందు ఆరవభాగమయందు చదువబడినది.]

ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః

—సూరి వేంకటనరసింహశాస్త్రి.

# హిందూదేశ గ్రంథభాండాగారులసభ

ఈసామముతో ౧౯౧౮ సం॥ జనవరి ౪, ౫ తేదీలందు లాహోరుపట్టణమున ప్రభుత్వమువారి యాదరణక్రింద నొకసభ సమావేశము గావింపబడినది. హిందూదేశ ప్రభుత్వమునందు విద్యాధికారియగు ఆనరబిల్ షార్ప్ దొరగారు అగ్రాసనాధిపత్యమును వహించిరి. వివిధ రాష్ట్రములయందలి ప్రభుత్వమువారి గ్రంథాలయములనుండియు, కళాశాలలనుండియు ౩౧ మంది ప్రతినిధులేతెంచిరి. బరోడారాజ్యమునుండి న్యూటుదత్తుగారును, హిందూవిశ్వవిద్యాలయమునుండి జాధూనాథ సర్కారుగారునుకూడ ఏతెంచిరి. ఆంధ్రదేశగ్రంథాలయసంఘమునుండిగూడ ప్రతినిధిని పంపెదమని వ్రాయగా, సభ్యులసంఖ్య ఇదివరకేఎక్కువగానుండియుండుటచేత, స్థలముండినచో ప్రేక్షకునిగా మాత్రమంగీకరించెదమని తెలిపిరి. విశేషవ్యయప్రయాసలకు లోనై ఆంధ్రదేశమునుండి లాహోరుపట్టణమేగినను, సభయందు ప్రేక్షకుడుగనైన స్థలముదొరుకునో లేదో తెలియకపోవుటయటుండ- ఈగ్రంథభాండాగారుల సభవలన మనసార్వజనిక గ్రంథాలయోద్యమమున కేవిధమైన ఉత్సాహప్రోత్సాహములును లేవని గ్రహించి ఆసభకు ఆంధ్రదేశగ్రంథాలయసంఘమునుండి ప్రతినిధులెవ్వరును పోయియుండలేదు. తుదకు ఫలితముకూడ ఊహించినట్లే జరిగినది.

హిందూదేశముయొక్క వివిధభాగములనుండి గ్రంథాలయములయందారితేరిన, వేత్తలందరిని ఒకచోటగూర్చుటవలన అమితమగులాభము చేకూరినదనియు, హిందూదేశమంతటను వెదజల్లబడియుండిన గ్రంథరాజములను అందుబాటునకు దెచ్చుటనుగూర్చి ముఖ్యముగ యోచింపవలెననియు అగ్రాసనాధిపతిగారుచెప్పిరి. జిజ్ఞాసులగువారికి కావలసినగ్రంథములు తరుచుగాలభించుట లేదనియు, గొప్పస్థలములయందు విశేషముగ గ్రంథములు సేకరింపబడుటయు అవిఅందుబాటులోనుండు సదుపాయములులేకుండుటయు కటస్థించుచున్నదనియు, కాబట్టిహిందూదేశమునందొక భాగమునందున్న విద్యార్థి ఇంకొకభాగమునందున్న గ్రంథాలయములను ఉపయోగించునటుల చేయుట ఎట్లో ఆలోచింపవలసియున్నదనియు చెప్పిరి. హిందూదేశమందున్న వివిధగ్రంథాలయములకును సంబంధమును గలుగజేసి, ఒకదానియందున్న గ్రంథములు వేరొకదానికిసులభముగా లభ్యమగునటులచేయుటకు మార్గములనాలోచించుటయే ఆసభయొక్క ప్రధానోద్దేశమనియు- ఈవిషయముతోబాటుగ, విషయములసూచికల నేర్పరుచుట, శాస్త్రవిషయికపత్రికలపట్టికను తయారుచేయుట, గ్రంథాలయసహకారులను తయారుచేయుట, పుస్తకములను పరస్పరముమార్చుకొనుట మొదలగువిషయములను గూర్చియాలోచింపవలెననియు జెప్పిరి. ఉన్నతవిద్యాభ్యాసకులకును ప్రత్యేకవిషయములగూర్చి పరిశీలన జేయువారికిని సంబంధించిన విషయములనుగూర్చి మాత్రమే యోచింపుచున్నామనియు- విద్యార్థుల ఆశయములగూర్చిగాని కొన్నిరాజధానులలో స్థాపింపబడుచున్న పల్లెటూళ్ళ గ్రంథాలయములనుగూర్చిగాని, జనులందరికిపనికివచ్చు వానినిగూర్చి గాని యోచింపుటలేదనియు జెప్పిరి. వ్యవధిఉండిన ఈవిషయములనుగూర్చి యోచించెదమనియు, ఏదోవిధముగ ప్రారంభించి, శాస్త్రవేత్తలకునికి సహాయముజేసిన, సామాన్యపాఠకునికిగూడ సహాయమగుననియు జెప్పిరి.

పిమ్మట వివిధచర్చలుజేసిన తరువాత ఈతీర్మానములు చేయబడినవి:— హిందూదేశమునందున్న గ్రంథాలయముల సంఖ్యావివరణమును తయారుజేయుట ముందు ఆవశ్యకమగుటచే, బెంగాలుఏసియాటిక్‌సొసైటీ, బొంబాయిఏసియాటిక్‌సొసైటీశాఖ, మద్రాసు విశ్వవిద్యాలయ గ్రంథాలయము, ఇంపీరియల్ లైబ్రరీ (కలకత్తా) మున్నగువానితో ఆలోచించి- అట్టిగ్రంథాలయములసంఖ్యావివరణమును తయారుజేయుటకై హిందూదేశప్రభుత్వమువారినికోరుచున్నారు. ఎట్టివానిని ఈపట్టికలోచేర్చవలయునను నిర్ణయమును ప్రభుత్వమువారికే వదలిపెట్టిరి. ప్రతిగ్రంథాలయముయొక్క స్థలము, స్థాపనతేదీ,

ఎవరిదైనది, ఆదాయము, పుస్తకములమీది వ్యయము, చందానిర్ణయము, అచ్చుగ్రంథములసంఖ్య, వ్రాతగ్రంథములసంఖ్య మున్నగునవి అందుండవలెననిరి.

హిందూదేశమునందున్న వివిధగ్రంథాలయములు పరస్పరము పుస్తకముల నెరవుపుచ్చుకొనుటకు సంబంధించిన కొన్ని తీర్మానములుగూడ జేయబడినవి.

# గ్రంథాలయములు

[కుముదవల్లి శ్రీవీరేశలింగకవి సమాజముయొక్క ౨౦వ సాంవత్సరికోత్సవ సందర్భమున అగ్రాసనాధిపత్యమును వహించిన శ్రీ దండు నారాయణరాజు, బి.ఏ., బి.ఎల్., గారి ఉపన్యాసమునుండి దీయబడినది.]

అజ్ఞానాంధకారమునను్న హైందవజన సామాన్యమును విజ్ఞాన సంపన్నులుగా జేయుటకును, ప్రజలయందున్న తాదర్శ్యముల నెలకొల్పి సంఘీభావమబ్బజేసి హిందూదేశోద్ధారణను సాధ్యము గావించుటకును, పరిపాటిగా వచ్చుచుండిన ఆచారవిశేషములనే మతముగా నమ్మిన సంఘములయందు జ్ఞానవ్యాప్తమును సుస్థిరము చేయుటకును, గ్రంథాలయములే ముఖ్యసాధనములు. గ్రంథాలయములయొక్క యావశ్యకత ఎల్లవారును అంగీకరించునదియేయైనను గ్రంథాలయములయొక్క ధర్మమంతగా సువ్యక్తమయినట్లు కనుపించదు. పెక్కు గ్రంథములను చేకూర్చి వానిని భద్రపరచుటయే ముఖ్యధర్మమని కొందరనుకొనుచున్నారు. అది ఎంతమాత్రమును సరికాదు. ప్రతిగ్రంథమునకు ఒకపాఠకుని, ప్రతిపాఠకునకు ఒక గ్రంథమును చేకూర్చుటయే గ్రంథాలయముయొక్క పరమధర్మము. పెక్కు పుస్తకములను ఒకచోట చేర్చినంతనే గ్రంథాలయాధికారులపని ముగియలేదు. అట్లు గ్రంథములను సమకూర్చుటలో వారిపని ప్రారంభమయినది. నలువురు పాఠకులను ఆకర్షించి ఆపుస్తకములను చదివింపజేసినగాని వానినొక్కచో జేర్చిన వినియోగములేదు. కనుక గ్రంథాలయాధికారులు అనేక పాఠకులను ఆకర్షించునిమిత్తము నూతనమార్గములకొరకు సదా ఆలోచించుచుండవలెను.

గ్రంథాలయాధికారులు గమనింపవలసిన విషయము వేరొకటిగూడ గలదు. మనుజులు భిన్నభిన్న రుచులు గలవారుగానున్నారు. మరియు నొక మనుజునకే వయస్సునుబట్టి రుచులు మారుచున్నవి. జిహ్వేంద్రియముచే ననుభవనీయములగు పదార్థరుచులును వయస్సునుబట్టి మారుచున్నవి. చిన్నతనమునందు రుచింపని పదార్థములు కొన్ని కొంచెము వయస్సు మీరిన తరువాత వాంఛితము లగుచున్నవి. అట్లే విద్యాగణనయందును వయస్సునుబట్టి రుచులు మారుచున్నవి. పసితనమునందు కథలు వినుటయందు అమితకుతూహలమును జూపుచున్నాము. బాల్యమునందు నాటకాదులను జూచుటకెక్కువ అభిలషించుచున్నాము. యౌవనమునందు శృంగారహాస్యరసప్రధానములగు ప్రబంధములు ఎక్కువగా రుచించుచున్నవి. ఈభిన్నరుచులు కలిగినపాఠకులందరకు వారివారి కనుకూలించు పుస్తకములను చేర్చుటయందుగూడ గ్రంథాలయాధికారులు శ్రద్ధతీసుకొనవలసియున్నది. వారివారికి కావలసిన గ్రంథములను సమకూర్చుచు, వారిరుచులను సత్పథమున బెట్టుటకై ప్రయత్నింపవలెను. ఇట్లు ప్రతిపాఠకునకును ఒకపుస్తకమును ప్రతిపుస్తకమునకు ఒక పాఠకుని చేకూర్చుట గ్రంథాలయముయొక్క ముఖ్యధర్మమయి యున్నది.

# సంచార గ్రంథాలయములు — మైసూరు రాజ్యము

మైసూరు ప్రభుత్వమువారు సంచార గ్రంథాలయ నిర్మాణ విధానమును గూర్చి ఈక్రింది ఉత్తరువు నొసంగుచున్నారు:—

౧ మండలములోని తాలూకాల సంఖ్యనుబట్టి తాలూకా కొకొక్క సంచార గ్రంథాలయము వంతున మండల సంఘాధ్యక్షున కొసంగబడును. అతడు వానిని ప్రతి పల్లెకును పంపుచుండును.

౨ ఈసంచార గ్రంథాలయమునందు ఒక భాగము ౫౦ రూపాయల వెలగలిగి యుండును. గ్రంథాలయ మంతయు ౨౦౦ రూపాయలు ధరగలిగి యుండును. వీనిని కొనువారల కిది తక్కువధరలకు విక్రయింపబడును.

3 ఈప్రకారము ప్రస్తుత మొకవత్సరమువరకు ఆచరణలోనికి గొనివచ్చుట కుత్తరు వొసంగబడినది. ఈ విధానానుగుణముగ వర్తించుటకు వలయుసూత్రములును, తాత్కాలికమగు గ్రంథ పట్టికయునుగూడ నంగీకరింపబడినవి.

౪ ఈవత్సరమున కగు వ్యయము ప్రభుత్వమువారిచే విద్యకొరకు ప్రత్యేకింపబడిన నిధినుండి యొసంగబడును.

౫ సంవత్సరాంతమునకు మూడు మాసముల పూర్వమే యీవిధాన మెట్లుపకరించుచున్నదియు, దీనిని ముందుకూడ అనుసరింపవచ్చును అను విషయమును, అనుసరింపదగినయెడల ప్రథమవిధానమున చేయవలసిన మార్పులను చర్చింపుచు నొక నివేదికమును ప్రభుత్వము వారికి పంపవలయును.

## స్వభావము.

౧ పుస్తకములకు తగిన ఒక పెట్టెయు, సుప్రసిద్ధములగు ౧౦౦ కన్నడగ్రంథములును, "సంచార పుస్తక భాండాగారము"ను పేరును ఆంగ్లకన్నడ భాషలయందుగల యొక్క బిల్లయు, "మిమోరాండము"నకు కొన్ని తెల్ల కాగితములుగల యొక్క పుస్తకములపట్టియు, కన్నడ భాషలో వ్రాయబడి వ్రేలాడగట్టుట కనువగు ఇందులకు వలయు నియమములుగల యొక్క బల్లయు, గ్రంథాలయమున నుండవలయును.

౨ ప్రస్తుతము ౧౦౦ పుస్తకములుగల యొక్క "సెట్టు" గ్రంథములుమాత్రమే సంచార భాండాగారములయం దుండును. ముందు ముందు అన్నిరకముల గ్రంథములను చేర్పబడును.

## కార్యవిధానము.

౧ ఈవిధానము విద్యాసంఘమువారి యాజమాన్యముక్రింద ఉండును. సంచార గ్రంథాగారములకు సంబంధించిన సమస్యల పరిష్కరించుట కొక యుపసంఘ మేర్పాటు గావింపబడును.

౨ సంచార గ్రంథాగార వ్యాపనమునకును, గ్రంథముల సంరక్షణమునకును, ఈ యుద్యమ నిర్వహణమునకును మండలసంఘము లుత్తరవాదులు.

3 ఈగ్రంథాలయ వ్యాపనమునకు విపుల నియమములను మండలసభవారుగాని, వారియాజమాన్యమున తాలూకాభివర్ధనీ సంఘములుగాని యేర్పాటు చేయవచ్చును.

౪ సాధారణముగ ప్రతి సంచార గ్రంథాగారమును సంవత్సరమునకు ఆరు పల్లెలయందు సంచారముచేసి, ప్రతిస్థలమునను సుమారు ఆరు వారములు మొదలు రెండు మాసములవరకు ఉండవలెను.

౫ ఈసంచారగ్రంథాగారముల కుత్తరవాదియగు వాతని మండల సంఘమువా రేర్పరుపవలెను. ఈతడు మారినప్పుడెల్ల రిజిష్టరులో నావిషయమును వ్రాయుచుం

డవలయును. ఆయాపల్లెలలోని ఉపాధ్యాయుడీపని నిర్వహింపవచ్చును.

౬ ఈగ్రంథాలయ సంచారమునకగు వ్యయమును మండల సంఘముతే భరింపవలెను. అవసరమగు నెడల ప్రతిమండలమునకును విద్యాసంఘమువారిచే కొంత "గ్రాంటు" ఒసంగబడును.

౭ ఏపల్లెయైనను ఈసంచార గ్రంథాగారమును కొనదలచిన యెడల, దాని ధరను విద్యాసంఘమునకు బంపవలయును. దీనికి బదు లాతాలూకాలో సంచారము గావించుట కొకభాండాగారము మండలసంఘమువారికొసంగబడును. వీనిని కొనదలచువారికి తక్కువధరలకు విక్రయింపబడును.

## జాబితాలు, నివేదికములు

౧ ప్రతిగ్రంథాగారమును నరుసవారిగ లెక్కింపబడిన గ్రంథముల గలిగియుండును.

౨ ఈగ్రంథాలయములు చేయుపనిని గూర్చి తాలూకాభివర్ధనీ సంఘములు మండలసంఘములకు మూడుమాసములకొకపర్యాయ ఒకనివేదికమును పంపవలయును.

౩ మండలములయందు ఈగ్రంథాలయములు గావించుకార్యముల గూర్చి కేంద్రసంఘమునకు మండలసంఘములు మూడుమాసములకొక నివేదికము పంపుచుండవలయును.

౪ విద్యాసంఘమువారీ గ్రంథాలయముల గూర్చి మూడు మాసముల కొక నివేదికమును తయారుజేసి స్థాయిసంఘమువారికి బంపుచుందురు.

సంచారగ్రంథాలయములకగు ధనవ్యయమును గురించి తగినజాబితాలను- తాలూకాభివర్ధనీ సంఘములును, మండలసంఘములును, విద్యాసంఘమును సిద్ధముచేయవలయును. ఒక "క్యాషుబుక్కు"లో ఆదాయ మొకవైపునను వ్యయ మొకవైపునను విపులముగ తెలియునట్లు వ్రాయవలెను. ప్రతిసంచారగ్రంథాగారమునకును ఈ క్రింద వివరింపబడిన నమూనాలప్రకారము లెక్కలుండవలెను.

### గ్రంథములు ఎరువు పుచ్చుకొన్నవారి నామముల పట్టిక.

గ్రంథాగారముసంఖ్య............... భాగము.............

| గ్రామము | తాలూకా మండలము | పుస్తకము గైకొనినవారి పేరు | పుచ్చుకొనిన తేది | తిరిగియిచ్చిన తేది | గ్రంథమును గైకొనినవారి సంతకము | స్థానికభాండాగారాధిపతి సంతకం |
|---|---|---|---|---|---|---|
| | | | | | | |

### మైసూరు సంస్థాన సంచార గ్రంథాలయము సంఖ్య............

### గ్రంథాలయముయొక్క రవాణా వివరము.

| చేరిన వివరము | | | | | రవాణా వివరము | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| తాలూకా | క్రమసంఖ్య | ఆర్డరు నెంబరు తేది | గ్రంథాలయం వచ్చిన తేది | భాండాగారాధిపతి సంతకము | రవాణా చేయవలసిన తేది | రవాణా చేసిన తేది | రవాణాచేయబడిన గ్రామము పేరు | ఎవరిపేర రవాణా చేయబడినది | రిమార్కులు |
| | | | | | | | | | |

# గంజాం మండల గ్రంథాలయ సంఘము

౧౯౧౭ సం॥ నవంబరు తే ౧౭ దీని ఛత్రపురమునందు జరిగిన గంజాంమండల గ్రంథాలయ సంఘ కార్యనిర్వాహక సభయందు చేయబడిన తీర్మానములు:—

౧ ఈసంఘము పేరు "గంజాంమండల ఆంధ్రగ్రంథ భాండాగారసంఘము"

౨ కార్యనిర్వాహకుల విధులు:—

అధ్యక్షుడు—ఈతడుభాండాగార సంఘమును సదాపాలించుచు కార్యనిర్వాహక సంఘమువారు చేయు కార్యములను లేఖలను అప్పుడప్పుడు పరీక్షించుచు లోపములున్నయెడల కార్యనిర్వాహక సంఘమువారితో నాలోచించి ఉచితరీతిని జరిగించుచుండవలయును.

3 ఉపాధ్యక్షుడు:—ఈయన సంచార కార్యదర్శులకు కార్యనిర్వాహకమందు సలహానిచ్చుచు సహాయభూతుడుగా నుండవలయును.

౪ ప్రధానకార్యదర్శి:—ఈయన మండల గ్రంథాలయమును తనస్వాధీనములో నుంచుకొని ముందు జేయబోయే నిబంధనలననుసరించి గ్రంథాలయపాలనముచేయవలయును. ఈసంఘముయొక్క ఆదాయవ్యయములకు సరియయిన లెక్కలనుంచి ఈసంఘముపక్షమున అవసరమైన ఉత్తరప్రత్యుత్తరములు జరుపుచు ఇదివరలో చేయబడిన తీర్మానమునను సరించి త్రైమాసిక సభలను యేర్పాటుచేయుచు సంఘాభివృద్ధి కవసరమైన అన్నిపనులుచేయుచుండవలయును.

౫ సంచారకార్యదర్శులు:— వీరు వీలైనన్నిచోట్ల నూతనముగా గ్రంథాలయములను స్థాపించుచు తమ తాలూకాలోని గ్రంథాలయములను వీలయినంతవరకు మూడుమాసముల కొకసారియైనను తనిఖీచేయుచు అన్నివిధముల సలహాల నిచ్చుచుండవలయును. కార్యనిర్వాహక సభవారి తీర్మానములను గ్రంథాలయములవారు అమలులోపెట్టునట్లు చూచుచు గ్రంథాలయములనుండి సాంవత్సరిక చందాలను ఉదారవంతులనుండి మండలసంఘ నిధికై విరాళములును వసూలుచేసి ప్రధానకార్యదర్శికి బంపుచు తాముచేసినపనులనుగూర్చి మూడు మాసముల కొక రిపోర్టువ్రాసి త్రైమాసికసభయందు చదువుచుండవలయును.

౬ గ్రంథాలయములు:—ప్రతిగ్రంథాలయమువారును తమగ్రంథాలయముయొక్క త్రైమాసిక నివేదికలను ఆయా త్రైమాసిక సభలలో చదువవలెను.

౭ వ్యవహారమునందును సంభాషణయందును ఉత్తరప్రత్యుత్తరములయందును వీలయినంతవరకు ఈసంఘమువారు ఆంధ్రభాషకు ప్రాముఖ్యతనొసగి జిల్లాలోని గ్రంథాలయముల సభ్యులుగూడ తమ్మనుసరించునట్లు చేయవలయును.

౮ గ్రంథాలయములయందుంచవలసిన పట్టికలనుగూర్చి గ్రంథాలయసర్వస్వముయొక్క ప్రథమ సంపుటము నాల్గవభాగములో దెలుపబడిన నమూనాలను ఈమండలములోని గ్రంథాలయములవారు యెంతవరకు అనుసరించుటకు సాధ్యమగునో సంచారకార్యదర్శులు కనుగొని రాబోవు త్రైమాసికసభయందు తెలియపర్చవలయును.

౯ రాబోవు త్రైమాసికసభనుగూర్చి నరసన్నపేట నుండి తంతివార్తమూలముగా పంపబడిన శ్రీ పాట్నూరి స్వామి బాబుగారి యాహ్వానము అంగీకరించడమయినది.

# క్షాత్రయుగమునాఁటి హింద్వార్యులు—వారి భూగోళశాస్త్రజ్ఞానము

క్షాత్రయుగారంభమున హింద్వార్యులకు భూగోళశాస్త్రజ్ఞాన మెంతయుండెనో యూహించుటకష్టము; కాని తద్యుగాంతము నాఁటికి వారికి హిందూదేశమును గుఱించియు చుట్టు ప్రక్కలనున్న దేశములను గుఱించియు బాగుగాఁ దెలిసియుండెనని చెప్పవచ్చును. ప్రపంచ భూగోళమును గుఱించి వారికి వివరము లంతగాఁ దెలిసియుండలేదు. ఆ ప్రకారము తెలియనిచోట్లయందెల్ల వారు ఊహతో పనిగొనిరని తెలిసియున్నది. వీరకావ్యములందు వచ్చియున్న వర్ణనలనుబట్టి వారి "ప్రపంచము" ఎట్టిదిగానుండెనో చూతము.

మహాభారతానుసారము ప్రపంచపటము.





మహాభారతానుసారము:-ప్రపంచము అనేక ద్వీపములుగా భాగింపఁబడియున్నది. మనముండు భూభాగమునకు "జంబూద్వీపము" అనగా జంబూవృక్షముకల ద్వీపము అని పేరు. ఈద్వీపము అనేక 'వర్షములు' గా విభజింపఁబడియున్నది. * (పటము జూడుఁడు) భూమికి ఉత్తరపు సరిహద్దున క్షీరసముద్రమున్నది. దక్షిణపు హద్దున లవణసముద్రము కలదు. పూర్వ పశ్చిమలందును సముద్రము లున్నవి. § భూమధ్యప్రదేశమున మేరుపర్వత మున్నది. దీనికి దక్షిణమున మూఁడు పర్వత పంక్తులు పూర్వ పశ్చిమదిశల వ్యాపించియున్నవి. వీనిపేళ్లు నిషధపర్వతము (అల్టాయ్); హేమకూటము (కారాకోరము) హిమాలయము; హిమాలయమునకు- దక్షిణమున భారతవర్షమును, ఆదేయక్షాంశమునను్న ఇతర దేశములును కలవు. వీని ఉత్తరమున హైమవతవర్ష మున్నది. నిషధ పర్వతమున ఉత్తరమున ఇలావృతవర్షము కలదు. మేరువు, చిన్నవగు మఱి రెండు పర్వతములు (మాల్యవంతము గంధమాదనము, అనునవి) ఈభూభాగమును నాల్గు చిన్న భాగములుగాఁ జేయుచున్నవి. ఈనాల్గుభాగములలో నొకటి జంబూద్వీపము. ఈద్వీపమునకీ పేరు, అతివిశాలమగు

* ఈవర్షములలో కొన్ని నిజమైనవిగను కొన్ని యూహాజనితములుగను దోఁచుచున్నవి.

§ ఈసముద్రముల పేళ్లుమాత్రము కానరావు.

నొక జంబూవృక్షమునుండి యుత్పత్తియై ఉత్తరకురు దేశమువైపు ప్రవహించిన జంబూనదినిబట్టి వచ్చినది. తక్కిన మూఁడింటిలో పశ్చిమదిశనున్న రెండు దేశములకు 'భద్రాశ్వము' 'కేతుమాల' యని పేర్లు.

రామాయణానుసారము ప్రపంచపటము.




ప=పర్వతము

పైనవచ్చిన హైమవతవర్షమునందు, ఇప్పటి జపాను, మంచూరియా, మంగోలియా, ఉత్తర తుర్కిస్థానము, జర్మనీ, ఇంగ్లాండు చేరియుండవలెనని యనేకుల యభిప్రాయము. ఇఁక మేరువు అనునది ఉత్తరధృవసమీపమున నుండెనని యూహించినచో, ఇలావృతవర్షమున ఇప్పటి రష్యా, స్వీడెను, నార్వేలు ఒకవైపునను, ఉత్తర అమెరికా ఇంకొక వైపునను చేరియుండెనని చెప్పవచ్చును. ఇచ్చటిభూమి బంగారపుదని మనవారు చెప్పియున్నారు. ఉత్తర కనడాలోని యొకభాగమున బంగారుదొరకుచున్నమాట వాస్తవమే కాని ఈసామ్యము కాకతాళీయముగా సంభవించినదని తోఁచుచున్నది. ఈవర్షమునందే చేరియున్న రష్యా సైబేరియాలు ఇప్పటికాలమందంత సుఖప్రదమైనవి కాకపోయినను పురాతనకాలమున నిప్పటికంటె నెక్కువ వాసయోగ్యములుగా నుండి యుండవచ్చును. ఇంతేకాక, అవి యార్యుల అతిపురాతన నివాసస్థలములైన కారణమున వారు ఆప్రదేశమును "పుణ్యభూమి" గా నెంచుచుండిన నుండవచ్చును. మేరువున కుత్తరమున నున్నవని చెప్పబడి యున్న మూఁడు పర్వతములు దక్షిణముననున్న మూఁడు పర్వతపంక్తుల నుబట్టి కల్పింపఁబడినవై యుండవచ్చును. దక్షిణముననున్న పర్వతపంక్తులను మాత్రము మనవారెఱింగియే యుండిరనుట నిస్సంశయము. ఏలయనఁగా, కైలాసపర్వతమున కుత్తరముననున్న హరివర్షమునం దొక విశాలమైన ఇసుకయెడారియు నొకసరోవరమును ఉండినట్లు వర్ణింపఁబడి యున్నది. మహాప్రస్థానికపర్వము నందుఁ గూడ పాండవులు ఉత్తరాభిముఖులై పోవునప్పుడు, ఒక యిసుక యెడారిని దాటిరని చెప్పబడియున్నది. ఈయిసుక యెడారి ఇప్పటి "గోబీ" యెడారియేయనియు, సరోవరము "ఆరల్ సముద్రము"(Sea of Arl) అనియు స్పష్టముగాఁ దెలియుచునే యున్నది కదా.

కొంత యదార్థమును కొంత యూహాజనితమును నగు వైపరీత్యమే ఇంచుకమార్పుతో రామాయణమునందు వచ్చినది; కాని రామాయణమునందు ఈవారు నిరంతర

ప్రభుత్వములభించినందున మతింతగందరగోళము సంభవించినది. రామాయణమును తుదిమాఱు వ్రాసిన యాతనికి హిందూదేశపు భూగోళవివరములు సరిగా తెలియవు. తెలిసినభాగమంతయు నొకఉత్తర హిందూస్థానము మాత్రమే. అట్లుండియు, అతఁడు, సుగ్రీవుఁడు సీతాన్వేషణమునకై వానరులను నలుదెసలకంపుచుండిన కథ గలసందర్భములో, ప్రపంచభూగోళమును కేవలమూహాపోహలతో నింపి వర్ణించియున్నాఁడు. ఈవర్ణనమునందు మేరువు ఉత్తరమునుండి యెగిరి ప్రపంచముయొక్క దక్షిణదిశాంతమునవచ్చి నిలచినది. రామాయణపుకడకర్త జ్యోతిశ్శాస్త్రజ్ఞానములేనివాఁడగుటచేత కాఁబోలు, మేరువు పశ్చిమముననుండనిచో సూర్యుఁడు మేరువుచుట్టుతిరుగుటెట్లు సంభవించునని సందేహపడి యా మేరువును పశ్చిమదిశాంతమున స్థాపించెను!

సూర్యుఁడు తూర్పుకొండలయం దుదయించి పడమటికొండలలో నస్తమించుననియు- ఈకొండలు రెండును ప్రపంచమునకు పూర్వపశ్చిమదిశలందు హద్దులనియు, వానికావలిప్రదేశములు మనుష్యులుప్రవేశించుటకు వీలులేనివనియు- అస్తమసమయమున సూర్యుఁడు మేరువు వెనుకకుబోయి, పడమటికొండనుండి యుత్తరమునకుఁబోయి యుదయసమయమువరకు తూర్పుకొండకద్దికివచ్చుచుండుననియు మనవారి యూహ. మనవారొకరి నేయననేల? భూమిపలకవలెనున్నదని నమ్ముచుండిన పూర్వకాలపువారందఱకిని పశ్చిమమునకుఁబోయి యదృశ్యుఁడైన సూర్యుఁడుఉదయమువఱకు తూర్పునకెట్లువచ్చుచున్నాఁడోయనునది మహదాశ్చర్యకరమగు సమస్యయైయుండెను!

అప్పటికాలపు హిందార్యుల ప్రపంచభూగోళజ్ఞానము సరియైనదిగా నుండకపోయినను, వారికిమనదేశమునుగుఱించియు, మనచుట్టుప్రక్కలనున్న దేశములనుగుఱించియు బాగుగాదెలిసియుండుననిఒప్పుకొనకతప్పదు. హిమాలయము, కారాకోరము, అల్టాయి అనుమూడు పర్వతపంక్తులును- తిబెత్, తుర్కిస్థానము, సైబీరియాలయందుండిన "గోబీ"మున్నగు నెడారులును, అనేకసరస్సులును వారికిఁదెలిసియుండెను. గ్రీకులను, పర్షియనులను, సిథియనులను, హూణులను, చైనీయులను, ఉత్తరప్రాంతములందు నివసించు అనాగరకజాతులను వారెఱిఁగియుండిరి. అలెగ్జాండరుని దండయాత్రయైన పిమ్మట మనవారికి నైనబేర్కొనిన జాతులవారిపరిచయము కలిగెనని కొందఱువాదింతురు కాని యది సరికాదు. మహాభారతములోని యొకశ్లోకము * నందు ఉత్తరదిశయందలి మ్లేచ్ఛులు పేర్కొనబడియున్నారు. వారిలో హిందూదేశమున కుత్తరమున నివసించుచుండినజాతులన్నియు చేరియున్నవి. క్షాత్రయుగాంతమున అనఁగా అలెగ్జాండరునిదండయాత్రకు పిమ్మట ఈజాతులవారిని మనవారెఱుఁగుదురనుటయందు సంశయములేదు. కాని అంతకుపూర్వము కొన్నిశతాబ్దముల కాలమునుండియే మనవారు ఈజాతులకు కృతపరిచయులేయనుటకు కారణములుకలవు. "డెరయసు" అనుపారసీకదేశపురాజు సింధునదికి పశ్చిమముననున్న భూభాగమును తన సామ్రాజ్యమున గలిపికొని దానినొకసాత్రపీ (Satrapy) గా నేర్పఱచెను. కనుకపారసీక రాజధానియందును, పారసీకసేనలయందును జయింపఁబడిన మనవారిలో ననేకులుండియుందురు. కనుక మనవారు గ్రీకులను, సిథియనులను అలెగ్జాండరుని రాకకెన్నియో శతాబ్దములకు పూర్వము ఎఱిఁగినవారైయుండవలెను. 'హిరాడోటసు' అనుచరిత్రకారుఁడు 'డెరయసు' పాలనముక్రిందనున్న సాత్రపీలను వర్ణించుచు, ఇరువదవ సాత్రపీయగు మనదేశము (హిందూదేశము) విశేషజనసంఖ్యకలదనియు, దీనికి తూర్పుసరిహద్దున నొకయెడారి యున్నదనియు చెప్పియున్నాఁడు. హిరాడోటసు పై చరిత్రగ్రంథమును క్రీ. పూ. ౪౪౦ సంవత్సరప్రాంతమున వ్రాసినాఁడు కనుక ఆకాలమున మనవారిని గ్రీకులెఱిఁగియుండిరనుట స్పష్టము. అంతేకాదు. అస్సీరియనుల (Assyrians) తోడను చాల్డియనుల (Chaldians) తోడను హిందార్యులకు అంతకుపూర్వమే వర్తకసం

* యవనాశ్చ సకాంభోజా, దారుణా మ్లేచ్ఛజాతయః । సకృద్ద్రుహాః కులత్థాశ్చ, హూణాః పారసికైః సహ । తథైవ రమణాశ్చీనాః, తథైవ దశమాలికాః ॥
—భీష్మపర్వము. అధ్యా: ౯.

బంధములుండెను. కనుక మాయభిప్రాయమున, మనవారు 'యవను'లనబడు అయోనియనులను గుఱించి క్రీ. పూ. ౪౫౦ సంవత్సరము ౪౧౦కె పూర్వమే చెప్పఁగా విని యుండవచ్చును. పరిచయము మాత్రము "డేరయసు" కాలమునుండి కలిగియుండవచ్చును. మహాభారతమునందలియొక * శ్లోకమునందున్నట్లు, అలెగ్జాండరునిదండయాత్ర యైనతరువాత వారితో మనవారికి మఱింత సమీపసంబంధ మేర్పడియుండవలెను. యవనులనుగూర్చిచెప్పిన యీమాటయే పారసీకులు, సిథియనులు మున్నగు ఉత్తరదేశవాసులకుఁ గూడ వర్తించుచున్నది.

ఇక హిందూదేశమునకువత్తము. శాస్త్రయుగారంభమునుండి తద్యుగాంతము నాఁటివఱకును కొంతస్పష్టముగనైన నేమి కొంతయస్పష్టముగనైన నేమి, మనవారు ఈదేశము నామూలాగ్ర మెఱిఁగియుండిరి. వేదమునందు సముద్రముమాటవచ్చియున్నది సింధునదీప్రవాహము వెంటవెంట నౌకలలోఁబోయి యుండిననేకాని వారికి సముద్రపు సంగతి తెలిసియుండదు. వేదమునందు పంజాబునందలి నదుల పేళ్ళును, గంగాయమునల పేళ్ళును, (వీనియుత్పత్తిస్థానములకు సమీపమున వారినదులనెఱిఁగియుండిరి.) వచ్చియున్నవి. రామునికాలమున మనవారు తూర్పుసముద్రమును, గోదావరినదిని, కొంతయస్పష్టముగానైనను లంకాద్వీపమును, తెలిసియుండిరి. శ్రీకృష్ణునికాలమున ఉత్తరహిందూస్థానము నామూలాగ్రమును, దక్షిణహిందూస్థానములోని చాలభాగమును మనవారెఱిఁగియుండిరి. ఇంతయేల? మహాభారతము తుదిమారునిర్మింపబడుటకుముందే, అలెగ్జాండరుని దాడికి ముందే, మనవారికి హిందూదేశము బాగుగాఁ దెలిసియుండెననుటకు సందియపడవలసిన పనిలేదు.

అయినను పాశ్చాత్యవిద్వాంసులు ఈవిషయమున తప్పుగా నభిప్రాయపడియున్నారు. వారివ్రాతలనుబట్టి చూచినచో, బుద్ధునికాలమున మనవారికి దక్షిణదేశము తెలియనే తెలియదు. చంద్రగుప్తకాలప్రాంతమున మనవారు లంకాద్వీపమున నివసింపఁబోయిరగట! బుద్ధుని నిర్యాణ సంవత్సరమున లంకాద్వీపమున మొట్టమొదట ఆర్యజనావాస మేర్పడెనను నభిప్రాయముతప్పనియు, నికాయములు వ్రాయఁబడుటకుముందు ఆర్యులుసింహళమునకువచ్చుట సంభవించియుండదనియు, రైసుడేవిడ్సు వ్రాసియున్నాఁడు. ఇట్టివాదమునకాధార మేమనఁగా, బుద్ధునికాలమునరచింపఁబడిన పైగ్రంథములలో చెప్పబడియున్న ౧౬ రాజ్యములలో ఒకరాజ్యముమాత్రము వింధ్యకుదక్షిణమున గోదావరితీరముననుండినట్లు చెప్పఁబడియుండుటయట. "ఆగ్రంథములలో దక్షిణహిందూస్థానము, లంకాద్వీపము, పేర్కొనఁబడియుండకపోవుటేకాక గంగానదికితూర్పుననున్న వంగ, ఒరిస్సాదేశములుకూడలేవు; దక్షిణాపథము రాలేదు. "దక్షిణాపథమునకు వాకువచ్చుట నికాయములకాలమున సంభవించినది. "వినయ" గ్రంథమునందు "భరుకచ్ఛ" పేరును, "ఉదాన" గ్రంథమునందు "సుప్పరక" పేరును వచ్చినవి." "రామాయణీయప్రాముఖ్యతగల దక్షిణహిందూదేశమును గుఱించియు లంకాద్వీపమును గుఱించియు ఉల్లేఖనమే లేకపోవుటయు, ఆర్యులపురోగమనము అంతపరిమితముగానుండుటయు ఆలోచింపఁదగిన యంశములైయున్నవి" § అని రైసుడేవిడ్సువ్రాసెను.

పైవాదను మామనస్సునకు అసంగతమైనదిగా దోఁచుచున్నది. బుద్ధునికాలపు ఒకగ్రంథమున పేర్కొనఁబడిన ౧౬ రాజ్యములలో చెప్పఁబడనిరాజ్యము ఆకాలమున అసలేయుండలేదను వాదమెట్టిదనఁగా, భారతమునరెండుమారులు వచ్చియున్న షోడశ మహారాజుల పేళ్ళలో లేని మహారాజెవ్వఁడు పురాతన హిందూదేశమున నుండనేలేదనువాదమువంటిది. పూర్వకాలపు గ్రంథములందువచ్చిన యిట్టిపేళ్ళపట్టికలు సమగ్రమైనవి యని యూహించుటకు కారణము కానరాదు. ఆగ్రం

* సర్వజ్ఞాయవనారాజ, శూరాశ్చైవవిశేషతః కర్ణపర్వము
§ Budhist India by Rhys Davids.

ధనులు సంపూర్ణములగు చరిత్రలుగాని భూగోళశాస్త్రములుగాని కావు. సైవాదము ఇట్టివైపరీత్యమునకులోనైనదని తెలియుచుండినను ఏలనో పలువురువిద్వాంసులిట్టి తర్కమే చేయుచుందురు. ఒకసంగతికాని యొకపేరుకాని పురాతన మతగ్రంథమున పేర్కొనఁబడియుండనంతమాత్రమున అట్టిసంగతికాని ఆపేరుకాని ఆకాలపుజనులకు తెలిసియుండదని వాదించుటతర్కమే కాదని కొంచెమాలోచించిన ప్రతివానికి తెలియఁగలదు. *

దక్షిణహిందూస్థానమును, సింహళమును, మనవారికి అలెగ్జాండరుదండయాత్రకంటె పూర్వయే అనఁగాచంద్రగుప్తునకు, లేక నికాయములు వినయగ్రంథములు వ్రాయఁబడినకాలమునకు, పూర్వమే తెలిసియుండెనని మాపుటకు కావలసినంత సాక్ష్యముకలదు. అలెగ్జాండరువెంటనుండిన ఎరటస్తనీసు(Eratosthanes) మున్నగు పాశ్చాత్య గ్రంథకర్తల వ్రాతలనుబట్టిచూడఁగా హిందూదేశపు టుత్తరభాగమున నివసించుచుండిన వారికి హిందూదేశమునుగురించిన సంపూర్ణజ్ఞానముండెనని తెలియుచున్నది. హిందూదేశమునుగురించిన వివరములను మనవారు అలెగ్జాండరునకు చెప్పియుండిరని ఎరటస్తనీసు వ్రాసిన గ్రంథమునఁగలదు. ఈ గ్రంథమున మనదేశమందలి ముఖ్యప్రాంతముల వైశాల్యములు చూపఁబడియున్నవి. దూరమునుగురించిన యావివరములు నేటికిని సరిపోవుచున్నవనియు అంతపురాతనకాలమున మనవారికి దేశమునుగురించి యంతటివివరములు తెలిసియుండుట గొప్ప విషయమనియు, కన్నింగ్‌హాము (General Cunningham) ఆశ్చర్యమును ప్రకటించియున్నాఁడు. §

—మానపాటి హనుమంతరావు.

# ఇంద్రవర్మ కోండ్రుణగూరు శాసనము.

నేనీవఱకొకసారి యింద్రవర్మశాసనమునుగురించి కృష్ణాపత్రికలో వ్రాసియుంటిని. ప్రస్తుతము నేనాశాసనప్రతి నిందుతోఁ బ్రకటించుచున్నాను. ఇంద్రవర్మ శాసనము లీవఱకుఁగూడఁగను పెట్టఁబడినవి. (Sewell Vol II 24, 25) అవి స్పష్టముగ నీసనివని కనఁబడుట లేదు. పూర్వ చాళుక్యవంశ మూలపురుషుఁడగు కుబ్జవిష్ణువర్ధనుఁడన్నయగు సత్యాశ్రయునితోవచ్చి పిఠాపురము కోటలు జయించెను. పిమ్మట నన్నచే నీతఁడిచ్చట పరిపాలకుఁడుగా నియమింపఁబడెను. ఈతనికిఁ బిమ్మట నీతనికొడుకగు జయసింహుఁడు పిఠాపురమును పాలించెను. కుళోత్తుంగచోడదేవుడు మొదలయినవారు పిఠాపురము సత్రమునకై కొంతభూమిని దానమిచ్చియున్నారు. కాఁబట్టి చాళుక్యులు పిఠాపురమును పాలించిరి. జయసింహుని తమ్ముడగు నింద్రభట్టారకుఁడు కూడఁ బిఠాపురమును పాలించెనని యీశాసనమునందుఁ జెప్పఁబడకపోయినను నమ్మవలసి యున్నది. సత్యాశ్రయుఁడు బౌద్ధులగు సాలంకాయనులకడనుండి యాంధ్రదేశమును దీసికొన్నట్లు కొందఱు చరిత్రకారులు వ్రాయుచున్నారు. "ఆంధ్రభారతి" లోఁ బ్రకటింపఁబడిన మాధవవర్మ, జయసింహుల శాసనములవలన నీదేశము

* సింధు, సౌవీర, సౌరాష్ట్రి దేశములపేళ్ళు ఈ ౧౬ రాజ్యములలో లేవు. అయినను ఈరాజ్యములు కూఁడను ఆకాలమునను, అంతకుపూర్వమునను ఉండినవే యనుట నిస్సంశయము. పైనచెప్పిన ౧౬ రాజ్యములు బౌద్ధమతప్రచారకులు పోయి తన్మతవ్యాప్తికై యత్నించినరాజ్యములై యుండవచ్చును. ఇతరరాజ్యములుండెను కాని బౌద్ధమతప్రచారకు లచ్చటికి పోలేదని యూహింపవలెను.

§ The close agreement of the dimensions given by Alexander's informants with the actual size of the country is very remarkable and shows that the Indians at that early date of their History had a very accurate knowledge of the form and extent of their native land. (Cunningham's Ancient Geography of India).

చాళుక్యులకుఁ బూర్వము బ్రాహ్మణభక్తిగల గోవింద వర్మ పుత్రుఁడగు మాధవవర్మాది క్షత్రియులచేఁ బాలింపఁబడినట్లును, గుద్దవాడయనఁగా గుడివాడ కాక గుద్రహారయనఁగా గోదావరి మండలమునకుఁ బేరనియు దెలియుచున్నది. గోవిందవర్మ రాష్ట్రకూటులలోనివాఁడని కొందఱనుచున్నారు.

కాఁబట్టి యింద్రవర్మ గోదావరి మండలములోని పిఠాపురమును బాలించినరాజని నమ్మవలసినది. పిఠాపుర ప్రభువయిన యింద్రవర్మ యిచ్చిన శాసనము నేఁటికి 'ఒంగోలు' తాలూకా పాటిదిబ్బలలోబయటపడుటయు నది తిరిగి మానగరమునందలి యాంధ్రపరిశోధక మహామండలికిఁ జదువవచ్చుటయు విచిత్రముగ లేగదా?

శాసనము వచ్చిననాఁటికి నాకందలియక్షరములు చదువు సేర్పు లేదు. ౮, ౧౦ దినములలో గ్రంథసహాయము లేనియిచ్చట పరిషత్పత్రికలతో నెట్లోయదిచదివి వ్రాయుచుంటిని. విషయము తెలిసికొనుటకు శ్రీజయంతి రామయ్యపంతులు గారు ప్రకటించిన శాసనములు నాకుఁ జాల సాయపడినవి. సంగతులు తెలియఁగానే వివరములు నాకుఁ దెలిసినంతవఱకుఁ బాఠకుల కెఱిఁగించితిని. ప్రస్తుతము శాసనమునిచ్చిన మాగ్రామ భాండాగారమువారు పనియున్నదని యాశాసనమును దీసికొనిపోయి మరల నాకంపలేదు. నేను వ్రాసియిచ్చిన కాగితపుఁ బ్రతినైన నీయరయిరి. ముందు వారిచ్చినప్పుడు పరిచూచుకొనవచ్చునని ప్రస్తుతము నాకడనున్న చిత్తుప్రతి నిందుతోఁ బ్రకటించితిని. శాసనములోఁ జివర భాగము రెండవమారు సరిపోల్పలేనందునఁ దప్పులున్నవి. ఈ చిత్తుప్రతియైనఁ బోవునేమో, దేహము లశాశ్వతములని ఇదుమూలమున, బ్రకటించితిని. శాసనమును సంపాదించినవారు మరియొకరిచేతనైన నా శాసనప్రతిబింబములఁ బ్రకటింపఁ జేయుదురని నమ్ముచున్నాను. పరిషత్పత్రికలోఁ బ్రకటింపఁబంపిన సర్వోత్తమము! ఎవ్వరైన నమలిమింగునది లేదు. లోకము కొఱకుఁ గన్నులు నుంటలెత్తునటులు చదివి ప్రకటింపవలసినదే కదా! నాచే నీమాత్రపుఁ బనియైనఁ జేయించిన శ్రీసూర్యరాయ భాండాగారము వారికి నా వందనములు!

—*ఇంద్రవర్మకోడ్డణగూరుశాసనము.*—

స్వస్తిశ్రీమతాం సకలభువనసంస్తూయమానమానవ్యసగో। త్రాణాం హారితీపుత్రాణాం స్వామిమహాసేనపదాన్యధ్యానధ్యా। నాణాం కౌశికీవరప్రసాద లబ్ధరాజ్యానాం భగవన్నారాయణ ప్ర। సాదాసమాసాదిత వరవరాహలాఞ్ఛనేక్షణక్షణవశీక్రి (*) తాశేష। మహీభృత అశ్వమేధావభృథస్నానపవి[త్రీ] క్రి(*)తమా। ణాం స్వయశో విజయాక్రి (*) తత్రైలోక్యాణాంచలుక్యాణాం। (కు) లమలంక్రి (*) త్యానిజజన్మనావిరాజమానాః శ్రీకీర్తివర్మమహా। రాజస్యనప్తాశ్రీ విష్ణువర్ధన మహారాజఃరణముఖీగత (?) రిపు। విజయసముపలభ్యః శ్రీవధూనివాసాయమాన విపులవక్షస్థల। స్య పుత్రఃశక్తిత్రయ సమధిగతమహాజ్యైతవిభూతిత్రి। వర్గసేవా నిపుణఃపురాణపురుష ఇవబహులోకస్తుతః। పురారాతిరి వభూతగణప్రియః ద్వితీయ ఇవమకరధ్వజః। పులోమ (?) యివలోకపాలః పృథాగ్రసుత ఇవసత్యసన్ధః శరత్కాల ఇవ। క్రి(*) తబన్ధుజీవోత్సవః పూర్వాచలేన్ద్రి ఇవ మిత్రోదయానుకూల। మహిమా, మహీపతి మకుటతట ఘటిత మహారత్నమరీచీ మ। ఞ్జరీరఞ్జితచరణార విన్దయుగళః। శ్రీన్ద్రివర్మమహారాజః త్యా। గధేన్వపరనామధేయః ఉదకపూర్వకం సర్వకరపరిహారోపేతం। జ్యామాదయతిత్వ (?) కోడ్డణగూర ... గ్రామ, గ్రామంప్రాదాతతస్య గామస్య। దిగ్విభా ః (౦) ఉత్తరతః మాజుణ్వర నామగ్రామ। పూర్వ ః పగుసిరునామగ్రా। మః దక్షిణదిగ్భాగతస్థితః చేంబూరునామగ్రామపశ్చిమతఃఇలుతీనామగ్రామః। ఏతేషాంగ్రామాణాం మధ్యేనివాసీక్రి(*)తంవాజసనేయుచ। చరణస్యదుర్గశర్మణః బ్రహ్మవిహిత

(*) కృ 'ఋ' కారము పై విధముగా వ్రాయబడుచువచ్చెను,

(౦) దిక్కులు

కర్మనిరతస్య ఇజ్జిద్దబోయనామధేయస్యపౌత్రాయ అభి జనవిద్యాప్రవి(౨)త్తశతః భరద్వాజసగోత్రస్య విష్ణుశర్మ ణఃపుత్రాయ వేదవిద్విప్రసంస్తూయమాన చరితాయ చెద్ది శర్మణేమాతా పిత్రోరాత్మనశ్చ పుణ్యావాప్తయేయితి చ (*) భావినోరాజ్ఞాపి యథోపచారపురస్సరం సమ్మా నయతిష్యా య్య । వ్యతగంగాగ్గగనతిలకఖ్యాత కేబ్ధవర్మ నామహారాజస్యగ్రసత ఇ । ంద్రశర్మణానామధేయవిజ్ఞా పనయా తస్య విజ్ఞాప్తిరే వ అలపాకల । బ్రాహ్మణ సోమయాజులచెద్దొకిబో తేమారపబః అపిచమోహాలో భ । ద్వయాంకగ్దిద్విప్పకత్తేరసపఈ మహాపాతకయు క్తో భవిష్యత ఇతిచ । వేదవ్యస్య శైకశ్చాత్ర నిష్ప తాభత్రి గోవిప్రబాలయోషిత్త । పస్వినఃయాగతి స్వా భావేత్తిరి త్రిపారతశాసనాజ్కితామష్టిం పచపస । హాస్రాణిస్వగ్గతిష్ఠతిభ్యామిదః శ్రీకాన్తామనుమన్త చ తాస్యవన । రకేవసేతబిపుభిర్వ్యధాదత్తా బహూనిశ్యాను పాలితాయస్యయ । స్యయదాభ్యామి తస్యతస్యతదా

ఫలం ఇతి । కనకగామలిగ్వి । శానతిచతుపష్ట్యశః ఏ తేషాసామానాం ఏకోరాశం తంతే × । పత్తాదుజ్ఞారాం శంచోదచేందద త్రితి యాగ్యం॥ చంద్రబింబ మున్నది. “త్యాగధేను” అనిరాజముద్రయున్నది.

సూచన. పంక్తులకు మధ్యనున్న గీట్లు శాసనపంక్తు లఁ దెలుపును. అనగా గీటునడుమ దొకపంక్తిగా గ్ర హింపవలెను. శాసనమున పంక్తు లెట్లున్నది తెలుపుట కిట్లు గుర్తింపబడినది. శాసనమునకుఁ జివరభాగము శా సనమున్నవారైన బోల్చి సవరించి ప్రకటింతురనియు, నెవ్వరు ప్రకటించినను దేశోపకారమనియు నేను మొ దట వ్రాసినది వ్రాసినట్లే ప్రకటింపవలసి వచ్చినందులకుఁ జింతిల్లుచుఁ బాఠకుల మన్నింపవేడెదను.

—వంగూరి సుబ్బారావు.

# కాగితములులేని పుస్తకములు

ప్రతిక్షణమును మార్పులు కలుగుచున్న యీదినముల లో- యుద్ధమూలమున నొక దేశమునందలి సరుకు లొక దేశమునకు రాక ప్రతి దినావశ్యకములైన వస్తువులను తయారు చేయుటలో క్రొత్తపద్ధతులు కనిపెట్టబడవలసి వచ్చుచున్న యీదినములలో- ఇక ముందుముందు పుస్త కములు కాగితముమీద కాక ‘నికెల్’ పుటలమీదనో, ‘ఉక్కు’ పుటలమీదనో అచ్చువేయబడునని భవి ష్యత్తుచెప్పుటకు గాల మనుకూలముగ నున్నది. ఇట్లను చున్నది యుద్ధము మూలమున గలిగిన కాగితపు కఱవు వలనకాదు. కాగితమును తయారుచేయుటలో నుపయో గపడు ‘కఱ్ఱగుజ్జు’ నిచ్చు ప్రపంచమందలి యడవు లెల్లకాలము శాశ్వతముగ నుండవని యట్లనవలసి వచ్చు చున్నది.

ఇట్లు జోస్యముచెప్పిన యతని పేరు థామస్ ఎ. ఎడిసన్. ఇతడు ఫోనోగ్రాఫ్ యంత్రమును కనిపట్టెను. ఇత డొక పత్రికా ప్రతినిధితో ఇట్లని చెప్పెను:-“విద్యు ద్రసాయనపద్ధతివలన అచ్చుసినానుపీల్చు ఉక్కు, రాగి, (నికెల్) రేకులను నేను చేయగలను. నేను చెప్పిన యీ మూడులోహములలో ‘నికెల్’ లోహము కాగితమునకు బదులుగ ఉపయోగించుటకు మిక్కిలి యుక్తమైనదని నాతలంపు. ఈలోహపు రేకును అంగుళములో ఇరువదివేలవంతు దళసరి యుండునట్లు తయారు చేయ వచ్చును. అది సామాన్యముగ పుస్తకములకుపయోగిం చు కాగితములకంటె చౌకగను, అంతకంటె దళసరిగను, అంతకంటె మృదువైనదిగను చేయవచ్చును. ఇట్లనుచు ఎడిసను లోపలకుబోయి తన బీరువాలోనుండి రెండంగుళముల దళసరిగల యొక పుస్తకమును తీసికొని వచ్చెను. ఆతడాపుస్తకమును జూపుచు నిట్లనెను:-“ఈపు

* ఇంతటనుండి శాసనములోఁ జోల్చుకొనబడిన శాసనము నిచ్చినవారు పేర్కొనిపోయిరి

స్తకమునందలి పుటలు 'నికెల్' పుటలే యైనచో అవి ౮౦,౦౦౦ లుండును. ౮౦,౦౦౦ ల పుటలను గలిగిన యీపుస్తక మప్పుడు ఒక పౌనుమాత్రమే తూగును."

సున్నితమైన కాగితము నుపయోగించినచో ఈనాటి గ్రంథప్రకాశకుడు అంగుళము దళసరిగల పుస్తకమునకు ౧౫౦౦ ల పుటలను పెట్టగలడు. సాధారణముగ పుస్తకమున కుపయోగించు ఇతరకాగితము నేవాడుకచేసినచో అంగుళము దళసరిగల పుస్తకమున ౩౫౦ పుటలు పట్టును.

కాగితముకలెనే నికెలురేకులు సైతము సిరానుపీల్చును. ఇట్టి రేకులకై ప్రస్తుతముపయోగపడుచున్న సిరాకంటె బహుశహా మఱికొన్ని యితరపదార్థములతో సిద్ధముచేయబడిన క్రొత్తసిరా కావలసియుండును. అయినను ప్రస్తుత ముపయోగపడు సిరాకూడ చాలవఱకు కుపయోగించును. శ్రేష్ఠమైన 'క్యాలెండరు' కాగితము మీద నెన్నిచాయలతో 'హాఫ్‌టోన్' బొమ్మలు అచ్చొత్తింపబడుచున్నవో అన్ని చాయలతోను ఆబొమ్మలు ఏరంగులోనైనను ఈనికెల్ రేకులమీద ముద్రింపవచ్చును. కాగితముమీద నేది యచ్చొత్తింపబడినను అదియెల్ల నీనికెల్ రేకులమీద నచ్చొత్తింపవచ్చును.

లోహపు 'కాగితము' ఎడిసనుయొక్క రసాయనశాలలో తయారుచేయబడినది. అయిదు చతురపుటంగుళముల పరిమాణముగల యిట్టి లోహపురేకు నొకటి తయారు చేయుటకు ఒక నిమిషమునుపైగా నొక యరనిమిషము పట్టును. ఈనికెలు రేకులను వర్తకవ్యాపారము జరుపుటకుకూడ వీలగునట్లు తయారుచేయవలయునన్న పెద్దపెద్ద యంత్రములను గట్టుటయావశ్యకమై యున్నది.

నికెలుపుటలను కలిగియున్న పుస్తకమునకు అట్టలు కూడ అపదార్థముతోనేగాని అవసరమయినచోట ఉక్కుతోగాని తయారుచేయవచ్చును. ఆయట్టమీద లతలనుబోలిన యనేకములగు నందమైన కల్పనలను గూడ నచ్చువేయ వచ్చును. గుడ్డతో జేయబడిన 'బైండు' గాని, చర్మముతో జేయబడిన బయిండునుగాని తెలియజేయునట్టా యట్టలకు రంగు వేయవచ్చును.

ప్రస్తుతము పుస్తకము లచ్చువేయుచున్న కాగితము మిక్కిలి పల్చనైన దగుచో నూరేండ్లలో నది శిథిలమయిపోవునని గ్రంథభాండాగారికులు మొఱపెట్టుచున్నారు. వివిధ దేశములయందున్న అనేకవేల గ్రంథభాండాగారములనందు లక్షలకొలది కోట్లకొలది గ్రంథముల నచ్చువేయించుటకు వ్యయమగు ధనమునుగూర్చి యోచింపుడు. గ్రంథములన్నిటిని సంరక్షింపవలసియే యున్నచో వీనినన్నిటిని నూరేండ్లకొక పర్యాయము మఱల ప్రచురింపవలసి యున్నది. అది యటుండ నీవఱలో నెన్నెన్ని యమూల్యములైన గ్రంథము లగ్నిహోత్రములపాలై భస్మమైనవో యోచింపుడు! తగుమాత్రపు వేడికి నికెలుపుటలభేద్యమై యుండును. అవి కూడ కరగుననుకొండు, కరిగినను వేడి మిక్కుటమైనప్పుడుకాని కరగవు. కాని వానియంతట అవి నిప్పంటుకొనవు. అదియునుగాక నికెలుపుస్తకము నెంతకాలమైనను నీటిలో నాననిమ్ము. తరువాత దానిని నీటిలోనుండి తీసి యాఱబెట్టవలసినరీతి నాఱబెట్టినచో క్రొత్తపుస్తక మెట్లుండునో అదికూడ నట్లే యుండును.

ఇట్టిలోహపుపుస్తకములవలన గలుగులాభము లింకను ననేకములు కలవు. నలుబదివేల పుటలుకలిగిన యొక లోహపుపుస్తకము అంగుళముదళసరిమాత్రమే యుండును. అంతేకాక అచ్చువేయుటకు గల స్థలమునుబట్టి చూచినచో నది యొక్కొక్కటి రెండువందల కాగితపుపుటలుగల రెండువందల పుస్తకములకు సమానముగనుండును. ఇట్టరెండువందల కాగితపుపుస్తకములనే యొకదానిపై నొకటిపెట్టుచోనవి తొమ్మిదడుగులున్నరయెత్తుండును. అట్టిరెండువందల పుస్తకములలో పట్టువిషయమంతయు నొక్క యంగుళముమాత్రమే దళసరిగలిగిన నలుబదివేల పుటలుగల లోహపుస్తకమున ముద్రించుటకు వీలగును. క్రమక్రమముగ సారస్వత మభివృద్ధియగుటచే పుస్తకములను బెట్టుటకు గొప్పగొప్పభవనములు కట్టవలసివచ్చుచున్నవి. ఈనికెలుపుస్తకముల నుపయోగించినచో నంతటిగొప్ప భవనములను గట్టనవసరములేక చాలధనమును కూడబెట్టవచ్చును.

# గంజాంమండల గ్రంథాలయ సంఘము

౧౯౧౫ సం॥ మార్చి నెల ౨౮ తేదీన నరసన్నపేట శ్రీ నాగేశ్వరరాయగ్రంథాలయమందిరమున ద్వితీయసభ జరిగినది. వరహాగిరి వేంకటజోగయ్యాపంతులుగారు అధ్యక్షత వహించిరి.

ప్రథమమున ప్రధానకార్యదర్శులగు పోతాప్రగడ సింహాచలంపంతులుగారు మూడుమాసముల కాలములో సంఘముయొక్క ఆదాయవ్యయములపట్టికను, జదివి గ్రంథాలయోద్యమమును గూర్చి మండలవాసులకు గలిగిన అభిమానమునుగూర్చియుపన్యసించిరి. పిమ్మట తాలూకాసంచారకార్యదర్శులగు పొట్నూరి స్వామిబాబు, తిత్తిబలరామయ్యగార్లు గతమూడుమాసములలో వారివారితాలూకాలలోనున్న గ్రంథాలయములను తనిఖీచేసిన కార్యనివేదికలను చదివిరి. అనంతరము యీదిగువజేర్కొనిన గ్రంథాలయకార్యదర్శులు ఆయాగ్రంథాలయముల కార్యనివేదికలను జదివిరి:—

౧ ఆంధ్రభాషాభివర్ధనీ సమాజము (బరంపురం) ౨ యువజనసమాజము బరంపురం ౩ బ్రాడ్లే పుస్తకభాండాగారము (గోపాలపురం) ౪ శ్రీరామకృష్ణ గ్రంథాలయము (ఇచ్ఛాపురం) ౫ శ్రీజగన్నాథ గ్రంథాలయము (సువాపడ) ౬ శ్రీకృష్ణదేవరాయ గ్రంథాలయము బారువ ౭ శ్రీచంద్రశేఖర గ్రంథాలయము (పలాస) ౮ కాళిదాస గ్రంథాలయము (టెక్కలి) ౯ బాలకవర్ధనీసమాజము (గోలాబంద) ౧౦ శ్రీనాగేశ్వరరాయ గ్రంథాలయము (నరసన్నపేట) ౧౧ సుజనానుమోదినీ పుస్తకభాండాగారము హీరమండలము ౧౨ లక్ష్మీవిలాస పుస్తకభాండాగారము (లక్ష్మీనరుసుపేట). కార్యనిర్వాహకసభ్యులలో యీదిగువసభ్యులువిచ్చేసిరి:- వరహాగిరి వెంకటజోగయ్యాపంతులు (బరంపురం) నేమాని వెంకటనరసింహంశాస్త్రి పోతాప్రగడ సింహాచలం పంతులు పుల్లెల వెంకటరమణయ్యాపంతులు తిత్తి బలరామయ్య పొట్నూరి స్వామిబాబుగార్లు.

అనంతరము ఈదిగువతీర్మానములు జరుపబడినవి.

౧ గంజాంమండలములోనున్న గ్రంథాలయసభ్యులందరకు ప్రతిసంవత్సరము బహుమతి పరీక్షలనుజరిపి అందు మొదటి తరగతిలో కృతార్థులయిన ప్రతిగ్రంథాలయసభ్యునకు గ్రంథాలయమహాసభలో బహుమతి గ్రంథములను ఆయాగ్రంథాలయములవారిచ్చుటకు ఈ సభవారు తీర్మానించుచున్నారు. ఈపరీక్షలను యేర్పరచి పరీక్షపత్రములను సరిచూచి బహుమతుల నిర్ణయించుటకు వరహాగిరి వేంకటజోగయ్యా పంతులుగారు. ౨ నేమాని వేంకటనరసింహశాస్త్రిగారు ౩ ఉన్నం వేంకటవరహాబుచ్చిరామలింగంగారు ౪ పోతాప్రగడ సింహాచలం పంతులుగారును ఉపసంఘములుగ నేర్పడుటకు యీసభవారు వారలను కోరుచున్నారు.

ప్రథమగంజాంమండల ఆంధ్రగ్రంథాలయమహాసభను జరుపుటకు యీసభవారు తీర్మానించుచున్నారు. ఈ సభ సోంపేటలో జరుగనియెడల టంకాలసాంబమూర్తి గారి ఆహ్వానము నంగీకరించి టెక్కలిలో జరుపుటకు నిశ్చయించడమైనది.

౩ గంజాంమండలగ్రంథాలయసంఘమునకు అయిన అప్పు రు ౧-౪-౬ లు శ్రీనాగేశ్వరరాయ గ్రంథాలయసభ్యులొసగినందులకు ఆగ్రంథాలయమువారికి యీసభవారు కృతజ్ఞతను తెలియజేయుచున్నారు.

—తిత్తి బలరామయ్య,
సంచార కార్యదర్శి.

---

మనుజుని జీవితములో నెప్పుడును మంచిగాని, చెడుగుగాని ప్రవేశించునపుడు ముందుగనే యోచనామార్గములు సిద్ధపడియుండును. ఎవ్వానికి సందిచ్చిన నవి చొరబారును. ప్రవేశించినతరువాత వానినిదొలగించుట దుర్ఘటము. ప్రవేశింపకమునుపే మేలుకొనెడవారు తత్వజ్ఞులు.

—ప్రేమలత.

# గ్రంథ విమర్శనము

## ౧ విజయవిజయము

కర్ణవిక్రమమను నామాంతరముగల యీ నాటకము బరంపురమునందలి భాగవతుల నృసింహశర్మగారు రచించిరి. నామమే కర్ణార్జునుల యుద్ధమందలి కథయని చాటుచున్నది. ఛత్రపురాంధ్రభాషాభివర్ధనీ సమాజమువారిచే బహుమానితమైనది. వారిప్రేరణచేతనే శ్రీ మండపాక పార్వతీశ్వరశాస్త్రిగారు విపులముగా దీనిని విమర్శించిరి. ఆవిమర్శనమును గ్రంథము మొదటఁ గలదు. కావున మేమిందు విశేషించి వ్రాయవలసినదేమియు లేదు.

గ్రంథమంతయు సలక్షణభాషతో నిర్వహించిన గ్రంథకర్తగారొకచోటమాత్ర మిరువురు బ్రాహ్మణులకు గ్రామ్యభాషను వాడుటకేమి కారణమో యెఱుఁగము. దుర్యోధనాదుల సేవకులుగూడఁ దెలుగు చక్కఁగ మాట్లాడఁగలరఁట; ఇఁక నాబ్రాహ్మణులకు మాత్రమా గ్రామ్యభాషము? గ్రామ్యభాషాప్రయోగమాత్రమున పాత్రవ్యక్తి చక్కఁగా నగునని తెల్లచోట్లఁ దలఁచుట యన్యాయము. మఱియు భాషాస్వరూపమునకును పాత్రవ్యక్తికిని సంబంధము చాలఁ దక్కువయని మాయభిప్రాయము. సమకాలికసంఘమునుండి పాత్రముల నేర్పఱిచి వ్రాయునప్పుడు భాషాస్వరూపమేమైనఁ బనికివచ్చిన వచ్చునేమోకాని కొన్నాళ్లు గడచిన వెనుక నాగ్రామ్యభాషయు గ్రాంథికభాషగా నేమాఱునుగాన, నట్టిభాషకు స్వరూపము చేమాత్రమే పాత్రముల వ్యక్తీకరించుసామర్థ్యము నశించును. ప్రాచీనులీయూశచేతనే నాటకములనీచపాత్రములకు ప్రాకృతభాషను వాడిరి కాని, నేఁడాభాషకును సంస్కృతభాషకును మనదృష్టిచే నే భేదమును లేదనుట సర్వవిదితము. పాత్రోచితభాష పాత్రోచితభాషయని వగచువారాభాషయందలి పాత్రోచితత్వము తాత్కాలికమేకాని చిరకాలస్థాయి గాదనుట యోజింపరు. పాత్రస్వరూపమును శాశ్వతముగాఁ జిత్రించుసామర్థ్యము భాషమునకుఁగలదేకాని భాషాస్వరూపమునకు లేదు. మఱియు దుర్యోధనునికాలపు బ్రాహ్మణుల నోట నేటిగోదావరి తెలుఁగు పలికించినందున వారు నాఁటివారు గాక నేఁటివారుగాఁ జనువరులకుఁదోఁచిరి. ఇఁకదుర్యోధనాదులు తెలుఁగుమాటలాడినప్పుడు నేఁటివారుగాఁదోఁపరాయని యనుగుదురేని, వారాడు తెనుఁగు భాషలో నేఁటితనము లేదు; గ్రాంథికమైన తెనుఁగున నునకు భాషము ప్రధానముగాని భాషాస్వరూపముగాదు. మనపాలిటి కా స్వరూపము నశించినది.

ఈనాటకమున సొగసైన పద్యము లనేకములు గలవు. శైలి నిరర్గళము. యతిప్రాసల తొడరులేవు. చూడుఁడు:—

> "చ॥ పసిగడిపొమ్ము బెండువడి, పౌరుషముండిన
> లాభమున్నె? ఛీ! సుయోధను నీవు చాలుదువె? [illegible]దులు
> మెండుగఁగూలిరా [illegible] శ్రీ! బరములఁద్రుంచి తృప్తిఁగన
> వచ్చునె, ప్రాణములెవ్వఁ [illegible]! సుగణముసంస్థిం
> చు, నభిమానము [illegible] బనియేమి భీరువ.?"

[బరంపురమునందలి గ్రంథకర్తగారియొద్ద పదియణాల వెలకుఁ బడయనగును].

రా॥ అ॥ కృ॥

## ౨. ప్రియదర్శిక.

చంద్రకాంత, జపానీయము మున్నగు గ్రంథముల రచించిన శ్రీరామ వీరబ్రహ్మముగారిచే నిది రచింపఁబడినది. మహాకవి శ్రీహర్షుని ప్రియదర్శికా నాటికననుసరించి, పూర్వోత్తర సందర్భములను జక్కఁబఱిచి, కల్పింపఁబడిన యాఖ్యాయిక. ఉపోద్ఘాతమునందలి పద్యములు గ్రంథకర్తగారి ప్రాచీనకవితాశైలిని జూపఁగలవు. వర్ణనలు, పాత్రపోషణము మున్నగునవి చక్కఁగా నిర్వ

హింపఁబడినవి. శైలి మృదువై, ధారాళముగనుండును. కాని సంస్కృతపదములనేకములు యోజింపక ప్రయోగింపఁబడినవి. మొత్తముమీఁదఁజూడఁగా, నీకావ్యము తనగుణములచేతమాత్రముగాక, తనమూలమునవచ్చు నాదాయమందలి కొంతభాగము రాజమహేంద్రపురమునందలి దేశీయవిద్యాలయమున కీయఁబడవలయునని సంకల్పింపఁబడి యుండుటచేఁగూడ నాంధ్రుల మన్ననకుఁ బాత్రమనిచెప్పవచ్చును.

[మచిలీపట్టణమున నోబిలుకశాకాలలో నాంధ్రపండితులకు గ్రంథకర్తగారినుండి పంద్రెండణాల వెలకుఁ బడయనగును]. రా. అ.

### ౩ జ్ఞానార్జనము

ఇది 'సత్యార్థప్రదీపికాగ్రంథమాల' లో తృతీయగుచ్ఛము. పుటలు క్రౌనుసైజున ౨౦. కృతికర్త శ్రీయుత కారుపల్లి శివరామదాసుగారు, బెంగుళూరు.

విషయము:—అవివేకులను గూర్చియు, వివేకులను గూర్చియు, భక్తినిగూర్చియు, తెలుపనైనది.

భాష:—సులభము కావున అందరికిని బోధపడును. అచ్చుతప్పులు మొదలగు లోపములు కొన్నికలవు. అవి కృతికర్తగారు రెండవకూర్పున లేకుండ చేసెదరుగాక!

ఉపసంహారము:—గ్రంథము చిన్నదైనను నీతిబోధకము. కాన, మంచిదారిపట్టి బాగుపడఁదలఁచువారందరును తప్పక చదువఁదగినది. మా. రా.

### ౪ "జీవకారుణ్యము"

ఇది సత్యార్థప్రదీపికా గ్రంథమాలలో ౫వ గుచ్ఛము. గ్రంథకర్త కారుపల్లి శివరామదాసుగారు, బెంగుళూరు. పుటలు క్రౌనుసైజున ౧౪౦. వి. పి. చార్జీతో వెల రు 0-8-0.

విషయము:—పేరునుబట్టి గ్రంథము అహింసను గూర్చిమాత్రము తెలుపునదని స్ఫురించును. కాని, ఆ పరమధర్మమును గూర్చియేకాక, మద్యపానమునుగూర్చి చాలకఱకును మఱికొన్ని విషయములనుగూర్చి కొంత కలుకునుకూడ ఇందు కలదు. మద్యమాంసములు వాడుక చేయుట తగదని బోధింప వ్రాసినదగుటచే ఇది మంచి నీతిబోధకమగు గ్రంథము. 'భూతదయ' కు పర్యాయపదముగా 'జీవకారుణ్యము' అని కృతికర్తగారు వాడినారు; ఇది వారిదేశమున హెచ్చుగా వాడుకలో నుండనోపును. ఈగ్రంథము ౫ భాగములు; భాగమునకు 'లహరి' అని పేరు.

గ్రంథారంభమునకు ముందు ౧ గోహత్యవలని కష్టనష్టములు ౨ కారుణ్యగీతము ౩ అహింసార్ణవము ౪ ఈశ్వరపూజ ౫ అవతారిక ౬ భరతమాతృవిలాపము అను విషయములు కలవు. వీనిలో ౧, ౨, ౩, ౬ అహింసనుగూర్చియు, ౪, ౫ అహింసామద్యపానాదులను గూర్చియు తెలుపును. 'భూతదయకు మించిన పుణ్యము లేదనుచుఁ బల్కిరి జ్ఞానులు' అనుదానికంటె కారుణ్యగీతమునకు తగిన పల్లవి ఏది? 'అహింసార్ణవము' అను గ్రంథము కృతికర్తగారి సహధర్మచారిణి శ్రీమతి రామాంబగారు వ్రాసినది; దానిలోని 'ఆత్మబోధాష్టకము' అను భాగమే ఇందుకలదు

'జంతువులను హింసింపకు
మెంతయు; నీచేతఁగాదు హింసించిన యా
జంతువుల ప్రాణమొసఁగను;
సంతతము నహింసనిష్ఠ సలుపుము మనసా.'

అను పద్యము ఆమె దయార్ద్రహృదయమును వెల్లడించుచున్నది.

అహింస, ఇంద్రియనిగ్రహము, భూతదయ, క్షమ, శాంతి, తపస్సు, ధ్యానము, సత్యము- అను పుష్పములతోడనే పరాత్పరుని పూజింపవలెనని ఈశ్వరపూజయందు తెలుపనైనది.

'అస్మద్దేశీయులగు కరుణామూర్తులారా! ఈశాస్త్రమునందలి యభిప్రాయములను మీరు సాధ్యమగునంతవరకు మద్యమాంససేవకులకు బోధించి వారిని ఆ దురాచార పిశాచఘాతనుండి తొలఁగించి భరతమాతకు మరలఁ బూర్వకాలపు ఔన్నత్యమును కలుగఁజేయుడు.' అనునది అవతారికాసారము.

ఆవుగాని గేదెగాని ౪౭౫౯౬౦౦ మందిని, మేకగాని గొఱ్ఱెగాని ౨౫౯౨౦ మందిని ఒక్కసారి ఆహారమిచ్చి తృప్తిపఱుపఁగలవిగాన వానిని హింసించుట అంతమందిని హింసించుటే అని గోహత్యవలని కష్టనష్టములు అను విషయమున సూచింపనైనది. 'ఫలముల సస్యాదుల నిల। నెలమిం దిని కాదె మాంసమెంతయు నెనయుక్। పలుతెఱఁగులఁ బ్రాణుల మెయిఁ। జలమునఁగవుచుకయి ప్రాణిఁజంపఁగనేలా॥

అను భరతమాతృవిలాపములోని పద్యార్థమునందలి సత్యముపరికించినచో ఎవరుగాని హింసచేయఁగలుగుట ఎట్లు ? గోహత్య చేయుటచూచి, భరతమాత తల విరియఁబోసికొని, ఎడమ చేతితో పండ్లపళ్లెరము పట్టుకొని, పైఁటచెఱగుతో కుడిచేత కన్నీరద్దుకొనుచు నిలఁబడి ఏడ్చుచున్నట్లు కనఁబఱచు పటము చూచినగుండెల కటికవాని గుండె అయిన కరఁగదా ?

ప్రథమలహరి:— దీనియందు ౧ పూర్వాచారము ౨ మృతపదార్థములు 3 అమృతపదార్థములు ౪ జంతువుల స్వాభావికాహారము అనువిషయములు అహింసను గూర్చియు, ౫ నిషిద్ధపదార్థములు అనువిషయముమద్యపానాదులగూర్చియు, ౬ ఆర్యానార్యవిచారము ౭ మృతామృత పదార్థవివేచనము అనువిషయములు అహింసామద్యపానాదులనుగూర్చియు తెలుపును.

'ఆర్యులు అహింసావ్రత పరాయణులు' 'పితృపితామహప్రపితామహులలో సత్పురుషులైన వారనుసరించిన మార్గమునుమాత్రమే మనమనుసరింపవలెను.' "విపరీతంతువర్జయేత్" అనుటచే సదాచారుల మతమునకు విరుద్ధమైన వేవైన పితృపితామహాదులయందు కలిగినచో వానిని విడనాడవలెను.' 'గొప్పబిరుదులున్నంతనే అట్టివారుచేయుపనులన్నియు మంచివనితలంపరాదు.' 'మానవులు అమృతపదార్థములనే (పండ్లుధాన్యములు మొదలగువానినే) సేవింపవలెను' అనునవి దీనిలోని సారాంశములు.

అభ్యాసబలమును తెలుపుటకు సువర్ణలేఖనుండి తీసికొన్న చేఁపలదానికథయు, 'భట్టరాచార్యులజట్టులు' అను వేణుగోపాలశతకములోనిపద్యమును ఆయాసందర్భములను ఎంతయు తగియున్నవి.

ద్వితీయలహరి:— ఇందుని శతబోధ మొదలగు ౯ విషయములున్నవి. అహింసనుగూర్చినవి 3; మద్యపానమునుగూర్చినది ౧; రెండింటినిగూర్చినవి ౪.

'పరహింసాది దుష్కార్యరతులే రాక్షసులు. అహింసావ్రతపరాయణులే దేవతలు'. కానమద్యమాంస సేవకూడదనునదే హితబోధ. 'మద్యపానము చేయువానికి సత్యమెక్కడిది? మాంసభోజనము చేయువానికి దయయెక్కడిది?' అనునది దీనిసారాంశము

మద్యపానము చేయువారికి జ్ఞానముండునా?— అను ప్రశ్నకు 'నవేత్తిమద్యపానతః స్మరేణవివ్యాలీకృతః। స్వమాతరం స్వగోపితా సమానమేవ మన్యతే । వివేకబుద్ధిహీనతః కరోతిదే నాంవధం । తతోవివేకిభిర్జనైః సురానిషేధ్య లేసదా 'అను మాణిక్యమాలలోని శ్లోకతాత్పర్యము తెలుపుటకంటె వేఱొక్కసమాధానమేమి కలదు?

'అమ్మవాళ్లు— వారిపూజ— అనువిషయమున అమ్మవాళ్లజాబితా కలదు. నేగమ్మవారి పేరుకూడ కుదరక చేరినది.

'ఆవేశములు'— ఇందు ఆవేశవృత్తాంతము గాక, కృతికర్తగారు స్వయముగా కనిపిలిన ఆవేశవైభవమునుగూర్చి వ్రాసినముచ్చట కడుముచ్చటగా నున్నది. 'మనదేశము వారికీతి మాహాత్మ్యదేవతలు లోఁబడియున్నారు. అకటా!! రాళ్లో, బొమ్మలో, ఏదేవతలో, ఏమైనఁగాని పూజించుటవలన హానిలేదుగాని, జీవహింసాదురాచారమువలన మిక్కిలిహానికలుగుచున్నది.' అనునది దీనిసారాంశము.

'మాంసభక్షణమేజాతివారికైన విధింపఁబడినదా?' అనుప్రశ్నకు 'మానవజాతికి ఆహారముగా భగవంతుఁడు శాక, ధాన్య, ఫలాదులను నిర్మించియున్నాఁడు. కాన మాంసాహారము మానవజాతికి విధించలేదు. మానవజాతికే విధింపఁబడక పోఁగా నిఁకకొందఱు(శూద్రాదులు) తినవచ్చుననియు, కొందఱుతినరాదనియు చెప్పుట మిక్కిలివింతగానున్నది' అనుసమాధానము మిక్కిలి చక్కఁగానున్నది. మనుష్యజాతిఅంతయు ఒక్కటే కాని ఉత్తమజాతి అనుకొనుట సరికాదనుటకూడ ఎవరుగాని ఒప్పిదముగా నున్నదనక తప్పదు.

'వర్ణాశ్రమాచారవిధి'లో జీవహింసాదిదురాచారములు అంత్యజులగు మాలమాదిగలకుఁగూడ కులాగతములైన వృత్తులలోనెల్ల మిక్కిలినింద్యములైనవని యు, మాలమాదిగలుగూడ వానినివిడనాడవలెననియు' విధించిన నారిదోపదేశమును, అహింస మొదలగునవి నాలుగువర్ణముల వారికిని సమానములని నిర్ణయించిన 'మను' వాక్యమును విశదపఱుపనైనవి.

'మద్యమాంససేవలు మొదటలేనిది మధ్యకాలమందెట్లు కలిగెను?' అను సవాలుకు 'వ్యభిచారము, దొంగతనము మొదలగు దురాచారములెట్లు మనుజులయందలవాటుపడెనో ఇదియునట్లే కలిగినది' అనునది తగిన జవాబు కాదా?

'మృగాదులు మాంసభక్షణముచేయుచుండఁగా మనుజులేలచేయరాదు?' అనుప్రశ్నకు 'మృగాదులకు వివేకములేదు. అవిఘాతుకజంతువులు. కావున జీవహింస సలుపుచున్నవి ...... ఆవు మొదలగునవి సాధుజంతువులు. ఇవిజీవహింసచేయవు. మాంసము ముట్టవు... ...... ఇటులమృగములయందే ఎంతోకట్టుదిట్టములున్నవనఁగా వివేకముగల మానవజాతిమాత్ర మస్వాభావికమగు మాంసభోజనముఁ గోరవచ్చునా?' అను ఎదురుప్రశ్నయేగట్టిజవాబు. అదిచాలనివారికి 'తరవోపిహిజీవంతి జీవంతిమృగపక్షిణః। సజీవతి మనోయస్య మననేనోపజీవతి.' అనుమహోపనిషత్తునుండి తీసికొనిన శ్లోకము చెంపపెట్టు. అదియును చాలనివారికి,

'మృగముకన్న చెడుగుమూర్ఖుఁడౌను'
అనువేమనగారి వాక్యము వాకట్టు.

తృతీయలవారి:— ఇందు 'జీవహింసమిక్కిలి పాపకరము' మొదలగు అహింసనుగూర్చి తెలుపు ౧౦ విషయములుకలవు. మొదటివిషయమున ఉదహరించిన,

'ప్రాణుల రాతనుంగలదె మాంసముప్రాణులమేసఁగాక యమ్మేనుల నొంచునప్పు దనుమేనులు సోకినమాత్రమెట్లగుఁజో? దానిదలంపఁగావలదె? తానదిమానినహింసలన్నియుఁజో మానవె యంచును త్తముఁడు మాంసము మాను దయార్ద్రచిత్తుడై' అనుఆంధ్రమహాభారతానుశాసనికపద్యభావము మాంసభక్షకులు మనస్సున మననముచేసికొనినచో ఎంతోమేలు కలుగునుగదా!

'జన్మాంతరవిచారము'న కర్మసిద్ధాంతము తేటపరుపనైనది.

'మాంసము దేహపుష్టినిగలిగించునా?' అనుప్రశ్నకు 'అభినవభీమసేనుఁడను గొప్పబిరుదందిన జగజెట్టి శ్రీయుత కోడి రామమూర్తినాయుఁడుగారు శుద్ధశాకాహారి' అనునది తగినసమాధానము.

'అహింసనుగురించిన పశ్చిమదేశీయుల యభిప్రాయములు' అనువిషయములో 'ఒకరు నన్నుకోసి మాంసముగాసమ్మటకు నేనెట్లొప్పుకొననో అదేవిధముగ జంతువులనుగోసి తినుటకియి అంగీకరింపను' అను'హావెల్సు'మొదలగువారి అభిప్రాయములు అనుభవములోనికి తేఁదగినవి.

'మాంసాహారశాకాహారములందుఁగల బలాబలములను దెలిపెడిపట్టిక' చూచినవారికి మాంసముతినుటవల్లనే హెచ్చుబలముకలుగునను భ్రమవదలిపోవును. కూరలకంటె మాంసపువెల హెచ్చగుట అందరికిని తెలిసినదే.

'మాంసాహారనిషేధక లోకానుభవ సంగ్రహము' లోని శాకాహారవిశేషము తెలిసికొనుట మాంసభక్షకులకు మిక్కిలిశ్రేయస్కరము.

'మాంసభక్షణముచేయనగునా? అనుప్రశ్నకు 'రాబర్టుబేర్. ఎమ్. డీ., గారు విరుద్ధముగా ఇచ్చిన సమాధానము మాంసముతినువారును - తినఁదలఁచువారునుగూడ చదివినయెడల ఎన్నోజంతువులకు బలవంతపుచావు తప్పును. అందువల్ల పాడిపంటలు హెచ్చును; బీదలు తిండిలేక మలమలమాడి బక్కచిక్కవలసిన దురవస్థ దూరమగును; జబ్బులపాలై బాధపడవలసిన దుస్థితి చాలవఱకు తొలఁగును. ఇదిఅవసరముకాదా?, 'గోమహిమ' లోని పద్యములు కంఠపాఠముచేయఁదగినవి.

'గోవులు:—ఆధునికాభిమతము' లోని 'జన్నావాలా' గారి యుపన్యాససారాంశము మనదేశస్థులందఱును చదివితీరవలె.

'భవిష్యత్కాలభోజనము' లో మాంసాహారము మానిమనుష్యులందఱును ఫలాహారమే ముఖ్యముగా చేసికొందురను 'సర్ బెంజిమన్ రిచర్డ్సన్' గారు సూచించిన సూచన సర్వేశ్వరానుగ్రహమున క్రియారూపమున త్వరలో

పరిణమించుఁ గాక!

చతుర్థలహరి:— ఇందు మద్యమాంస నిషేధసంగ్రహము కానవచ్చును.

మన శ్రుతులయందేమి, స్మృతులయందేమి, పురాణములయందేమి, తక్కిన గ్రంథములందేమి హింస చేయరాదనియే స్పష్టముగా కానవచ్చును. మహమ్మదీయ గ్రంథములందును, బైబిలునందునుకూడ మాంసాహారమును నిషేధించు భాగములు కనఁబడుచున్నవి. మద్యపానమును కూడదనియే అన్నిగ్రంథములును చాటుచున్నవి; కాన మద్యమాంసఖండనవాక్యములు నడుమ చేర్చినవని కృతికర్తగారు సమర్థించినారు. ఒకవేళ మద్యమాంససేవ తొలుత ఉండినను తరువాత నిషిద్ధమగుటచేతను, పాశ్చాత్యపండితులును ఇప్పుడది నిషిద్ధమని తేల్చుటచేతను ఆచర్చతో అవసరమేలేదు. మద్యమాంసములు హెచ్చుగా వాడుకలో ఉన్న పశ్చిమదేశములలో వానిని నిషేధించు సంఘములు బయలుదేఱినవనియు, అందలి పండితులు మనుష్యులకు సహజమగునది పుష్టి కలిగింపని శాకాద్యాహారమే అని నిశ్చయించినారనియు తెలుపుభాగము చదువుచో మద్యమాంససేవచేయువారిలో మూర్ఖులును, ఇంద్రియ నిగ్రహశక్తి లేనివారును తప్ప బుద్ధిమంతులగువారు ఆది విడువక మానరు.

పంచమలహరి:— ఇందు పశుయజ్ఞములు తగనివనియు, వానిఫలము తుచ్ఛమనియు తెలుపనైనది. వేశ్యలవల్లను, వామాచారమువల్లను మద్యపానము మొదలగు దురాచారములు బయలుదేఱినట్లు విశదపఱుపనైనది. ౧౧౬ పుటలో, ౨-౩ పంక్తులలోని విషయము మఱొకవిధముగా దెలుపుటబాగు. వల్లభాచార్యసంప్రదాయము, రామానుజకూటములు, శరణాగతివైభవము- వీనిలోపములు బట్టబయలు చేయనైనవి. మద్యపాననివారణోపాయములు సూచింపనయ్యె. పొగచుట్టలు, సిగరెట్లు, బీడీలు మొదలగునవి కాల్చుట వలన కలుగు నష్టములు స్పష్టపఱచిరి. జన్మాంతర విచారము కొంతచేసి,

గీ. దంతియడుఁగులోనఁ దక్కిన జంతు చ
యంబు లడఁగునట్లెల్ల నడఁగియుండు
నట్లు ధర్మకోటులన్నియు లోనగు
నిద్ధగుణయహింస కింతనిజము॥

అను భారత పద్యరత్నముతో విరమించి, స్వస్తివచించి, గోవధమొదలగు హింసాకర్మములుమాన్ప శ్రీవేణుగోపాల దండకరూపమున స్తుతించి, శాంతితో ఈలహరి ముగియును.

విజ్ఞప్తిలో సకలజనాభివర్ధనీ సనాతనధర్మబోధినీ సభాసదుల యుపదేశము నంగీకరించి మాంసాహారమును విడనాడినవారి జాబితాకలదు. ఉపదేశముచేసినవారును, దాని ననుసరించి నడుచుకొనినవారునుకూడ ఎంతయు శ్లాఘాపాత్రులు.

## భాష

వాడుకలోని పదములే ఎక్కువగా ఉపయోగించుటచేత భాష చాలవఱకు విషయమునకు అనుకూలముగా ఉన్నది.

'ఇందలి విషయములు, జనసామాన్యమున కంతకును తేటతెల్లంబై యుండవలెనను నూహతో సందర్భోచితముగ కొన్నిచోట్లయందు సంధులను సధించలేదు.' అని అవతారికలో కృతికర్తగారు తెలిపినారు. ఇందలి 'ఊహ' యేవారికి గ్రంథములురచించుటకు అర్హతఇచ్చుచున్నది. ఇట్టి ఊహలేనివారు జనసామాన్యమునుగూర్చి పుస్తకములు వ్రాయ నర్హులుకారు. సందర్భోచితముగ సంధులు చేయకుండుట అనఁగా భాషను సహజరూపమున వెలయించుటే. ఇది చేయవలసినపనికాని చేయరానిపనికాదు. ఇఁకముందు, సందర్భోచితముగ అన్నిచోట్లను కృతికర్తగారు సంధులు చేయకుందురుగాక! వికృతరూపము వదలి మనభాష వారి గ్రంథములందు సహజమగు సొగసుతో కనఁబడి కన్నులవిందును, వీనులవిందును చేయుఁగాక!

తెలుఁగు గ్రంథములందు ఇంగ్లీషువాక్యములు వాడకుండుట మేలు; ఇంగ్లీషుచదువుకొనిన మనవారికి కొందఱికి అవి రుచించునని కృతికర్తలు కొందఱు వాడుచున్నారు. కాని, ఈదురాచారము తొలఁగించుట భాషాభిమానులకు కర్తవ్యము. తప్పనిసరిగా కావలసినవని

ట్టినవి అనుబంధముగా చేర్పనగును.

పనికిమాలిన పద్యములు వదలుట బాగు.

అచ్చుతప్పులను గూర్చియు, అసున్న బండి రాలను గూర్చియు మతికొంత శ్రద్ధపట్టినచో బాగుగా ఉండెడిది.

ఉపసంహారము

గ్రంథములు రచించు సామర్థ్యము పరాత్పరుఁడిచ్చినందులకు సరిగా అది ఉపయోగించి, ఎన్నో రావి, ఎంతో కృషిచేసి, తన దయార్ద్రహృదయమును వెల్లడి చేయుచు 'జీవకారుణ్యము' వ్రాసిన శ్రీయుత కారుపల్లి శివరామదాసుగారు సార్థకజన్ములు. పరాత్పరుఁడు చిరాయువొసఁగి తనభక్తులలో ఒకరగు ఆయనచే ఇట్టి మంచి గ్రంథములు వ్రాయించి, ధర్మబోధచేయించి, లోకమునకు మేలొనర్చునటుల చేయుగాక! మా. రా.

౮. స్మరణామృతము.

ఇది 'ఆనందమందిర గ్రంథమాల' లో ప్రథమకుసుమము. క్రౌను సైజు పుటలు ౮౨. వెల 0-4-0. కృతికర్త శ్రీయుత కారుపల్లి శివరామదాసుగారు, సంగుడూరు.

విషయము:— భాగములు ౫. 'అనుభవము' అని భాగమునకు పేరు. ప్రథమానుభవమున అక్షరమాలిక, ద్వితీయానుభవమున ప్రార్థనావలహరి, తృతీయానుభవమున స్తోత్రసంగ్రహము, చతుర్థానుభవమున బ్రహ్మసంకీర్తనము, పంచమానుభవమున మానసపూజ-అనువిషయములుకలవు. అక్షరమాలికకు 'భక్తపాలకా' అనునది మకుటము. వృత్తములు చంపకోత్పలములు. శైలి ఈక్రిందిపద్యమునుబట్టి తెలిసికొనవచ్చును.

"టంకులమాటలెందుకు? దిటంబగు నీపద సేవయొక్క-

టే కింకర ముఖ్యధర్మమని ఖేచరముఖ్యులు సిద్ధసాధ్యులున్ శంకలుమాని నీకును వశంకరులై భవదూరులైరి; ని

శ్శంకగ నిన్ను నమ్మెనెడ సంకటముండునె? భక్త

పాలకా."

ప్రార్థనావలహరియందు గద్యపద్యములుకలవు. స్తోత్రసంగ్రహమున శ్లోకములుకొన్ని తాత్పర్యముతోడను, కొన్ని తెలుఁగుపద్యములతోడను సొంపుమీరుచుండును. బ్రహ్మసంకీర్తనము పాటలతో వాటమగుచుండును. మానసపూజయందు తద్విధానము విస్పష్టముగా వివరింపనైనది.

భావ: ముత్తముమీఁద సులభమని చెప్పటకు వీలులేకున్నను అంతకఠినమునుకాదు. అచ్చుతప్పులుదిద్ది శుద్ధపత్రిక చేర్చిరి. రెండవకూర్పున గ్రంథమే శుద్ధముగా ఉండునట్లు కృతికర్తగారు ప్రయత్నింతురుగాక!

ఉపసంహారము:—సంసారబాధల వలన మనస్సుకలఁతచెందకుండ బ్రహ్మానందమున తేలుచుండునటులచేయుటకు మిక్కిలిసాయపడును గాన, భక్తులందఱును స్మరణామృతము సేవించి, సర్వదా సంతోషమున ఓలలాడుచుందురుగాక! భక్తులకు సహకారిగా ఇట్టిగ్రంథము వ్రాసిన కృతికర్తగారికి సర్వేశ్వరుఁడు సదాసంతసమొసంగుగాక! మా. రా.

౯. గోఖలేపరమహంస.

ఇది మన ఉత్తరదేశభక్తులలో ఒకరగు కీర్తిశేషులయిన గోపాలకృష్ణ గోఖలేగారి జీవితచారిత్రము; ఆనందమందిర గ్రంథమాలలో ద్వితీయకుసుమము పుటలు క్రౌను సైజున ౬౮. వెల ౦-౬-౦.

విషయము:— ప్రథమదశ, ద్వితీయదశ, తృతీయదశ, చతుర్థదశ-అని గ్రంథము నాలుగుభాగములు. మొదటిభాగములో బాల్యము, విద్యాభ్యాసంగము, ఉపాధ్యాయత్వము, రెండవదానిలో గృహస్థాశ్రమస్వీకారము, పత్రికాలేఖత్వము, రాజకీయప్రవేశము, దేశసేవాపరత్వము-మూడవదానిలో భార్యావియోగము, దేశాంతరవాస సంచారము, ధర్మప్రసంగము, రాజకీయధర్మాచరణము-నాల్గవదానిలో చరమోపదేశము, అవతారసమాప్తము, గుణధర్మవర్ణనాదులు, స్వస్తిసంగ్రహము—అనువిషయములు కలవు. ఇందు, ఆమహాత్ముని మేధాశక్తి, ఆవార్యధైర్యము, ప్రతివాదిశ్లాఘ్యవక్తృత్వము, అసమానదేశసేవాపరాయణత్వము, సంస్తవనీయస్వార్థత్యాగము మొదలగు సద్గుణములు చక్కఁగా విశదపఱుపనైనవి.

భావ:— శైలికొంచెము కఠినము. అచ్చుతప్పులు మొదలగు లోపములు చాలతక్కువ. ఉన్నవి రెండవకూర్పున సవరింపఁదగును.

ఉపసంహారము:— ఇది దేశాభిమానుల కంఠభూషణము పారాయణగ్రంథముగా ఉండఁదగినది. ఇట్టిగ్రంథములు విద్యార్థులకు పఠనీయములుగా ఉండు భాగ్యము మనదేశమునకెప్పుడు పట్టునో తెలియదు. మా. రా.

# విజ్ఞప్తి.

ఈ సంచికతో, గ్రంథాలయసర్వస్వముయొక్క మూడవసంపుటము ప్రారంభమైనది. అనివార్యములగు యిబ్బందులవలన రెండవసంపుటమునందు, భాగములను సకాలమునకు ప్రకటింపజాలమైతిమి. మూడవసంపుటమునందైన సకాలమున ప్రకటించుటకు తగినశక్తినొసంగుమని భగవంతుని ప్రార్థించుచున్నారము.

౧౯౧౨ సం॥ జనవరి నెలలో బరోడాయందు చేయబడిన ప్రదర్శనమునందు ప్రదర్శింపబడిన "గ్రంథాలయ శాఖ" ను గూర్చి- రెండవసంపుటమునందలి రెండవ భాగమునందు "బరోడా యాత్ర"యను శీర్షిక క్రింద వ్రాసియుంటిమి. ఆగ్రంథాలయప్రదర్శనమునకు సంబంధించిన కొన్ని పటములను ఈ గ్రంథమునందు ప్రకటించితిమి.

కడచినసంవత్సరము "బారువ" యందు నాల్గవ ఆంధ్రదేశ గ్రంథాలయ ప్రతినిధులమహాసభ అతివైభవముగ జరగినదిగదా. ఈసంవత్సర మాసభను విశాఖపట్టణమునందు చేయుటకు ఆహ్వానింపబడినసంగతి చదువరులందరకును తెలిసినదేను. విశాఖపట్టణమునందు "ప్లేగు" వ్యాధి వ్యాపించియుండుటచేత ఆసభను "అనకాపల్లి" యందు చేయుటకు ఏర్పాటుచేసినటుల తెలియవచ్చుచున్నది. ఈసంవత్సరమునందీసభను దత్తమండలములందు చేసిన బాగుండునని కొందరుసూచించుచున్నారు.

కృష్ణామండల గ్రంథాలయ ప్రతినిధులమహాసభ ఈవత్సరము గంపలగూడెమునందు శ్రీ కుమారరాజావారి ఆదరణవలన జయప్రదముగ జరిగినదికదా! ఆసభకు వచ్చిన ప్రతినిధులందరును కృష్ణామండలమునందు గ్రంథాలయోద్యమవిషయమై పనిచేయుటకు ప్రత్యేక మొక కార్యదర్శి అత్యంతావశ్యకమని అభిప్రాయపడిరి అభిప్రాయపడుటతోడనే సరిపోలేదు కార్యదర్శికి ఒక సంవత్సరమునకు ఎంతవ్యయము అగునో అంచనా వేయమనిరి. అంచనావేయగా సంవత్సరమునకు, కార్యదర్శి జీతము, ప్రయాణవ్యయములు మొదలగు ఖర్చులన్నిటికిని గలిపి రు ౫౦౦ లు కావలయునని తేలినది. ఇరువది గ్రామములవారు గ్రామమునకు ఇరువదియైదురూపాయిల చొప్పున ఇచ్చిన ఈపని సుకరముగ నెరవేరగలదని సూచించిరి. వెంటనే, గుడివాడతాలూకా దొండపాడు శ్రీ రామచంద్రపుస్తకభాండాగార ప్రతినిధిగారగు శ్రీ గుత్తా వీరయ్యగారు తాము తమగ్రంథాలయసభ్యులను గలసి ఇరువదియైదురూపాయిలను వసూలుచేసి ఇచ్చెదమనిరి. అంతట కవుతరమునకు చెరుకువాడ వేంకట నరసింహముగారును, గంపలగూడెమునకు శ్రీకృష్ణరాయ గ్రంథాలయకార్యదర్శిగారును, బెజవాడకు అయ్యదేవర కాళేశ్వరరావుగారును, తిరువూరునకు ౧ దారా వెంకట నారాయణగారును, ౨ చెరుకుపల్లి యజ్ఞనారాయణగారును, ౩ శంకర వేంకటరామయ్యగారును; తేలప్రోలునకు ౧ జొన్నల సుబ్బారెడ్డిగారును, ౨ బొడ్డపాట పూర్ణయ్యశర్మగారును, ౩ గుడిపాటి విశ్వనాథశర్మగారును, తమతమగ్రామములనుండి ఇరువదియైదురూపాయిలవంతున వసూలుచేసి పంపెదమని బాధ్యతనువహించిరి. అనగా ఈఆరుగ్రామములనుండియు ఆరు "ఇరువదియైదులు" (రూపాయిలు) వచ్చును. ఇక పదునాలుగు ఇరువదియైదులు( రూపాయిలు) కావలెను. ఎవరిచ్చెదరు? కృష్ణాజిల్లా గ్రంథాలయోద్యమాభిలాషులారా! జవాబువ్రాయుడు!!

# శ్రీసుజనానందినీగ్రంథాలయము—రాయకుదురు

పలుతావుల గ్రంథాలయము లననేమో యెరుంగని కాలమున, గ్రామవాసుల విద్యాభివృద్ధికొరకును, లోకసమాచారములు తెలియజేయునిమిత్తమును ౧౯౦౫ సంవత్సరమున శ్రీ పెమ్మరాజు భానుమూర్తిగారు సుజనానందినీ సమాజమునకు బీజములను నాటిరి. కాని సభ్యులయందు తగిన ఉత్సాహములేక నామమాత్రావశిష్టమై యుండెను.

ఇట్లుండ ౧౯౦౫ సంవత్సరమున కీర్తిశేషులగు శ్రీ నూరంపూడి సీతారామమూర్తిగారి ప్రోత్సాహమున ౬౦ గ్రంథములతో మఱలదలయెత్తి, దినదినప్రవర్ధమానంబగుచు వచ్చినది. అప్పటిలో నాంధ్రకేసరి, కృష్ణ, దేశాభిమాని, ఆంధ్రప్రకాశిక, వందేమాతరం, నవయుగ మున్నగు ౧౫ పత్రికారాజంబులు వచ్చుచుండెడివి. సమాజము ఏటేటను వార్షికోత్సవములనేగాక తరుచు సభలనుగూడ జరుపుచు ప్రజలయం దుత్సాహము గలిగించుచుండెను.

ఇట్లు నాలుగైదువత్సరములుమాత్రమే యుచ్ఛదశకుండుండి పిమ్మట సభ్యులలోఁ గొందరనివార్యములగు హేతువులచే గ్రామము విడువవలసినవారలగుటచే ౧౯౧౦ సంవత్సరమున వీచిన పెనుగాలికి నేలఁగూలిన వృక్షరాజములతో, మా సమాజవృక్ష మొక ప్రక్కను మాత్రమే విరిగి- తగినద్రవ్యసాహాయ్యమును, సభ్యులందుత్సాహము లేక, నట్లే నిలచియుండెను.

ఇందుఁ బ్రస్తుతము ౧౭ సభ్యులుండిరి. ౨౦౦ ఆంధ్రగ్రంథములు గలవు. ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక, దేశమాత మరికొన్ని మాసపత్రికలును వచ్చుచున్నవి. ప్రస్తుత మీ గ్రంథాలయము మాగృహంబుననే యున్నది. ఇంకను సజ్జనులకు నుచితముగ పుస్తకములు చదువుకొనుటకీయబడును. గతవత్సరము గృహములకుఁ దీసికొనివెళ్ళి చదివిన గ్రంథములు 30. చందాలవలన వసూలయినవి రు ౨౬-౧౩-౦ లు. పత్రికలు పుస్తకములు మున్నగువానికైన వ్యయము రు ౨౬-౪-౭ లు. నిల్వ రు ౦-౭-౪ లు. ఈసమాజము స్థాపింపఁబడినప్పుడున్న చెంగల్వల రామమూర్తిగారు మేనేజరుగను చెంగల్వల గురురాజుగారు కార్యదర్శిగను నేఁటివరకును నిలచియుండి ఉత్సాహముగ బనిచేయుచున్నారు. కడచిన సంవత్సరోత్సవసందర్భమున దీనిపేరు సుజనానందినీ గ్రంథాలయమని మార్పబడినది

—చెంగల్వల సత్యనారాయణమూర్తి.

# గ్రంథాలయోద్యమవ్యాప్తి.

౧౯౧౪ సంవత్సరము వేసవి సెలవులందు బెజవాడలో శ్రీరామమోహనగ్రంథాలయసభ్యులు గ్రంథాలయసభను సమావేశము గావించినప్పుడు ఆసభవలన కలుగు ఫలితములనుగూర్చి పలువురు పలువిధములుగ తమతమ సందేహములను వెల్లడించిరి. కొందరు పరిహసించిరి. కాని ప్రారంభించినవారు పట్టుదలతో దైవముమీద భారమువైచి తమ సంకల్పమును నెరవేర్చుకొనిరి. అప్పటినుండియు ప్రతివత్సరమును గ్రంథాలయసభ లత్యుత్సాహముతో జరుగుచున్నవి.

ఈసభలకు వచ్చెడు ప్రతినిధులు దేశాభివృద్ధికి పాటుపడుటకై దీక్షవహించిన యువకులై యున్నారు గాని తలిమ్మాసభలకువచ్చెడు ప్రతినిధులవలె కోర్టులలో పనిచేసిచేసి సెలవులలో ఆసభలయందు తమవాక్శూరత్వమును వెల్లడిచేసి కాలముపుచ్చుచున్నవారు కారు. కనుకనే ఈసభలయందు చేయబడిన తీర్మానములు క్రమముగ వాడుకలో పెట్టబడుచున్నవి. తీర్మానముల ననుసరించి ఈ సభ ప్రతినిధులు ఆంధ్రదేశమంతయు సంచారముచేసి అనేకగ్రంథాలయములను దర్శించి తగు సలహాల నొసంగుచు పలువిధముల గ్రంథాలయోద్యమమును వ్యాపింపజేయుచున్నారు.

మనదేశమందలి గ్రంథాలయాభివృద్ధినిగూర్చి బరోడా గ్రంథాలయశాఖాధ్యక్షులు సంతోషించి ఇందునుగూర్చి విపులముగ తెలిసికొని ప్రోత్సాహించుచున్నారు. భారతవర్షమున వారితరువాత గ్రంథాలయోద్యమవిషయమైన కృషి చేయుచున్నది ఆంధ్రులొక్కరే. కనుకనే బరోడావారియుద్యమము ఇచటమాత్రమే ప్రబలుటను చూచి తగిన సలహాలనిచ్చుచున్నారు. ఈ యుద్యమమునుగూర్చి దూరముననున్న బరోడావారు అట్టిశ్రద్ధను వహించుచుండగా మనపెద్దవారు (నాయకులని పిలిపించుకొనుటకై ప్రయత్నముచేయుచున్నవారు) మాత్రము తగినంతవరకు ఆదరింపకపోవుట కడుశోచనీయముగనున్నది. గ్రంథాలయములు చక్కగ జరుపబడెనేని దేశాభివృద్ధి కవి మూలాధారము లగుననెడి యూహ వారికి కలుగలేదు. అట్టి యుద్దేశము ఎప్పుడు మన పెద్దవారికిట్టునో ఆనాడె మనదేశము బాగుపడును. మనము పైపైని పూతలు పూయుచున్నాము. గోడ ప్రాతది; పునాదిలేదు. అట్టిదానికి పేడమెత్తి వెల్లకొట్టుచున్నాము; పెద్దగాలి వీచినచో ఈపేడ, సున్నము, ఆగోడను అపజాలవు. అది కూలును. అటులఅయినది మనదేశముపని. మనదేశమునందు జీవములేదు. కృశించియున్నది. కనుక మొదటినుంచి పునాదివేయుట ప్రారంభించవలయును. అట్లుచేయక దేశీయమహాజనసభను, 30 ఏండ్లుకాదు, ౬౦ సంవత్సరములు చేయుడు. రాజధానీసభలను చేయుడు. శాసననిర్మాణసభలలో పెద్దలను నూరుమందిని కూర్చుండబెట్టుడు. ప్రయోజనము సున్న. ఇందులకై చేయు ప్రయత్నములు నిరర్థకములు. అందులకై వెచ్చించు సొమ్ము గంగలో బోయుట యగుచున్నది. మహాసభలయందు నమ్మక మున్నవారు నూటికి ఒకరైన కలరా? వదలజాలకయు, పునాదినుంచి ప్రారంభించు ఓపిక లేకయు,

అవస్థపడుచున్నారు ఈలోపములను గ్రహించియే గోపాలకృష్ణ గోఖలేగారు ప్రారంభోచిత నిర్బంధ విద్యాశాసనమును ప్రవేశపెట్టెను. ప్రభుత్వమువా రంగీకరింపలేదు. పోనిండు. మనకర్తవ్యమును మనము నెరవేర్చుటకై ప్రయత్నించెదము. ప్రభుత్వమువారు మనకు పన్నులువేసి చేసెడిపని మనంతటమనమేల చేయకూడదు. కనుక ఆపని మనము చేయబూనెదము.

మనదేశములో చదువుకొన్నవారికి ముందుగ చదువుపై అభిరుచి కలిగించెదము. చదువుమానినతోడనే పల్లెటూరికాపు మొదలుకొని బి. ఏ. ప్యాసయిన యూనివర్సిటీ పుస్తకములను మూలనువైచి తర్వాత ఎప్పుడగునను పుస్తకము తెరచిన పాపమునపోరు. పల్లెటూరువారు ఏపత్రికలతో ఏతప్పుసాక్ష్యములతో ఏజూదములలో ఏవ్యాజ్యములతో తమశక్తిసామర్థ్యములను, ధనమును, విద్యను ధారవోయుచున్నారు. ఇకను బి. ఏ. ప్యాసయిన యువకుడన్ననో గొప్పవానికంటె బుద్ధిశాలి కాడు. ఏపెద్దబల్లయొద్దనో కూర్చొని కాలము గడపుచు కూపస్థమండూకమువలె తనజీవయాత్రను గడపును. వీరిద్దరికి ఇట్టిగతి పట్టుటకు కారణమేమి? చదువుకొనుటకై తగిన యవకాశములు లేకపోవుటచేతనే. గ్రంథాలయములు ఎప్పుడువర్ధిల్లెనో అప్పుడే, వీరి కన్నులు జ్ఞానవంతములగును. ఈమార్పు గ్రంథాలయములను విశేషముగదర్శించువారికి స్పష్టముగ తేటపడును. అట్టిమార్పు కలుగని మూలములేదని నేను చెప్పజాలను గాని, అప్పుడుగూడ వారికి విద్యయం దభిలాష కలుగదేని వారిగతి అధోగతియని చెప్పనగును.

ప్రతిగ్రంథాలయమునకును చందాలిచ్చు సభ్యులున్నారు; పనిచేయువారలు కొందరున్నారు. ఈపనిచేయువారలు చాలమంది నిరుద్యోగులైయున్నారు. వీరు తీరికచేసికొని కొందరుబీదలకు చదువుచెప్పవచ్చును. క్రైస్తవమత ప్రచారకుల సంఘమువారు, ఊరికొకబడి పెట్టుచున్నారు. అంతయు వారి దాతృత్వ మనుకొని మోసపోవుచున్నారు వారికి ఈపాఠశాలలవలన ఎంతవ్యయమగుచున్నదో లెక్కచూచెదము. బహుస్వల్పము. వారుఖర్చుపెట్టు సొమ్ములోచాలభాగము ప్రభుత్వమువారినుండి గ్రాంటుల రూపమునవచ్చును. కనుక మనముగూడ శక్తికొలది ప్రయత్నించి గ్రంథాలయముల పక్షమున పాఠశాలలనుగూడ స్థాపించవలయును. ఈపాఠశాలలద్వారా చదువురానివారికి విద్యాదానమును చేయవలయును. కేవలము నాలుగుపుస్తకములనొకమూల పెట్టుకొని కూర్చుండినచో లాభములేదు. గోపాలకృష్ణ గోఖలేగారి జ్ఞాపకార్థము చెన్నపట్టణములో నొక హాలును వేయించినంతమాత్రమున ఆయనయాత్మ శాంతికలుగదు. దేశములో నెల్లెడల విద్యావ్యాప్తి చేయుటయే ఆయన స్మరణచిహ్నమును నెలకొల్పుట. ఇట్టియుత్కృష్ట కార్యమును చేయుటకవకాశముకలదు. కనుకనే ఈయుద్యమము దేశాభివృద్ధికి అత్యవసరమని చెప్ప సాహసించుచున్నాను. ఆంధ్రదేశమున, ౪౦౦ గ్రంథాలయముల యభివృద్ధికై పాటుపడువారి సంఖ్య అధమము ౪౦౦ లకంటె తక్కువయుండదు. ఈనాలుగువందల మంది సాధారణముగ ఉత్సాహవంతులును, దేశసేవాతత్పరులును, అగు యువకులైయున్నారు. వీరికి మరియొకపని యేమియులేదు. వీరి యుద్యమొక్కటియే. వీరి యూహ యొక్కటియె. ఇట్టి దేశారాధకపరుల యొక్కశక్తిని ఫలవంతముగ చేయుటకై దేశీయులెల్లరు ప్రయత్నించవలయును. స్థాబలిమి యుండుటవలన వీరు పల్లెటూళ్ళయందు ఎక్కువ పనిచేయుట కవకాశములు కలవు. ఎవరో ముఖమెరుగనివారు వెళ్ళి ఎన్నియుపన్యాసము లిచ్చినను వారికి రుచింపదు. కావున ఈ ౪౦౦ ల మందికి తగినశిక్ష నొసంగి వారియొక్క దేశాభిమానమును- పల్లెటూరి జనులయందు జ్ఞానాభివృద్ధిని చేయుటయందు వినియోగించినచో, అద్భుతమైన అభివృద్ధి కన్పింపగలదు.

ప్రతిగ్రంథాగారమును పాలించుటకై కార్యనిర్వాహకసంఘముగలదు. ఈకార్యనిర్వాహకసంఘములు గ్రంథాలయములయొక్క పరిపాలన సరిగా చేయుట ఎప్పుడు సంభవించునో అప్పుడే స్వపరిపాలనశక్తి లభించుచున్నది. గ్రంథాలయమున్నచోట పరపతిసంఘమును అవసరమైన ఇతర ప్రతిష్ఠాపనలను గూడ స్థాపించుట మిక్కిలి సులభమగు కార్యము.

కావున, దేశప్రముఖులారా! దేశముయొక్క స్థితి నారయుడి! పునాదినుండి దేశముయొక్క స్థితిని బాగుపరచుటకై ప్రయత్నింపుడి! ఈవత్సరము మేనెలలో విశాఖపట్నంజిల్లా అనకాపల్లియందు ఐదవఆంధ్రదేశ గ్రంథాలయప్రతినిధుల మహాసభ జరుగనున్నదిగదా! అప్పుడు, దేశప్రముఖులందరును విచ్చేసి ఈయుద్యమము దేశమును ఇంకను ఎక్కువ ప్రకాశవంతముగ చేయునటుల చేయుదురుగాక.

—గోపరాజు బ్రహ్మానందము.

# విషయసూచిక


తుమ్మెదా! (పద్యములు). ౪౧

గాయత్రోలు సుబ్బారావుగారు.

మనుచరిత్రము మానవజీవితము. ౪౨

మండపాక పార్వతీశ్వరశాస్త్రిగారు.

పుష్పవిలాపము. ౪౮

వేంకటపార్వతీశ్వరకవులు.

అనవేమున ఉప్పుగల్లు శాసనము. ౪౯

శేషాద్రిరమణకవులు.

పగపకుమారితల్లి - పగపకుమమ్మ. ౫౪

మండపాక పార్వతీశ్వరశాస్త్రిగారు.

ఆర్యసమాజమతము - తద్విమర్శము. ౫౫

కనుపర్తి మార్కండేయశర్మగారు.

గ్రంథవిమర్శనము - "పద్మావతి" (శే. ర. క.) ౬౦

మూడవ కృష్ణామండల గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ. ౬౯

ఆహ్వాన సంఘాధ్యక్షుల ఉపన్యాసము. ,,

అధ్యక్షుల ఉపన్యాసము. ౬౩

తీర్మానములు. ౭౨

మూడవ గుంటూరుమండల గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ. ౭౩

అధ్యక్షుల ఉపన్యాసము. ౭౪

తీర్మానములు. ౮౦

ఆంధ్రపరిశోధక మహామండలి, పిఠాపురం. ౮౧

జనసామాన్యమందలి విద్య. ౮౨

కోన వేంకటరాయశర్మగారు.


---

# చిత్రపటము


ఆంధ్రపరిశోధక మహామండలి - లిఖితపుస్తకమాతృగ్రంథాలయము. ౪౧

RSVM01A-108

## రాజపోషకులు

శ్రీ శ్రీ రాజా రావు వేంకటకుమారమహీపతి సూర్యారావు బహద్దరుగారు

శ్రీ శ్రీ రాజా నాయని వేంకట రంగారావు బహద్దరుగారు

శ్రీ శ్రీ బెల్లంకొండ రాఘవరావుగారు, అగ్రహారందారు

## పోషకులు

శ్రీ శ్రీ రాజా మంతెన గంగరాజుగారు

శ్రీ శ్రీ రాజా గోవిందకృష్ణ యాచేంద్ర బహద్దరుగారు

శ్రీ శ్రీ రాజా కోటగిరి వేంకటకృష్ణారావు బహద్దరుగారు

శ్రీ ముద్దుల రామయ్యగారికుమారుడు వేంకటచిన్నరాజు శ్రేష్ఠిగారు

చిగురుపాటి వేంకటసుబ్బారావుగారు

బాడి వేంకటకృష్ణయ్యగారు

శ్రీ లక్ష్మీకాంత పుస్తకభాండాగారము, కొప్పెరప్పాడు

నాళం కృష్ణారావుగారు

కుప్పా శ్రీరామశర్మగారు

పోణకా పట్టాభిరామారెడ్డిగారు

## అభిమానులు

శ్రీ శ్రీ రాజా చెలికాని లచ్చారావుగారు

అనుముల్లి గోపాలకృష్ణయ్యగారు, ప్రొప్రైటరు

పెద్దిభొట్ల వీరయ్యగారు, బి.ఏ., బి.యల్.,

అయ్యదేవర కాళేశ్వరరావుగారు, బి.ఏ., బి.యల్.,

సూరి వేంకటనరసింహశాస్త్రిగారు, బి.ఏ.

గూడూరి లక్ష్మణరావుగారు, బి.ఏ.

అద్దంకి సత్యనారాయణ శర్మగారు

బొడ్డపాటి హనుమంతరావుగారు

చట్టి నరసింహారావుగారు

## సహాయులు

సూట వేంకటరత్నం నాయుడుగారు

# నవలలు-గ్రంథాలయములకు మంచి తరుణము.

రు 30 ల విలువగల 58 పుస్తకములు రు 20 లకే యిచ్చుచున్నాము.

నిలయమునఁ చందాదారులుగాఁ చేరినచో రు 30 ల పుస్తకములు రు 16 లకే యిచ్చెదము.

గ్రంథనిలయ మీవరకు పెద్దవియు, చిన్నవియు, క్యాలికోబైండుకలవియు, పేపరుబైండుకలవియునగు 68 గ్రంథములను ప్రకటించినది. వానిలో 10 గ్రంథములు మరల ముద్రింపవలసియున్నది. ఇప్పుడునిలవయున్న 58 గ్రంథములుకూడఁ జాలఁదక్కువగనున్నవి. ముందుగదరఖాస్తుల నంపుకొన్న గ్రంథాలయములవారికే యీ పుస్తకములన్నియు దొరకును. ఆలసించినచో నవియును దొరకనేరవు. కాగితము దొరకకుండుటచే ఒక వత్సరమువఱకును ముద్రించుటకుకూడ వీలులేదు. వలసినవారు వెంటనే మాకు వ్రాసికొనవలయును. పైవిధముగ చందాదారులుగ చేరకుండగాని, చేరిగాని మా గ్రంథములన్నియుఁ గావలయునని కోరువారు రు 5 లు ముందుగా అడ్వాన్సు పంపవలెను. వలయువారిట్లు వ్రాయుఁడు:—

కార్యదర్శి, ఆంధ్రప్రచారిణీ గ్రంథనిలయము,
నిడదవోలు, కృష్ణాజిల్లా.

---

# యం. ఆర్. కృష్ణారావు అండు కంపెని,

నెల్లూరు.

## —♦ నవలలు ♦—

1. అమృతవల్లి వెల 1—4—0 లు. శ్రీమతి కంచనపల్లి కనకమ్మగారిచే రచియింపబడినది. ఒక అరవ నవలనుండి భాషాంతరీకరణము. మిక్కిలి జాలిపుట్టించుచు రసవంతముగనుండును.
2. రంగరాజు వెల రు 0—12—0లు. గ్రంథకర్త:—ముత్తరాజు సుందరరామయ్యగారు, బి.ఏ. చంద్రగిరి రాజ్యమునకు సంబంధించిన చరిత్రవిషయక నవల.
3. జగన్మోహిని వెల 0—8—0
4. ఇందిరావసుంధరము వెల 0—8—0
5. మంజుమతి వెల 0—10—0

(3–5) ఈ మూడు నవలలను శ్రీయుత సోమరాజు రామానుజరావుగారిచే రచియింపబడినవి.

6. కళావతి వెల 0—12—0 శ్రీయుత దొడ్ల వేంకటరామరెడ్డిగారు రచియించిన నవల.

## —♦ కవిజీవితములు ♦—

7. ఐదవజార్జిచక్రవర్తి
8. హార్డింజిప్రభువు
9. గోపాలకృష్ణగోఖలే

(7–9) ఈ మూడు గ్రంథములను శ్రీయుత మన్నేపల్లి రామకృష్ణారావుగారు రచియించిరి. వెల ప్రతి 1-కి 0—8—0. ర్యాపరు బైండు.

10. స్వామిరామతీర్థ యం. ఏ.
11. మహాదేవగోవిందరాణడే

(10–11) ఈ రెండు శ్రీయుత పి. వి. రంగారావుగారు రచియించిరి. వెల ప్రతి 1-కి 0—8—0 ర్యాపరు బైండు.

12. నివేదితాసోదరి. గ్రంథకర్త:—శ్రీయుత కో. రా. కృష్ణమాచార్లుగారు, బి.ఏ. వెల ప్రతి 1-కి 0—8—0
13. రంగశతకము శ్రీమతి కంచనపల్లి కనకమ్మగారు రచియించిరి. వెల 0—1—0.

ఈ గ్రంథములను ఒకేపర్యాయము తెప్పించుకొనువారికి రు 7—8—0 లు వెలగల ఈ 13 గ్రంథములను రు 6 లకే యిచ్చెదము. తపాలా ఖర్చులు కొనువారే భరించవలయును.

## When you Buy a book, try this test:-

ఒక గ్రంథమునుకొనునపుడు పరిశీలింపవలసిన ముఖ్యవిషయములు.

౧ అందముగనున్నదా?

౨ మంచిభాషయందు వ్రాయబడినదా?

౩ మనజీవిత విధానమును తెలుపునా?

౪ మన జ్ఞానమును అభివృద్ధిచేయునా?

౫ మనవ్యవహారమునకు ఉపకరించునా?

౬ హితమును బోధించునా?

౭ సన్మార్గజీవనమునకు సాయపడునా?

౮ మనజీవితములను సారవంతముచేయునా?

౯ ఆప్తునివలె ప్రేమింపతగియున్నదా?

ఈ విషయములన్నిటిని సంతృప్తిపరచగల మంచి గ్రంథముల ప్రకటనకొరకు, రాబోవు గ్రంథాలయ సర్వస్వముయొక్క ఈ పుటనే జూడుడు.

---

## సైనికులకు సహాయము.

దక్షిణాఫ్రికాయందు యుద్ధముచేయుచున్న యుద్ధభటులకు పత్రికలు, సబ్బుబిళ్లలు, తెల్లకాగితము, మొదలగు చిల్లరవస్తువులు కావలెను. అందరును సహాయముచేయుదురని ప్రార్థన. అక్కడకు పంపు వస్తువులకు పోస్టుబిళ్లలక్కరలేదు. ద్రవ్యమును వసూలుచేసి పంపెదరేని, వారికి ఆవశ్యకములగు గ్రంథములను, పత్రికలను, వస్తువులను కొనిపంపెదము. పత్రికలుమొదలగువానిని తమంతటతామే పంపదలచుకొన్నవారికి చిరునామాలు అచ్చువేసియున్న కాగితములను పంపెదము.

బెజవాడ,<br>౧౩—౪—౧౮.

ఇట్లు విన్నవించువిధేయుడు,<br>అయ్యంకి వేంకటరమణయ్య.

మనసు ఫౌండేషన్

పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | RSVM01 A 108 |
| పుస్తకం పేరు | [illegible] |
| తారీఖు | 7/6/24 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 57 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | III |
| లేని పేజీలు | NO |
| తయారు చేసినది | Sandhya |
| పేజీలు విడదీసినది | Sandhya |
| స్కాన్ చేసినది | Sandhya |
| పరీక్ష చేసినది | Pragathi |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| స్కాన్ చెయ్యనివి | |
| తప్పులు | NO |
| పరిస్థితి | good |